
గురువారం 18 జూన్ 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

# ఫీల్డ్ విజిట్‌లు చేయాల్సిందే



- అధికారుల పనితీరుపై 360 డిగ్రీల్లో విశ్లేషణ
- ఫిర్యాదులను అర్జీదారులే ట్రాక్ చేసేలా కొత్త వ్యవస్థ
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

*ప్రతిఒక్క అధికారి క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ నెల నుంచి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. అధికారులు, ఉద్యోగుల పనితీరుపై 360 డిగ్రీల్లో విశ్లేషిస్తామని చెప్పారు. డేటా డ్రివెన్ గవర్నెన్స్‌లో గూగుల్ మనతో కలిసి పనిచేయడానికి అంగీక రించింది. ఆయా శాఖల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులను అర్జీదారులే ట్రాకింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.*

2

## ఇంటింటికీ యోగాంధ్ర

*సంజీవని కార్యక్రమంతో అనుసంధానం ద్వారా యోగాను రాష్ట్రంలో ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు సూచించారు. ఆరోగ్యంపై అందరూ ధ్యాస పెట్టేలా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన యోగా డే కార్యక్రమం నిర్వహణపై అధికారులతో సచివాల యంలో సమీక్షించారు. ఇంటింటికీ యోగా ప్రధాన థీమ్‌గా ఏడాది పాటు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశిం చారు. ప్రముఖ యోగా గురుబాబా రాందేవ్‌తో కలిసి ఈనెల 20న ఉండవల్లి గుహల దగ్గర, 21వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు.*

3



### ఎల్‌నినోను అధిగమించేలా

## పంటల సాగు విధానం

- ప్రకృతి సేద్యం మరింత విస్తరించేలా కార్యాచరణ
- డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగుకు ప్రణాళికలు
- పంటల మార్పిడికి ఉన్న అవకాశాలు పరిశీలించాలి
- పొగాకు బయ్యర్లతో త్వరలో సమావేశం ఏర్పాటుచేయాలి
- వ్యవసాయ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



2

*ఎల్‌నినో కారణంగా ప్రత్యేక వాతావరణ పరిస్థితులు నెల కొన్న దృష్ట్యా రాష్ట్రంలో పంటల సాగువిధానంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాలపై సమీక్షించారు. రైతులు పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లేలా చర్యలు చేపట్టా ల్సిన అవసరం ఉందని సూచించారు. పొగాకు కొనుగోలుదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న పప్పు దినుసులు సాగు చేసేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించాలని నిర్దేశించారు. ఆక్వా ఫీడ్ తయారీ దారులతోనూ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.*

# మంగళగిరిని నెంబర్ 1గా తీర్చిదిద్దుతాం

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీని స్వయంగా పర్యవేక్షిస్తా
- కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ అదృష్టం
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- మంగళగిరి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నిడమర్రు ఆర్వోబీకి శంకుస్థాపనలు
- కాజ ఈస్ట్ లేక్ పార్క్ ప్రారంభం

- వివరాలు లోపలి పేజీల్లో ..



*మంగళగిరి నియోజక వర్గాన్ని అన్నిరంగాల్లో నెంబర్ 1గా తీర్చిదిద్దుతామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. నియోజకవర్గంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గెలిచిన మొదటిరోజు నుంచే మంగళగిరి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ముందుగా మంగళగిరి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్, నిడమర్రు ఆర్వోబీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుందరంగా తీర్చిదిద్దిన కాజ ఈస్ట్ లేక్ పార్క్‌ను ప్రారంభించారు. మంగళగిరిలో అభివృద్ధి చేసిన మహాప్రస్థానాన్ని సందర్శించారు.*



## సాయికృష్ణ అదృశ్యంపై విచారణ

- సీఐ సస్పెన్షన్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం
- డీజీపీ, సీఎస్, ఉన్నతాధికారులతో సమీక్ష
- పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

*విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ వ్యవహారంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును సస్పెండ్ చేయాలని సీఎం ఆదేశిం చారు. ఈ ఘటనపై సచివాలయంలో బుధవారం పోలీసు ఉన్న తాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఘటనపై సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.*

- వివరాలు 2 లో..

## డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధమా?



- మరోసారి జగన్‌రెడ్డికి లోకేష్ సవాల్
- పదేపదే అబద్ధాలు చెప్పి నమ్మించలేరు
- ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరని స్పష్టం

*మెగా డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధమని జగన్‌రెడ్డికి మంత్రి నారా లోకేష్ సవాల్ విసిరారు. ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వ హించాం. మళ్లీ టెట్ పరీక్ష నిర్వహిస్తున్నాం..ఆ తర్వాత మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మళ్లీ టీచర్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని వెల్లడించారు. వాస్తవాలు వెల్లడిస్తే కమాపణలు చెప్పకుండా బురదజల్లి పారిపోతున్నారు. మెగా డీఎస్సీపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమే.. జగన్‌రెడ్డి స్పందించాలని సవాల్ విసిరారు.*

- వివరాలు 3 లో..

## నేడు ఏక్యూఏఐసీ ప్రారంభం

- ఐబీఎంతో కలిసి అమరావతి క్వాంటం ఏఐ ఇన్నోవేషన్ సెంటర్




- వివరాలు 5 లో..

# ఫీల్డ్ విజిట్‌లు చేయాల్సిందే

- అధికారుల పనితీరుపై 360 డిగ్రీల్లో విశ్లేషణ
- ఫిర్యాదులను అర్జీదారులే ట్రాక్ చేసేలా కొత్త వ్యవస్థ
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు




అమరావతి(చైతన్యరథం): ప్రతిఒక్క అధికారి క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ నెల నుంచి అధికారులు క్షేత్రస్థాయి పర్యట నలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. బుధవారం సచివాల యంలో ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించా రు. పాలనా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు దాటింది. తప్పులు జరగకుండా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలి. లోపాలు ఏమైనా ఉంటే వాటిని ఏ విధంగా సరిచేయాలనే అంశం మీద ఫోకస్ పెట్టాను. అధికారులు, ఉద్యోగులు కూడా ఆ దిశగా ఆలోచన చేయాలి. ప్రజలకు సేవలు అందించే విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని ఆదేశించారు. ఫీల్డ్‌లోని సమస్యలను స్వయంగా పరిశీలిస్తే అధికార యంత్రాంగం మీద ప్రజల్లో మరిం త నమ్మకాన్ని పొందగలం. తనిఖీలు చేస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆ దిశగా ఉన్నతాధికారులు మొదలకుని క్షేత్రస్థాయి అధికారి వరకు అందరూ పనిచేయాలని, జూలై నెల నుంచి ప్రతి అధికారి ఫీల్డుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. వారంలో మూడురోజుల పాటు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల ని గతంలోనే చెప్పాం. దాన్ని తూచా తప్పకుండా అమలుచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు ప్రతి నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించాలని గతంలోనే సూచించాం. దాన్ని పక్కాగా అమలుచేయాలి. అలాగే నియోజకవర్గాల నోడల్ అధికారులు నెలలో ఒకే మండలాన్ని నాలుగుసార్లు సందర్శించాలి. అధికారులు, ఉద్యోగుల పనితీరుపై 360 డిగ్రీల్లో విశ్లేషిస్తామని చెప్పారు.

### దేవాదాయ శాఖ పనితీరు మరింత మెరుగవ్వాలి

దేవాలయాల్లో భక్తులకు మరింత సేవలు అందించేలా దేవదాయ శాఖ మరింత ఫోకస్ పెట్టాల్సిన అవసరం కన్పిస్తోంది. దేవదాయ శాఖ ఉద్యోగుల పనితీరు మరింత మెరుగుపడాలి. అన్ని శాఖల్లోని ఉద్యోగుల పనితీరు ఎప్పటికప్పుడు మెరుగుపడాలి. ఈ మేరకు ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇప్పించాలి. పరిపాలనలో సింగపూర్ దేశం వినూత్న విధానాలను అవలంభి స్తోంది. పరిపాలన విషయంలో ఆ దేశ విధానాలను పరిశీలించాలి. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మొత్తంగా 11,600 గుంతలు ఉన్నట్టు గుర్తించాం. వీటిల్లో 79 శాతం గుంతలను పూడ్చాం. మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలి. ముఖ్యంగా అర్బన్-రూరల్ కనెక్టివిటీ రోడ్లల్లో మరమ్మతులు త్వరగా చేపట్టాలి. అలాగే రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు సంబంధించి ఆర్ అండ్ బీ మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

### గవర్నెన్స్‌కు టెక్నాలజీ కనెక్ట్.. గూగుల్ అంగీకారం

డేటా డ్రివెన్ గవర్నెన్స్‌లో గూగుల్ మనతో కలిసి పని చేయ డానికి అంగీకరించింది. వాణిజ్య పన్నుల శాఖ ఇప్పటికే గూగుల్ తో కలిసి పనిచేస్తోంది. ఆ దిశగా మిగిలిన శాఖల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పీజీఆర్ఎస్‌లో ప్రజలిచ్చిన ఫిర్యాదు లను త్వరితగతిన పరిష్కరించాలి. ఈ మేరకు అర్జీదారులే స్వయంగా వారి అర్జీలను ట్రాక్ చేసుకునే అవకాశం కల్పించాలి. తామిచ్చిన ఫిర్యాదు ఏ మేరకు పరిష్కారమవుతోందోననే అంశాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా ట్రాకింగ్ విధానాన్ని అందుబా టులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.

## సాయికృష్ణ అదృశ్యంపై విచారణ

- సీఐ సస్పెన్షన్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం
- డీజీపీ, సీఎస్, ఉన్నతాధికారులతో సమీక్ష
- పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్




అమరావతి(చైతన్యరథం): విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ వ్యవహారంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును సస్పెండ్ చేయాలని సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై సచివాల యంలో సీఎం చంద్రబాబు బుధవారం పోలీసు ఉన్నతాధికారులతో సమీ క్షించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. సింగపూర్ పర్యటన ముగించుకుని సచివాలయానికి వచ్చిన సీఎం వెంటనే పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఎం, డిప్యూటీ సీఎంకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సహా పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. సాయికృష్ణ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగ రాజుపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశాలిచ్చారు. దీనిపై సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవా లని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచనలు చేశారు. ఈ సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు తదితరులు హాజరయ్యారు.

## ఎల్‌నినోను అధిగమించేలా

# పంటల సాగు విధానం



- ప్రకృతి సేద్యం మరింత విస్తరించేలా కార్యాచరణ
- డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగుకు ప్రణాళికలు
- పంటల మార్పిడికి ఉన్న అవకాశాలు పరిశీలించాలి
- పొగాకు బయ్యర్లతో త్వరలో సమావేశం ఏర్పాటుచేయాలి
- వ్యవసాయ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- కష్టకాలంలో రైతులను ఆదుకోవటమే ధ్యేయమని స్పష్టం

అమరావతి(చైతన్యరథం): ఎల్‌నినో కారణంగా ప్రత్యేక వాతావరణ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రాష్ట్రంలో పంటల సాగు విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదే శించారు. పంటల మార్పిడికి ఉన్న అవకా శాలను పరిశీలించాలని సూచించారు. సచివాలయంలో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాలపై సమీక్షించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచు కుని వ్యవసాయ,వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై రైతులకు సూచనలు ఇవ్వాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని రైతులు పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యంవైపు మళ్లేలా చర్య లు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచిం చారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో సర్టిఫికేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడు తున్నారని.. ఈ విషయాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉంద ని పేర్కొన్నారు. రైతులను చైతన్యపరిచే కార్యక్రమాల్లో తాను కూడా పాల్గొంటానని తెలిపారు. శాస్త్రీయ విధానంలో పంటలు సాగును తెలియచేయాల్సి ఉందని స్పష్టం చేశారు. మిర్చి, పొగాకు, తోతాపురి మామిడి ఉత్పత్తులకు సంబంధించిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పొగాకు కొనుగోలుదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గిట్టుబాటు ధర వచ్చే వరకూ నిల్వ చేసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న పప్పు దినుసులు సాగు చేసేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించాలని.. తద్వారా రైతులకు ప్రయోజనం కలిగించాలని నిర్దేశించారు. మార్కెట్‌లో ఉన్న ఉత్పత్తులతో పాటు ప్రస్తుతం సాగు దశలో ఉన్న పంటలను కూడా ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తదుపరి నిర్ణయాలు తీసుకో వాలని చెప్పారు. వ్యవసాయం, ఉద్యాన పంటల విషయంలో అదనపు విలువ జోడించాలని సూచించారు. ఆక్వా రైతులు, అసోసియేషన్లతో పాటు ఆక్వా ఫీడ్ తయారీదారులతోనూ సమా వేశం నిర్వహించాలని ఆదేశించారు. కష్టకాలంలో ఉన్న రైతులను ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధి కారులు హాజరయ్యారు.

చైతన్యరథం

# ఇంటింటికీ యోగా థీమ్‌తో యోగాంధ్ర

- ఏడాది పాటు కార్యాచరణ ప్రణాళిక అమలు
- ప్రజారోగ్యం కోసం సంజీవనితో అనుసంధానం
- అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 1.33లక్షల సెంటర్లలో ఏర్పాట్లు
- యోగా డే కోసం కోటి దాటిన రిజిస్ట్రేషన్లు
- ప్రత్యేక అతిథిగా రానున్న బాబా రాందేవ్
- 20, 21 తేదీల్లో సీఎంతో కలిసి హాజరు



అమరావతి(చైతన్యరథం): సంజీవని కార్యక్రమం తో అనుసం ధానం ద్వారా యోగాను రాష్ట్రంలో ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఆరోగ్యంపై అందరూ ధ్యాస పెట్టేలా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టంచేశారు.ఈనెల 21న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన యోగా డేకార్యక్రమం నిర్వహ ణపై అధికారులతో సచివాలయంలో బుధవారం సమీ క్షించారు. యోగాంధ్ర నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారికి అన్ని సౌక ర్యాలు కల్పించాలని నిర్దేశించారు.అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన యోగా మాస్టర్ ట్రైనర్లకు వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు ప్రత్యేక పురస్కారాలు అందజేయాలని సూచించారు. ఇంటిం టికీ యోగా ప్రధాన థీమ్‌గా ఏడాది పాటు కార్యా చరణ ప్రణాళిక చేయాలన్నారు. వివిధ వైద్య సమస్య లు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక థెరప్యూటిక్ యోగా కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయాలని చెప్పారు. ఈసారి యోగా డేకు రాష్ట్రానికి ప్రత్యేక అతిథిగా వస్తున్న ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్‌తో కలిసి ఈనెల 20న ఉండవల్లి గుహల దగ్గర జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. 21వ తేదీన విజయ వాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్టేడియంలో 5 వేల నుంచి 6 వేల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూడా బాబా రాందేవ్ సహా ముఖ్యమంత్రి హాజరవుతారు. వర్షం కారణంగా ఏమైనా అవాంతరం తలెత్తితే ప్రత్యామ్నాయంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో వెయ్యి మందితో స్టేట్ ఈవెంట్ నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యోగా ప్రచారంలో భాగంగా 19వ తేదీనే రాష్ట్రానికి వస్తున్న బాబా రాందేవ్ అదేరోజు ముఖ్యమంత్రితో సమావేశమవుతారు. యోగాంధ్రలో భాగంగా ఇప్పటివరకు 2.6 లక్షల మందిని ట్రైనర్లుగా తీర్చిదిద్దినట్టు అధికారులు ముఖ్యమం త్రికి వివరించారు. 21న యోగాడేలో పాల్గొనేందుకు ఇప్పటికే కోటికి మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు వివరించారు. 21న 1.33 లక్షల సెంటర్లలో యోగా కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని సీఎంకు తెలిపారు. 21 తేదీన 'యోగా ఏ డెస్టినేషన్' పేరుతో వచ్చే ఏడాది యోగా డే వరకు క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమీక్షకు ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణరాజు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, ఆ శాఖ సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.

## డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- మరోసారి జగన్‌రెడ్డికి లోకేష్ సవాల్
- పదేపదే అబద్ధాలు చెప్పి నమ్మించలేరు
- ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరని స్పష్టం

మంగళగిరి(చైతన్యరథం): మెగా డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధమని జగన్‌రెడ్డికి మంత్రి నారా లోకేష్ సవాల్ విసిరారు. ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించాం. హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ ను అధ్యయనం చేసి కచ్చితమైన నోటిఫికేషన్ ఇచ్చాం. 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. మళ్లీ టెట్ పరీక్ష నిర్వహిస్తున్నాం..ఆ తర్వాత మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మళ్లీ టీచర్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని వెల్లడించారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు. సాక్షి క్యాలెం డర్ కాదు.. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. మొదటిసారి హారిజాంటల్ రిజర్వేషన్ అమలు చేశాం. దీని గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత యువతపై ఉంది. హారిజాంటల్ రిజర్వేషన్ పాటించకపోతే సబర్వాల్ జడ్జిమెంట్ అనేది ఉంది. ఆ జడ్జిమెంట్‌ను అడ్డం పెట్టుకుని వైసీపీనే కోర్టులో వేసి స్టే తీసుకు వస్తారు. వైసీపీ నాయకులే డీఎస్సీపై



240 కేసులు వేశారని గుర్తుచేశారు. ఐదేళ్లలో జగన్‌రెడ్డి ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఇచ్చి ఉంటే హారిజాంటల్ రిజర్వేషన్ అంటే ఏమిటో అర్థమై ఉండేది. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ కులం కార్డు కూడా తీసుకు వచ్చారు. దౌర్భాగ్యం ఏమిటంటే 2014-19 మధ్య కూడా డీఎస్పీ ప్రమోషన్లలో ఒకే సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇచ్చారని దుష్ప్ర చారం చేశారు. ప్రజలు కూడా నమ్మారు. తర్వాత వాస్తవాలు బహిర్గతమయ్యాయి. ఇప్పుడు కూడా పనికిమాలిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని ముందుపెట్టుకుని స్పోర్ట్స్ కోటాలో ఒకే సామాజికవర్గం వారికి ఉద్యోగాలు ఇచ్చారని దుష్ప్రచారం చేస్తున్నారు. మేం వాస్త వాలు బహిర్గతం చేశాం. సదరు వ్యక్తి కమాపణలు చెప్పాలి కదా. బురదజల్లి పారిపోతున్నారు. జగన్‌రెడ్డి ఇంటికి 200 మీటర్ల దూరంలోనే ఉన్నా ఎప్పుడైనా చర్చకు సిద్ధమే. మా సమాధానా లపై జగన్‌రెడ్డి స్పందించాలని సవాల్ విసిరారు.

## టీడీపీలోకి నూతక్కి వైసీపీ నేతలు

### కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి లోకేష్







ఉండవల్లి(చైతన్యరథం): మంగళగిరి నియోజకవర్గం నూతక్కి గ్రామానికి చెందిన వైసీపీ నేత కొత్తపల్లి మోహనరావు మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన మోరంపూడి గోపాలకృష్ణ, నూతక్కి జనార్ధన రావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, జూకపల్లి మధుబాబు, కే.కోటేశ్వర రావు, జిలుగు రాజు, బి.ఇస్సాకు, నూతక్కి వెంకటరావు, శ్రీనివాస రావు, నూతక్కి కోటేశ్వరరావు టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో వీరందరికీ పసుపు కండువాలు కప్పి మంత్రి లోకేష్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో రెండేళ్లలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టా మన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించా లని, ప్రతిపక్షం దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస రావు, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు మున్మిడి సత్యనారాయణ, మంగళ గిరి మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, మంగళగిరి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, నూతక్కి గ్రామ పార్టీ అధ్యక్షుడు వల్లూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# మంగళగిరిని నెంబర్ 1గా తీర్చిదిద్దుతాం

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీని స్వయంగా పర్యవేక్షిస్తా
- కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ అదృష్టం
- పులివెందుల ఎమ్మెల్యే ఇక్కడ నివాసం ఉంటే
- రెండేళ్ల కాలంలో ఏం చేశామో కనిపిస్తుంది
- ఎవరి ఓట్లు తొలగించాల్సిన అవసరం మాకు లేదు
- గొడ్డలి బ్యాచ్‌కు మహిళలను గౌరవించడం తెలియదు
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్




తాడేపల్లి(చైతన్యరథం): అన్నిరంగాల్లో మంగళగిరి నియోజక వర్గాన్ని నెంబర్1గా తీర్చిదిద్దుతామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 2019లో 5,300 ఓట్ల తేడాతో మంగళగిరిలో నేను ఓడిపోయాను. మొదటిరోజు బాధ, ఆవేదన కలిగింది. రెండోరోజు ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఊరూరా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నా. నా కోరికను మన్నించి రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజార్టీతో గెలిపించారు. గెలిచిన మొదటిరోజు నుంచే మంగళగిరి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ పవర్ మొత్తం మంగళగిరి నియోజకవర్గానికి ఏర్పాటు చేస్తున్నాం. దుగ్గిరాలలో అన్న క్యాంటీన్ ప్రారంభించాం. లైబ్రరీల కు పూర్వవైభవం తీసుకువస్తున్నాం. మంగళగిరి పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. పార్కులు, లేక్‌లు, కమ్యూనిటీ భవనాలు, చివరకు శ్మశానాలను కూడా అభివృద్ధి చేస్తున్నాం. రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఇంకా చేయా ల్సినవి చాలా ఉన్నాయి. మంగళగిరికి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను తీసుకువచ్చాం. ఎంపీ పెమ్మసాని కేంద్రంతో మాట్లాడి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద మంగళగిరికి మంజూరు చేయించారు. ఇది మంగళగిరి ప్రజల అదృష్టం. మంగళగిరి నియోజకవర్గ వాసిగా ఈ ప్రాజెక్ట్‌ను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తా. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించాను. అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గం నెంబర్ 1గా ఉండా లనేది లక్ష్యం. ఇందుకోసం అహర్నిశలు కష్టపడతా. రాజకీయా లు, ప్రభుత్వ కార్యక్రమాలకు మోడల్‌గా మంగళగిరిని తీర్చిదిద్దు తాం. మిగతా నియోజకవర్గాల్లో కూడా దశలవారీగా పనులు చేపడతామని తెలిపారు.

## పులివెందుల ఎమ్మెల్యే బెంతాహై

ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వృద్ధు లకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6వేలు, ప్రతిఏడాది ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్ల పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉన్నా ఆర్థికసాయం అందిస్తున్నాం. మత్స్యకార సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో, అన్నదాత సుఖీభవ కింద కేంద్రం, రాష్ట్రం కలిసి రూ.20 వేలు అందిస్తున్నాం. ఇచ్చిన హామీలు పద్ధతి ప్రకారం నెరవేరుస్తున్నాం. పులివెందుల ఎమ్మెల్యే బెంగళూరులో కాకుండా ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయి. బెంగళూరులో మూడు రోజులు, తాడేపల్లిలో ఒకరోజు, హైదరాబాద్‌లో మూడురోజులు ఆయన నివసిస్తారు. అందుకే ఆయన బెంతాహై అని వ్యాఖ్యానిం చారు.

## పకడ్బందీగా ఓట్ల నమోదు మా లక్ష్యం

ఎవరి ఓట్లు తీయాల్సిన అవసరం మాకు లేదు. ఓటు నమోదు పకడ్బందీగా చేయాలనేది మా లక్ష్యం. కావాలనే మాపై ఆరోప ణలు చేస్తున్నారు. పబ్లిక్‌లో ఉన్న డేటానే మా వద్ద కూడా ఉంది. వైసీపీకి ఐటీలో అవగాహన లేదు కాబట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లా డతారు. ఒక యాప్ తయారు చేసి మా కార్యకర్తలకు సులభతరం చేశాం. విజనరీకి, ప్రిజనరీకి చాలా తేడా ఉంటుంది. ప్రిజనరీ ఎప్పుడూ జైలు వైపు చూస్తాడు. ఆయన చుట్టూ ఎప్పుడూ రౌడీలు ఉంటారు. మహిళలను కించపరిచే వారు ఉంటారు. విజనరీ ఎప్పుడూ ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయి. ఇందుకు బ్రాండ్ సీబీఎన్ కారణం. 76 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు ఆయనే కొబ్బరికాయ తీసుకుని కొడతారు. సైకిల్ తొక్కుతారు. పులివెందు ల ఎమ్మెల్యే అది కూడా చేయలేరని పేర్కొన్నారు.

## జగన్‌రెడ్డీ.. ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం?

ఇండస్ట్రీకి, కోడిగుడ్డుకు తేడా తెలియని వ్యక్తి ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ తీసుకురాలేదు. ఉన్న పరిశ్రమలు తరిమేశారు. హోం మంత్రి అనితపై కోడిగుడ్డు మంత్రిగా పనిచేసిన వ్యక్తి కించపరి చేలా మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలు చాలా బాధాకరం. గుడివాడ అమర్‌నాథ్‌ను చాలా బాగా చేశావని జగన్‌రెడ్డి పొగిడా రంట. అసలు వీరు ఎక్కడికి పోతున్నారు? ఇదేవిధంగా భారతీ రెడ్డి గారి గురించి, మీ ఇద్దరు కూతుళ్ల గురించి మాట్లాడితే సమర్థిస్తారా? ఇదేనా మీరు మహిళలకు ఇచ్చే గౌరవం? అధికా రంలో ఉన్నప్పుడు మా తల్లిని అవమానించారు. బ్రాహ్మణిని అవమానించారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మా కార్యకర్త పొరపాటున భారతీరెడ్డి గారి గురించి మాట్లాడితే క్షమాపణే కాదు.. అతడిని జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపిన ఘనత ప్రజాప్రభుత్వానిది. అదీ మహిళల పట్ల మా గౌరవానికి నిదర్శనం. గొడ్డలి బ్యాచ్‌కు మహిళలను గౌరవంచడం తెలియదు. జగన్‌లో జీ అంటే గొడ్డలి అని వ్యాఖ్యానించారు.

## 18 నెలల్లో నిడమర్రు ఆర్వోబీ నిర్మాణం పూర్తిచేయాలి

నిడమర్రు ఆర్వోబీ నిర్మాణం 25 ఏళ్ల కల. కేంద్రంతో సంప్రదింపులు జరిపి వచ్చే 20 ఏళ్ల ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకుని బ్రిడ్జిని నిర్మించుకోవడం జరుగుతుంది. 18 నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించాం. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మంగళగిరి నియోజక వర్గంలో చేపట్టడం జరుగుతోంది. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను కూడా నిర్మిస్తున్నాం. ఇందుకు సుమారు రూ.1,200 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మంగళగిరి పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతోంది. తాగునీటి ప్రాజెక్ట్ పనులు ఇప్ప టికే ప్రారంభం అయ్యాయి. కేంద్ర మంత్రులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ మంగళగిరి పనులు పూర్తిచేస్తున్నాం. అండర్ గ్రౌండ్ పవర్‌తో పాటు అండర్ గ్రౌండ్ వాటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ గ్యాస్ కూడా ప్రతి ఇంటికి అంది స్తాం. నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తాం. ఒక మోడల్‌గా మహాప్రస్థానం ఏర్పాటు చేశాం. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దు తాం. గత పాలకులు వెస్ట్ బైపాస్‌ను సరిగా డిజైన్ చేయలేదు. ఒక్క ఎగ్జిట్ కూడా రాజధానికి ఉండకూడదనే దుర్బుద్ధితో వ్యవహరిం చారు. జగన్‌కు అమరావతిపై కక్ష ఉంది. అవసరమైన మేరకు తాము ఎగ్జిట్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..

- సత్యనారాయణ ఇంటి నిర్మాణానికి మార్కింగ్
- కామధేనువులంకలో భూమిపూజ చేసిన అధికారులు
- నిర్ణీత గడువులోపు పూర్తిచేసేలా చర్యలు

అమరావతి(చైతన్యరథం): పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామధేనువు లంక గ్రామానికి చెందిన చంద్రబాబు అభిమాని సత్యనారా యణకు సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నారు. సత్యనారాయణ ఎంతో కాలంగా సీఎం చంద్రబాబుని చూడాలని ఉందని ఓ యూట్యూబ్ చానల్‌లో పేర్కొన గా సోషల్ మీడియాలో వైరల్‌అయింది. దానికి సీఎం చంద్రబాబు స్పందిస్తూ తాను సిద్ధాంతం వస్తున్నానని అప్పుడు కలుద్దామని రిప్లై ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు సత్యనారాయణను కలిశారు. సత్యనారాయణ అడగకుండానే ఆయనకు వరాలు ఇచ్చారు. హామీలో భాగంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆదేశించారు. దాంతో అధికారులు ఇచ్చిన హామీ అమలు చేయడం ప్రారంభించారు. బుధవారం ఇంటి నిర్మాణా నికి పూజ అనంతరం మార్కింగ్ ఇచ్చారు. నిర్ణీత గడువులోపు నిర్మాణం పూర్తి చేసి ఇస్తామని అధికారులు చెప్పారు.







## గుంటూరు పార్లమెంట్ ప్రజాప్రతినిధుల

# ఆత్మీయ విందు సమావేశం

### హాజరైన మంత్రి నారా లోకేష్



గుంటూరు(చైతన్యరథం): జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు నివాసంలో గుంటూరు పార్లమెంట్‌కు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు సమావేశం జరిగింది. గోరంట్లలోని పిల్లి మాణిక్యరావు



నివాసంలో జరిగిన ఈ ఆత్మీయ విందు భేటీకి మంత్రి నారా లోకేష్ హాజర య్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రభుత్వం రెండేళ్ల పాలన, ప్రభు త్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సర్ ప్రక్రియ, త్వరలో జరగనున్న స్థానికసంస్థల ఎన్నికలు, పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై నేతలు చర్చించారు. ఈ సమావేశంలో గుంటూరు ఎంపీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, గుంటూరు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.




## అమర్‌నాథ్‌పై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

అమరావతి(చైతన్యరథం): హెూంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఏపీ మహిళా కమిషన్‌కు మహిళా నాయకులు బుధవారం ఫిర్యా దు చేశారు. అమర్‌నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలకు చెందిన మహిళా నేతలు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. హోంమంత్రి అనితను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఒక మహిళా ప్రజాప్రతినిధి గౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు, విధానాలు, నిర్ణయాలకే పరిమితం కావాలని.. మహిళల వ్యక్తిత్వం, రూపురేఖలు, వ్యక్తిగత అంశాలను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సమాజానికి తప్పుడు సందేశాలను పంపుతుందని తెలిపారు. సమగ్ర విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మహి ళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ స్పందిస్తూ మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుం దన్నారు. అందిన ఫిర్యాదును పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## నేడు ఏక్యూఏఐసీ ప్రారంభం




- ఐబీఎంతో కలిసి అమరావతి క్వాంటం ఏఐ ఇన్నోవేషన్ సెంటర్
- 380 క్వాంటం ఇన్నోవేషన్ సెల్స్ ద్వారా అల్గారిథమ్స్, అప్లికేషన్ల అభివృద్ధి
- క్వాంటం అప్లికేషన్ల అభివృద్ధిలో 3వేల మంది ప్రొఫెసర్లు, విద్యార్థులు
- అమరావతి క్వాంటం వ్యాలీలో కీలకం కానున్న ఏక్యూఏఐసీ

అమరావతి (చైతన్యరథం): అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా అమరావతి క్వాంటం-ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ (ఏక్యూఏఐసీ) గురువారం ప్రారంభం కానుంది. ఐబీఎం సహకారంతో క్వాం టం ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు అవుతోంది. ప్రపంచస్థాయి క్వాంటం ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ ఏర్పాటులో భాగంగా ఈ క్వాంటం ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ కీలకమైన మైలురాయిగా నిలవ నుంది. 380క్వాంటం ఇన్నోవేషన్ సెల్స్, 3వేల మందికి పైగా ప్రొఫెసర్లు, విద్యా ర్థులు రియల్‌టైమ్ క్వాంటం అప్లికేషన్లు, అల్గారిథమ్‌ల అభివృద్ధికి తోడ్పాటును అందించేలా ఈ సెంటర్ ఏర్పాటు అవు తోంది. పారిశ్రామిక, విద్యారంగంలోని అంతర్జాతీయ సాంకేతిక నైపుణ్యాన్ని అనుసంధానించే వేదికగా ఈ అమరా వతి క్వాంటం-ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ను రూపొందించారు. వివిధ రంగాలకు సంబంధించి ప్రాక్టికల్ క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్లు, అల్గారిథమ్‌ల అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం గా ఈ సెంటర్ పనిచేయనుంది. పారి శ్రామిక,విద్యారంగం, సాంకేతిక రంగం నుంచి నిపుణులు అధునాతన కంప్యుటే షనల్ స్కిల్స్‌తో వివిధ సమస్యల పరిష్కా రం కోసం క్వాంటం అప్లికేషన్లను అమ రావతి క్వాంటం ఏఐ ఇన్నోవేషన్ సెంటర్‌ద్వారా అభివృద్ధి చేయనున్నారు. పరిశోధన, అభ్యాసం, ఆవిష్కరణలకు తోడ్పాటుఅందించేలా ఐబీఎం క్వాంటం ఎకోసిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకు రానుంది. ఏక్యూఏఐసీ కోసం రాష్ట్ర వ్యా ప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో 380క్వాంటం ఇన్నోవేషన్ సెల్స్ నెట్వర్క్ ను ఏర్పాటు చేశారు. ఈ నెట్వర్క్‌లో భాగంగా 3వేల మంది ప్రొఫెసర్లు,విద్యా ర్థులు కలిసి ఇన్నోవేషన్ ఇంజిన్‌గా పని చేస్తూ క్వాంటం అప్లికేషన్లు, అల్గారిథమ్స్ ను రూపొందించనున్నారు. తయారీ, లాజిస్టిక్స్, వైద్యారోగ్యం, ఆర్థిక సేవలు, ఇంధనం, వ్యవసాయం, ప్రజాసేవల రంగాల్లో క్వాంటం అప్లికేషన్ల అభివృద్ధికి ఈ సెంటర్ తోడ్పాటు అందించనుంది. క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన పరిశోధన, డీప్ టెక్ లాంటి అంశాల్లో అమరావతి క్వాంటంవ్యాలీని అంతర్జాతీయస్థాయిలో నిలబెట్టేలా ఈ ఏక్యూఏఐసీ ఏర్పాటు కీలక ముందడుగు కానుంది.

## ఏపీలో బీచ్ షాక్స్‌కు గ్రీన్‌సిగ్నల్

- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో
- పైలట్ ప్రాజెక్టుగా తొలుత అమలు
- ఆ తర్వాత మిగిలిన చోట్ల విస్తరణకు నిర్ణయం
- తీర ప్రాంత పర్యాటకాభివృద్ధే ప్రధాన లక్ష్యం

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో తీర ప్రాంత పర్యాటకాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 'బీచ్ షాక్స్' పేరుతో మార్గదర్శకాలు విడు దల చేసింది. ఎక్సైజ్ శాఖ జారీ చేసిన జీవో నంబర్ – 362 ప్రకారం ఎంపిక చేసిన బీచ్‌లలో పరిమిత నిబంధనలతో ఈ షాక్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ విధానం రాష్ట్రంలోని 12 తీర ప్రాంత జిల్లాల్లో, ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గుర్తించిన ప్రదేశాల్లో అమలు చేయనున్నారు. మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సుల మేరకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ విధానాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 2029 ఆగస్టు 31 వరకు ఈ విధానం కింద బీచ్ షాక్స్ ఏర్పాటునకు నోటిఫికేషన్ జారీ చేసింది. తొలుత సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా బీచ్ షాక్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఏడాది తర్వాత పైలట్ దుకాణాలు తీరుపై రివ్యూ చేసి ఆ తర్వాతనే వాటి విస్తరణకు నిర్ణయం తీసుకోనున్నారు. మార్గదర్శకాల ప్రకారం బీచ్ షాక్స్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే పనిచేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సూచించారు. పర్యాటకుల భద్రత, నియంత్రణ కోసం కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు. అలాగే ఇక్కడ తక్కువ ఆల్కహాల్ కలిగిన పానీయాలు మాత్రమే సరఫరా చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. భారత తయారీ విదేశీ మద్యం, ఫారిన్ లిక్కర్‌కు ఈ షాక్స్‌లో అనుమతి ఉండదని ఎక్సైజ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

### కోర్టు మార్గదర్శకాల ఆధారంగా విధానం

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి హైవే ప్రాంతాల్లో మద్యం విక్రయాలపై ఉన్న నిబంధనలను ఈ విధానానికి కూడా వర్తింపజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పర్యావరణం, పర్యాటక అభివృద్ధి, భద్రత అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. బీచ్ షాక్స్ ఏర్పాటు ద్వారా తీర ప్రాంత పర్యాట కానికి కొత్త ఆకర్షణ కల్పించడం, స్థానిక ఉపాధి అవకాశాలు పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ఆధునిక సదుపాయాలతో ఈ షాక్స్ రూపకల్పన చేయనున్నారు.



చైతన్యరథం



# నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

- **రూ.142 కోట్ల వ్యయంతో నిర్మాణం**
- **పాల్గొన్న మంత్రి నారా లోకేష్, పెమ్మసాని**

మంగళగిరి(చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ కృషితో మంగళగిరి నియోజకవర్గ రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. మంగళగిరి ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి బుధవారం లోకేష్ శంకుస్థాపన చేశారు. నంబూరు - మంగళగిరి సెక్షన్ మార్గంలో మంగళగిరి-నిడమర్రు మార్గంలో 14వ నెంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. ముందుగా మంగళగిరి-నిడమర్రు రోడ్డు వద్దకు చేరుకున్న వారికి పార్టీ నాయకులు, కార్య కర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అను సంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీని నిర్మించనున్నారు. దశాబ్దాలుగా ఈ మార్గంలో రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మంత్రి లోకేష్ చొరవ తీసుకుని రైల్వే లెవల్ క్రాసింగ్‌పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేయించారు. సమస్య శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు కృషిచేశారు.

### రాజధాని ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం

ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే నిడమర్రు, మంగళగిరి, తాడికొండ, అమరావతి ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రజా రాజధాని అమరావతికి సులభమైన, నిరంతరాయ రవాణ అనుసంధానాన్ని కల్పిస్తుంది. మంగళగిరి, అమ రావతి మధ్య ప్రయాణ దూరం తగ్గుతుంది. మంగళగిరి పట్టణం నుంచి మంగళగిరి నియోజకవర్గంలోని బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో పట్టణీ కరణ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. రైల్వే క్రాసింగ్ గేటు ద్వారా రోజుకు సుమారు 60 రైళ్లు ప్రయాణిస్తాయి. రోజుకు రహదారి రాకపోకల కోసం గేటు మూసివేసే సగటు వ్యవధి 8 నుంచి 10 గంటలుగా ఉంది. లెవల్ క్రాసింగ్ గేటు మూసివేసిన సమయం లో ప్రయాణీకులు దాటేందుకు 10 నుంచి 15 నిమిషాల సమ యం పట్టేది. ఆర్వోబీ నిర్మాణంతో సుమారు నిమిషంలోనే దాటే అవకాశం ఉంది.

### ఆర్వోబీ రైల్వేలైన్‌పై 10 మీటర్ల ఎత్తులో నిర్మాణ:

నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్‌పై ఆర్వోబీ రైల్వేలైన్‌పై 10 మీటర్ల ఎత్తులో నిర్మించనున్నారు. దీని పొడవు 767.50 మీటర్లు. ఇందులో రైల్వేలైన్ నుంచి అమరావతి వైపు 362 మీటర్లు, మంగళగిరి వైపు 405.50 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. వంతెనపై నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేయనున్నారు. ప్రతి లైను 3.75 మీటర్లు కాగా మొత్తం క్యారేజ్ వే వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. అదనంగా 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా



క్రాష్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్లు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.5లి2) 5.5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేయనున్నా రు. సర్వీస్ రోడ్లతో సహా ఆర్వోబీ మొత్తం వెడల్పు 28 మీటర్లు ఉండనుంది. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతు ల శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.









చైతన్యరథం

# సుందరంగా కాజ ఈస్ట్ లేక్ పార్క్

## రూ.3.3 కోట్ల వ్యయంతో నిర్మాణం - ప్రారంభించిన మంత్రి నారా లోకేష్





మంగళగిరి(చైతన్యరథం): కాజ గ్రామంలోని ఉప్పలపాడు-నంబూరు-కాజ రోడ్డు మార్గంలో ఆధునిక హంగులతో నిర్మించిన కాజ ఈస్ట్ లేక్ పార్క్‌ను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా కాజ లేక్ పార్క్‌కు చేరుకున్న వారికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఈస్ట్ లేక్ పార్క్‌ను ప్రారంభించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. పార్క్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మొక్క నాటారు. అనంతరం పార్క్ మొత్తం కలియతిరిగి వసతులను పరిశీలించారు. సెల్ఫీ తీసుకు న్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన పర్యావరణం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించాలనే లక్ష్యం తో మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా ఈస్ట్ లేక్ పార్క్‌ను నిర్మించారు. సెల్‌కాన్ సంస్థ రూ. 3.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఈ పార్క్‌ను అభివృద్ధి చేశారు. 17.18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ ఆధునిక హంగులతో పార్క్‌ను తీర్చిదిద్దారు. ఇప్పటికే ఉన్న చెరువు కట్టను 1.7 కిలోమీటర్ల మేర బలోపేతం చేశారు. పార్క్‌లో 42 రకాల జాతులకు చెందిన మొత్తం 12,800 మొక్కలను నాటారు. 1.7 కిలోమీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం ప్రత్యేక ప్లే ఏరియా, భద్రత కోసం ట్రాక్‌కు ఇరువైపులా జీఐ చైన్-లింక్ మెష్ ఫెన్సిం గ్, ఆధునిక సుందరీకరణ పనులు చేపట్టి పార్క్‌ను ఆకర్షణీయం గా తీర్చిదిద్దారు. వాకింక్ ట్రాక్ వెంట విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, మంగళగిరి ఏఎంసీ చైర్మన్ జవ్వాది కిరణ్ చందు, ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల జయసత్యతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నా రు. అనంతరం అందరితో కలిసి ఫొటోలు దిగారు.




















# మాటిచ్చారు.. నిలబెట్టుకుంటున్నారు

- మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్
- శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేష్
- రూ.1,167 కోట్ల వ్యయంతో నిర్మాణం

మంగళగిరి(చైతన్యరథం): నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ఎంటీఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ వ్యవస్థ నిర్మించి మురుగు కనుమరుగయ్యేలా చేస్తామని గత ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చింది. తాడేపల్లిలోని పాతూరు రోడ్డులో మంగళగిరి, తాడేపల్లి నగర ప్రజల చిరకాల కోరిక అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి పథకం మొదటిదశ పనులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి నారా లోకేష్ శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పాతూరు రోడ్డుకు చేరుకున్న లోకేష్ టీడీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు.

ప్రజా ప్రభుత్వంలో మంత్రి నారా లోకేష్ మంగళగిరి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. తొలి ప్రాధాన్యంగా భూగర్భ డ్రైనేజీ డీపీఆర్‌లు రూపొందించారు. నిధులు మంజూరుతో పాటు



పరిపాలన అనుమతులుతీసుకువచ్చారు. దీంతో దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.





### రెండు దశల్లో జరగనున్న పనులు

మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ(యూజీడీ)ను రూ. 1,167.50 కోట్లతో నిర్మించనున్నారు. రాజధాని గ్రామాలు బేతపూడి, నవులూరు, యర్రబాలెం, నిడమర్రు, పెనుమాక, ఉండవల్లి గ్రామాలు మినహా మొత్తం ఎంటీఎంసీ ప్రాంతంలో డీసెంట్రలైజేషన్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు మురుగుశుద్ధి కేంద్రాలు నిర్మాణాన్ని హైబ్రిడ్ అన్యుటీ మోడ్‌లో రెండు దశల్లో పనులు చేపట్టనున్నారు. యూజీడీ నెట్ వర్క్ ఫేజ్-1లో 300 కి.మీ, ఫేజ్-2లో 231 కి.మీ కలిపి మొత్తం 531 కి.మీ నిర్మించ నున్నారు. మురుగు నీటిశుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ) ఫేజ్-1లో 7, ఫేజ్-2లో 13 కలిపి మొత్తం 20 నిర్మించనున్నారు. వీటిని మొత్తం 20 జోన్లుగా విభజించారు. ఒక ఎంఎల్‌డీ (రోజుకు పది లక్షల లీటర్లు) కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన ఎస్‌బీఆర్(గాదీ=) సాంకేతికత ఆధారిత ఎస్టీపీలు 14 కాగా, ఒక ఎంఎల్డీ కంటే తక్కువ సామర్థ్యం కలిగిన ఎఫ్‌బీ టెక్ ప్యాకేజ్డ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు 6 ఉండనున్నాయి. రోడ్ల పునరుద్ధరణతో కలిపి మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ.1,167.50 కోట్లు కానుంది. మొదటి దశలో రూ.604.32 కోట్లు, రెండో దశలో రూ.563.18 కోట్లు వెచ్చించ నున్నారు. ఎస్టీపీ సామర్థ్యం మొదటి దశలో 26.48 ఎంఎల్డీ, రెండో దశలో 21.03 ఎంఎల్‌డీ కలిపి మొత్తం 47.51 ఎంఎల్డీ కానుంది. లిఫ్ట్ స్టేషన్లు మొదటి దశలో 4, రెండో దశలో 14 కలిపి మొత్తం 18 నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, రూరల్ అధ్యక్షుడు దాసరి కృష్ణతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఆధునిక సౌకర్యాలతో మంగళగిరి వైకుంఠ మహాప్రస్థానం





- రూ.3.25 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ
- సందర్శించిన మంత్రి నారా లోకేష్

మంగళగిరి(చైతన్యరథం): పాత మంగళగిరి బిట్రా వారి వీధి, దింపుడు కళ్లం వద్ద ఆధునిక సదుపాయాలతో నిర్మించిన మంగళగిరి వైకుంఠ మహాప్రస్థానాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మంత్రి నారా లోకేష్ సందర్శించారు.మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి వైకుంఠ మహాప్రస్థానాన్ని ఆధునికీకరించారు. మొత్తం 2.90ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మించారు. ఇందులో 1.90ఎకరాలు హిందూశ్మశానవాటిక కాగా.. మరో ఎకరం క్రైస్తవుల సమాధుల కోసం కేటాయించారు. హిందూ వైకుంఠ మహాప్రస్థా నాన్ని ఫీనిక్స్ ఫౌండేషన్ రూ.3.25 కోట్ల సీఎస్ఆర్ నిధుల భాగస్వామ్యంతో అభివృద్ధి చేశారు. దీంతో పాటు మంత్రి లోకేష్ సొంత నిధులను కూడా వెచ్చించారు. ఈసందర్భంగా ఫీనిక్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ లీడర్ షిప్ చుక్కపల్లి సురేష్, చుక్కపల్లి రమేష్‌లను మంత్రి



నారా లోకేష్ అభినందించారు.ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా నాలుగు ఆధునిక దహన వేదికలు(ఉడ్ ఫైర్స్), వాటి ఎదురుగా నాలుగు నిరీక్షణ మందిరాలు, అంత్యక్రియలకు హాజరయ్యే బంధువుల సౌకర్యార్థం ఒకేసారి 60 మంది కూర్చోవడానికి వీలుగా భోజనశాల నిర్మించారు. భోజనశాల పక్కనే కార్యాలయంతోపాటు అస్థికలు భద్రపరిచే గది నిర్మించారు. పిండ ప్రదానాల కోసం రెండు ప్రత్యేక ఆచార గదులు, స్టోర్ రూమ్, క్షౌరశాల ఏర్పాటుచేశారు.పురుషులు, మహిళలకు రెండు వేర్వేరు మరుగుదొడ్లు, దహన సంస్కారాలకు కలప నిల్వ చేసేందుకు ప్రత్యేక షెడ్, రెండు మార్చురీ బాక్సలు, విద్యుత్ అంతరాయం లేకుండా 15కేవీఏ సామర్థ్యం గల జనరేటర్ ఏర్పాటుచేశారు. ఆవరణలో సుందరీకరణ పనులు, శిల్పాలు,సోలార్ వీధిదీపాలు, కార్యాలయ, భోజనశాల ఫర్నీచర్, నిరీక్షణ మందిరాల కోసం 50కుర్చీలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణటీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండలపార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, చుక్కపల్లి సురేష్, చుక్కపల్లి రమేష్‌తోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.








# ఏపీలో సుపరిపాలనకు రెండేళ్లు...

## సంబరాలు చేపట్టిన జర్మనీ ఎన్ఆర్ఐలు

- **ఘనంగా మినీ మహానాడు, ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు**
- **ఏపీలో అరాచక పాలన ముగిసి... సుపరిపాలన మొదలై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు**
- **చంద్రబాబు నాయకత్వం, లోకేష్ చొరవతో రాష్ట్రం 20 ఏళ్లు ముందుకెళ్లిందన్న నేతలు**
- **ముఖ్య అతిథులుగా నందమూరి రామకృష్ణ, గల్లా మాధవి, మన్నవ సుబ్బారావు హాజరు**



జర్మనీలో మినీ మహానాడును ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన, మా తెలుగు తల్లికి గీతాలాపనలతో కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. జై తెదేపా.. ఎన్టీఆర్ అమర్ రహే...జై చంద్రబాబు... జై లోకేష్.. నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.



### కుటుంబం కంటే ప్రజలకే ఎక్కువ ప్రాధాన్యత



ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ కుమారుడిగా జన్మించటం తన అదృష్టమని తెలిపారు. కుటుంబం కంటే ప్రజలకే ఎన్టీఆర్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే వారిని పేర్కొన్నారు. "తెలుగు నేలపై చెరగని చిరునామా ఎన్టీఆర్. సినిమాల్లో నటించినా, పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చినా ఏది చేసినా ప్రజా హితం... సంచలనమే. సంక్షేమ రాజ్యాన్ని స్థాపించి, సామాజిక న్యాయాన్ని చిత్తశుద్ధి తో అమలుచేసిన ఘనత మా నాన్నగారు, తెలుగువారి అన్నగారు ఎన్టీఆర్ కే దక్కుతుంది" అని రామకృష్ణ తెలిపారు.

### ఆస్తిలో హక్కునేకాదు... రాజ్యాధికారాన్నీ కట్టబెట్టారు

మహిళలకు ఆస్తిలో హక్కునేకాదు... రాజ్యాధికారాన్నీ కట్టబెట్టిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబులకు దక్కుతుందని గల్లా మాధవి అన్నారు. దానికి తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. "బీసీలకు అసలైన స్వాతంత్ర్యం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీది. బ్యాక్ వార్డ్ క్లాసెస్‌గా పిలుస్తూ అణచివేతకు గురవుతున్న బీసీలను సమాజానికి బ్యాక్ బోన్ క్లాసెస్ అని గుర్తించి, వెన్నుతట్టి ప్రోత్సహించింది తెదేపానే.

### ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన టీడీపీ పాలన



కూటమి ప్రభుత్వ 24 నెలల పాలనలో ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి పథంలో 20 ఏళ్ల ముందుకు సాగిందని మన్నవ సుబ్బారావు అన్నారు. అవినీతి, అరాచకం విధ్వంసంతో సాగిన జగన్ పాలనకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో పోటుపొడిచారని... చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని స్పష్టం చేశారు. మే 28 ఎన్టీఆర్ పుట్టినరోజు మాత్రమే కాదు ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన రోజు. లక్షలాది మంది కార్యకర్తల ఆత్మీయ కలయిక. తెలుగుదేశం మూడు తరాల ప్రస్థానం, స్థాపన, స్థిరీకరణ, సరికొత్త దిశగా మార్పు చెందింది. "అభివృద్ధి, సంక్షేమం, పాలనా సంస్కరణలతో కూటమి ప్రభుత్వం సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది.



గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ... ప్రవాసాంధ్రులు ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టాలి, అమరావతి అభివృద్ధిలో పాలు పంచుకోవాలి అని పిలుపినించారు. అలాగే ఈ కార్యక్రమంలో జర్మనీ నుంచే గాక ఐర్లాండ్ నుంచి కిషోర్ చలసాని, నెదర్లాండ్స్ నుంచి రావి అమర్చంద్, ఇంకా ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ నుంచి కూడా టీడీపీ అభిమానులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రవాసాంధ్రులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మహానాడు మహా విందు 46 వంటకాలతో అతిథులకు ఆంధ్ర రుచిలతో విందు ఏర్పాటు చేశారు మహానాడు లో ఆంధ్ర పద్ధతిలో బంతి భోజనం పెట్టి అందర్నీ అబ్బురపరిచారు. ఈ కార్యక్రమాన్ని వెనుక ఉండి టీడీపీజర్మనీ ఎగ్జిక్యూటివ్ మరియు కోర్ టీం విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి రామ్ బోళ్ల మరియు మునిచ్ టీడీపీ జర్మనీ టీం శివ నక్కాల, దరహాస, లీల, ప్రేమ్ నాదెళ్ల, బాల, దినేష్, వంశి, శ్రీకాంత్ సుంకర, అరవింద్, కిరణ్, వరుణ్, విక్రమ్ , మనోజ్ , ఫర్హాత్, రాయలు, శివ శంకర్, సతీష్, సుప్రియ, రమ్య, భవ్య, రాహుల్, మణి తదితరులు వెనుక ఉండి కార్యక్రమాన్ని విజయం చేయటంలో కీలక పాత్ర పోషించారు.



# వెన్నుపోటుకు పేటెంట్ హక్కుదారుడు జగన్

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇప్పుడు నీతులు చెబుతున్నాడు
- అబద్ధాలతో అధికారం... అరాచకాలతో ఐదేళ్ల జగన్ పాలన
- తల్లి, చెల్లిని రాజకీయంగా వాడుకుని పక్కన పెట్టింది ఎవరు?
- రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టిన జగన్‌కు ప్రజలే గుణపాఠం చెప్పారు
- అప్పులు, అరాచకాలు, అబద్ధాల పాలనకు 2024లో ముగింపు పలికారు
- కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం వైసీపీ నైజం
- 2014లో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తే.. 2019లో నాశనం చేశారు
- గొడ్డలి రాజకీయాలు కాదు... అభివృద్ధి రాజకీయాలే కూటమి ప్రభుత్వ అజెండా
- రెండేళ్లలోనే రాష్ట్రానికి కొత్త దిశ చూపిన చంద్రబాబు ప్రభుత్వం
- కులాలు, మతాల పేరుతో చిచ్చు పెట్టే జగన్ కుట్రలను తిప్పికొడతాం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉద్ఘాటన



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర రాజకీయాల్లో వెన్నుపోటు గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ మోహన్ రెడ్డికి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. వెన్నుపోటుకు కర్త, కర్మ, క్రియ జగన్‌నేనని, ఆ పదానికి పేటెంట్ హక్కులు ఎవరికైనా ఇవ్వాలంటే అది జగన్‌కే ఇవ్వాలని ఎద్దేవా చేశారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని కోరుతున్నానన్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఆంధ్రప్రదేశ్ తీవ్ర సంక్షోభంలో పడింది. రాజధాని లేదు, ఆదాయం లేదు, పరిశ్రమలు లేవు, ఉద్యోగ అవకాశాలు లేవు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల సమర్థ నాయకుడు కావాలని ప్రజలు భావించి తెలుగుదేశం పార్టీకి అవకాశం ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్ర పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఐదేళ్లలో ప్రజలు ఊహించని స్థాయిలో అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు కృషి చేశాం. అయితే 2019లో అబద్ధాలు, అసత్యాలు, సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసి జగన్ అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టారు. మాట్లాడే స్వేచ్ఛ లేకుండా చేశారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టారు. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలపై దమనకాండ సాగించారని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తుచేశారు.

### జగన్ జమానాలో రాష్ట్రం దివాళా

రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టి లక్షల కోట్ల అప్పులు చేసిన గత పాలకులు ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా దివాళా అంచుకు చేర్చారు. ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, మార్కెట్లు, వివిధ ఆదాయ వనరులను తాకట్టు పెట్టి భారీ స్థాయిలో అప్పులు తెచ్చి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టారు. మద్యం ఆదాయాన్ని కూడా భవిష్యత్ తరాలకు భారం అయ్యేలా దారి మళ్లించారు. అభివృద్ధి లేకుండా, ఆదాయ సృష్టి లేకుండా అప్పులపై ఆధారపడిన పాలన సాగింది. వైసీపీ అరాచక పాలనను చూసిన ప్రజలు మళ్లీ చంద్రబాబు నాయుడు నాయకత్వాన్నే కోరుకున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమికి ఘన విజయాన్ని అందించి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి బాటలో పయనిస్తోంది. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ మరోసారి అబద్ధాలు, ఆరోపణలు, విద్వేష రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

### జగన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

ఈ రోజు "వెన్నుపోటు" పేరుతో ర్యాలీలు నిర్వహిస్తున్న జగన్ మోహన్ రెడ్డి ముందుగా తన రాజకీయ చరిత్రను చూసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ కుటుంబం అండతో ఆయన కుటుంబానికి రాజకీయ గుర్తింపు వచ్చింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకుని రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి లక్ష కోట్ల అక్రమాస్తులు సంపాదించి, జైలుకు వెళ్లిన వ్యక్తి జగన్. తండ్రి మరణించిన సమయంలోనే ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాల సేకరణ జరిపించడం రాజకీయ చరిత్రలో ఎప్పటికీ మచ్చగా మిగిలిపోతుంది. పదవి రాలేదని కాంగ్రెస్‌ను వీడి కొత్త పార్టీ పెట్టడం వెన్నుపోటు కాదా? జైలులో ఉన్న సమయంలో తల్లి, చెల్లెలు పార్టీ కోసం కష్టపడితే, అధికారంలోకి వచ్చిన తర్వాత వారినే దూరం పెట్టడం వెన్నుపోటు కాదా? ఈ ప్రశ్నలకు ముందు సమాధానం చెప్పాలి. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్ ఈ రోజు యువత గురించి మాట్లాడటం హాస్యాస్పదం. సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. సంపూర్ణ మద్యనిషేధం తీసుకొస్తామని చెప్పి మాట తప్పారు. ఉద్యోగాలు, సంక్షేమం, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం ప్రతి అంశంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని వ్యక్తికి మ్యానిఫెస్టో గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. ప్రజలను మోసం చేసినందుకు జగన్ రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

### ప్రజలు మరోసారి మోసపోరు..

డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవి. ఏదైనా అక్రమం జరిగి ఉంటే ఆధారాలతో ముందుకు రావాలని మంత్రి నారా లోకేష్ బహిరంగంగా సవాలు విసిరారు. ధైర్యం ఉంటే చర్చకు రావాలి. అధికారిక వివరాలు బయటకు వచ్చిన తర్వాత వైసీపీ ఆరోపణల్లో నిజం లేదని స్పష్టమైంది. సంవత్సరం క్రితం జరిగిన ప్రక్రియపై ఇప్పుడు అకస్మాత్తుగా ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ కుట్ర మాత్రమే ఉంది. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. 2019లో అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేసిన విధానాన్నే మళ్లీ అమలు చేయాలని చూస్తున్నారు. అయితే ఈసారి ప్రజలు ఆ మోసాలకు అవకాశం ఇవ్వరు. వైసీపీ రాజకీయాల మూల సిద్ధాంతం ప్రజలను విభజించడం. మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే దానికి కులరంగు పులిమి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ప్రతి అంశంపై బాధ్యతాయుతంగా స్పందిస్తోంది. ఆరోపణలు వచ్చిన వెంటనే విచారణలు జరిపి నిజానిజాలు బయటపెడుతోంది. రాష్ట్రంలో శాంతి, భద్రత, సామాజిక సామరస్య పరిరక్షణకు కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### ఆక్వారంగానికి అండగా ప్రభుత్వం

మత్స్య, ఆక్వా రంగాల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. విద్యుత్ చార్జీల తగ్గింపు, రైతులకు ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల కల్పన, అదనపు ఆర్థిక సహాయం వంటి చర్యలతో ఆక్వా రంగాన్ని లాభదాయకంగా మార్చింది. ప్రపంచ పరిస్థితులు, యుద్ధాల ప్రభావంతో కొన్ని ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం రైతుల పక్షానే నిలుస్తోంది. ఫీడ్ ధరలు, ఉత్పత్తి వ్యయాలు, మార్కెట్ పరిస్థితులపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. రైతులకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం ఒక్క నిర్ణయం కూడా తీసుకోదు. హోం మంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నాయకులు చేసిన వ్యక్తిగత, అవమానకర వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరం. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి గానీ వ్యక్తిగతంగా, మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం ప్రజాస్వామ్య సంస్కృతి కాదు. ఈ వ్యాఖ్యలపై సంబంధిత నాయకులు, జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర మహిళలకు మరియు హోం మంత్రికి క్షమాపణ చెప్పాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

### ప్రజలు అన్నీ గమనిస్తున్నారు..

రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు అప్పుల ఊబిలోకి నెట్టి, అభివృద్ధిని అడ్డగించి, ప్రజలను విభజించే రాజకీయాలు చేసిన వైసీపీ ఇప్పుడు మళ్లీ అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేయాలని చూస్తోంది. కానీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. గత అనుభవాలను మరిచిపోలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోంది. అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత ప్రతి రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు కట్టుబడి ఉంది. ప్రజలు కూడా ఈ అభివృద్ధి యజ్ఞంలో భాగస్వాములు కావాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

# వ్యక్తిత్వ హననం.. వైసీపీ నైజం

- హెం మంత్రి అనితపై దిగజారుడు వ్యాఖ్యలు
- మొత్తం మహిళా సమాజాన్నే కించపర్చేలా వైసీపీ నేతల తీరు
- మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపాటు

అమరావతి (చైతన్యరథం): మొత్తం మహిళా సమాజం తలదించుకునేలా వైసీపీ నేతలు నీచాతినీచంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పై వైసీపీ నాయకులు చేసిన నీచమైన వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు. అమరావతిలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేస్తున్న మహిళా మంత్రిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం అత్యంత దురదృష్టకరం అన్నారు. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి కానీ వ్యక్తిత్వ హననానికి దిగడం వైసీపీ దిగజారుడు సంస్కృతికి నిదర్శనం అని తప్పుబట్టారు. మహిళలను గౌరవించని పార్టీకి ప్రజలు ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పారు. అయినా వారి వైఖరిలో మార్పు కనిపించడం లేదు. హోం మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అంటే రాష్ట్రంలోని మొత్తం మహిళా సమాజాన్ని అవమానించినట్లే. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం, అసభ్య పదజాలంతో మాట్లాడడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. వైసీపీ నాయకులు తమ భాషను అదుపులో పెట్టుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆ అంశంపై సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడలేని వారు వ్యక్తిగత దూషణలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. మహిళా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరంగా కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వైసీపీ నాయకులు తమ రాజకీయ దివాళాకోరుతనాన్ని అసభ్య వ్యాఖ్యల ద్వారా బయటపెట్టుకుంటున్నారు. విధాన పరమైన విమర్శలకు మేము సిద్ధం... కానీ వ్యక్తిత్వ హననాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించం. ప్రజలు తిరస్కరించినా అహంకార రాజకీయాలనే వైసీపీ



నాయకులు ఇంకా కొనసాగిస్తున్నారు.మాటలకు హద్దులు ఉండాలి.. ప్రజాస్వామ్యంలో సంస్కారం కూడా ఉండాలని మంత్రి సుభాష్ హితవు పలికారు.

# ప్రజల సంతృప్తే కూటమి ప్రభుత్వానికి గీటురాయి

- **సీఎం చంద్రబాబు నేతృత్వంలో దూసుకెళుతున్న రాష్ట్రం**
- **విద్య, ఐటీ రంగాల్లో మంత్రి లోకేష్ దూకుడు**
- **మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటన**
- **రాజమహేంద్రవరంలో "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం**

రాజమహేంద్రవరం (చైతన్యరథం): రెండేళ్ల కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా "విద్య"ను ప్రధాన అంశంగా కేటాయించి రాజమహేంద్రవరంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతి, లబ్ధిదారుల జీవితాల్లో వచ్చిన మార్పులను ప్రజలకు, నాయకులకు మంత్రి దుర్గేష్ తెలియజేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, పారదర్శక పాలన, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, మహిళా సాధికారత, ఉపాధి కల్పన తదితర రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు చేరవేసేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తోందన్నారు. విద్యారంగంలో సాధించిన పురోగతి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల విశేషాలను ప్రతిబింబించే స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని తెలిపారు. 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో రాక్షస పాలన సాగిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు మంచి సుపరిపాలన అందుతోందని చెప్పుకొచ్చారు. గత సర్కారు అసమర్ధ నిర్వాకాలు.. నేటి ప్రభుత్వం సాధిస్తున్న అద్భుత ఫలితాల వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారని మంత్రి దుర్గేష్ అన్నారు.



### చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి పరుగులు

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామని.. లబ్ధిదారుల ముఖాల్లో ఆ ఆనందం స్పష్టంగా కనిపిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలు ఊహించిన దాని కంటే.. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో రెండేళ్లలో ఎక్కువ అభివృద్ధి చేసి చూపించామన్నారు. ముఖ్యంగా దేశంలోనే విజనరీ ముఖ్యమంత్రిగా పేరుపొందిన నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో విభజిత ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందుకు దూసుకువెళుతోందని చెప్పుకొచ్చారు. ఓవైపు చంద్రబాబు దార్శనికత, మరోవైపు పేదల కోసం పరితపించే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్., ఇంకోవైపు కేంద్రం నుంచి సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, పింఛన్ల పంపిణీ, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు ఇలా రెండేళ్లలో 20 ఏళ్లకు సరిపడా సంక్షేమాభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపామన్నారు.

### మంత్రి లోకేష్ విప్లవాత్మక నిర్ణయాలు

అదేవిధంగా విద్యా, ఐటీ శాఖల మంత్రిగా నారా లోకేష్ తీసుకున్న అనేక విప్లవాత్మక నిర్ణయాలు ఆయా రంగాల దశ, దిశను సమూలంగా మార్చేశాయని మంత్రి దుర్గేష్ అన్నారు. గతంలో పదవ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వం యూనిఫాం అందించేదని.. కానీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా యూనిఫాం, సకల సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లోనూ శాస్త్ర సాంకేతిక, ఆవిష్కరణ నైపుణ్యాలను పెంపొందించేలా కృత్రిమ మేథ(ఏఐ) పాఠ్యాంశాలు వంటివి చేర్చామన్నారు. అలాగే విద్యార్థుల నైపుణ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించడం వంటి అంశాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఏనాడూ డీఎస్సీ గూర్చి ఆలోచన చేయలేదని.. ఈ ప్రభుత్వం వచ్చాక మెగా డీఎస్సీ ప్రకటించి, 16,393 టీచర్ పోస్టులను భర్తీ చేసినట్లు వివరించారు. ఇలా పేదలు, విద్యార్థులు, రైతులు, మహిళలు అన్ని వర్గాల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. 2029 నాటికి పేద యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఓ కమిటీని ఏర్పాటు చేయగా.. అందులో తాను ఓ సభ్యుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో నూటికి నూరు శాతం సఫలీకృతమవుతామని ధీమా వ్యక్తం చేశారు. ఇటువంటి అద్భుత కార్యక్రమాలు చేపడుతున్న కూటమి ప్రభుత్వం పదికాలాల పాటు చల్లగా ఉండేలా ఆశీర్వదించాలని ప్రజలకు మంత్రి దుర్గేష్ విజ్ఞప్తి చేశారు.

# అమరావతి పార్కులు.. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి

**- సింగపూర్ అధికారులతో మంత్రి నారాయణ చర్చలు**
**- ఆ దేశంలో పలు ప్రాజెక్టులు పరిశీలించిన మంత్రి**

అమరావతి/సింగపూర్ (చైతన్యరథం): అమరావతితో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఆధునిక పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో సింగపూర్‌లో పర్యటిస్తున్న పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అక్కడ అమలవుతున్న అత్యాధునిక విధానాలను అధ్యయనం చేశారు. పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ బుధవారం సింగపూర్‌లోని మెరీనా బే శాండ్స్‌లో ఉన్న సింగపూర్ నేషనల్ ఎన్విరాన్మెంట్ ఏజెన్సీ (ఎన్‌ఈఏ) కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్‌ఈఏ డైరెక్టర్ కోలిన్ గూతో సమావేశమైన మంత్రి, పర్యావరణ పరిరక్షణ, నగర పరిశుభ్రత, ఘన వ్యర్థాల



నిర్వహణ, ప్రజల భాగస్వామ్యంతో అమలవుతున్న కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. తదుపరి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్‌తో కలిసి తువాస్ సౌత్ ఇన్సినరేషన్ ప్లాంట్‌ను మంత్రి నారాయణ సందర్శించారు. సింగపూర్‌లోని అతిపెద్ద వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌గా ఉన్న ఈ కేంద్రంలో ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ ప్రమాణాల అమలుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణలో సింగపూర్ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసిన మంత్రి, రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో వాటి అమలు అవకాశాలపై అధికారులతో అభిప్రాయాలు పంచుకున్నారు. అనంతరం పశ్చిమ సింగపూర్‌లోని జురాంగ్ లేక్ గార్డెన్స్ పరిధిలో ఉన్న జపనీస్ గార్డెన్‌ను సందర్శించిన మంత్రి, అక్కడి పార్కుల రూపకల్పన, నిర్వహణ, హరిత వాతావరణ పరిరక్షణకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా అమరావతితో పాటు రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో పార్కుల అభివృద్ధి, హరిత ప్రాంతాల విస్తరణ, ప్రజలకు మెరుగైన వినోద వసతుల కల్పన అంశాలపై సింగపూర్ అధికారులతో చర్చించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పార్కుల అభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలపై అభిప్రాయాలు మార్పిడి చేసుకున్నారు. సింగపూర్ పర్యటన కార్యక్రమాలను ముగించుకున్న మంత్రి నారాయణ తదుపరి అధ్యయన పర్యటన కోసం మలేషియాకు బయలుదేరారు. గురువారం మలేషియాలోని పలు ప్రాంతాలను సందర్శించి పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పర్యావరణ నిర్వహణకు సంబంధించిన ప్రాజెక్టులను పరిశీలించనున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- **గతంలో ఎక్సైజ్ శాఖను రెండుగా విడగొట్టి ఉద్యోగుల్ని ముప్పుతిప్పలు పెట్టారు**
- **కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నాం**
- **విధి నిర్వహణలో మరణించిన ఎక్సైజ్ సిబ్బంది కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ చేసిన మంత్రి కొల్లు రవీంద్ర**

విశాఖపట్నం (చైతన్యరథం): ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ సిబ్బంది కుటుంబ సభ్యులకు బుధవారం విశాఖపట్నం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ప్రభుత్వం తరఫున పరిహారం చెక్కుల్ని పంపిణీ చేసిన మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు నానా అవస్థలు పడ్డారన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై తొలిసారి గళం విప్పింది కూడా ఉద్యోగులే అన్నారు. వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖను రెండు ముక్కలుగా చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవస్థ మొత్తాన్ని ఏకం చేశామని మంత్రి తెలిపారు.




**ఉద్యోగులకు అండగా..**

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది ఏవీవీ సత్యన్నారాయణ విధి నిర్వహణకు వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబానికి ఎస్బీఐ నుండి మజూరైన రూ.కోటి నష్టపరిహారం చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించామని మంత్రి రవీంద్ర తెలిపారు. విజయవాడకు చెందిన దివంగత సీహెచ్ పిచ్చేశ్వరరావు కుటుంబానికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.1 కోటి ఆర్థిక సహాయం అందించడం ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. విశాఖపట్నం సీతమ్మధార ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ఎల్.సింహాచలం నాయుడు కుటుంబానికి ప్రభుత్వం నుండి రూ.10 లక్షలు, ఎస్బీఐ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు, ఎక్సైజ్ కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ నుండి రూ.22.72 లక్షలు అందించాం. ప్రభుత్వం నుండి మరో రూ.కోటి త్వరలోనే అందించబోతున్నాం. అలాగే అన్నమయ్య జిల్లా రామసముద్రం చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎ.రెడ్డయ్య అనారోగ్య కారణాలతో మరణించడం అత్యంత బాధాకరం. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం మరియు ఎక్సైజ్ శాఖ తరఫున రూ.10 లక్షల బీమా, ఎక్సైజ్ శాఖ నుండి రూ.5 లక్షలు, సిబ్బంది విరాళాల ద్వారా రూ.5 లక్షలు, ఇంటి స్థలం, అర్హత గల కుటుంబ సభ్యునికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని మంత్రి రవీంద్ర తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న రూ.21 వేల కోట్ల బకాయిలు చెల్లించాం. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి లేకుండా చూసుకుంటున్నాం. ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఎప్పుడూ అండగా ఉంటామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ భరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం

- అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కూటమి పాలన
- వైకుంఠపాళితో దెబ్బతింటున్న రాష్ట్రం
- పాలన కొనసాగితేనే అభివృద్ధితో రాష్ట్రం సుభిక్షం
- అరాచక వాది జగన్ మళ్లీ అధికారంలోకి రాకూడదు
- అనకాపల్లిలో రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమం సభలో మంత్రి కొల్లు రవీంద్ర



అనకాపల్లి (చైతన్యరథం): రాష్ట్రంలో వైకుంఠపాళి పాలనకు చరమగీతం పాడదాం.. అభివృద్ధి చేసే కూటమి ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో బుధవారం నిర్వహించిన రెండేళ్ల కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి బహిరంగ సభలో మంత్రి పాల్గొన్నారు. తొలుత భారీ ర్యాలీగా వెళ్లి అన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో సాగిన విధ్వంసం నుండి 2024లో విముక్తి పొంది చంద్రబాబు పాలన వచ్చాక వికాశం వైపు ప్రయాణం ప్రారంభించి రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్నామన్నారు. సంక్షోభం నుండి స్వర్ణాంధ్ర నిర్మాణానికి పునాదులు వేసుకుంటున్నాం. రెండేళ్ల పాలన పూర్తి చేసుకుని ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నందుకు ఆనందంగా ఉంది. 2014లో రాష్ట్ర విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని ఇటుక ఇటుక పేర్చుకుంటూ అభివృద్ధి బాటలో నడిపించాం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులు పూర్తి చేసుకోవాలనే లక్ష్యంతో అడుగులేశాం. అలాంటి సమయంలో కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి.. కుర్చీ ఎక్కిన తొలి రోజునే ప్రజావేదిక కూల్చివేసి తన విధ్వంస వైఖరిని చాటుకున్నాడు. ఆ రోజు మొదలు పెట్టిన కూల్చివేతలు ఐదేళ్ల పాలనంతా కొనసాగించాడు. అన్ని రంగాలను, అన్ని వ్యవస్థల్ని కుప్పకూల్చాడు. అన్ని వర్గాలను మోసం చేశాడు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా దగా చేశాడు. ప్రజలు సమస్యను బయటకొచ్చి చెప్పుకునే పరిస్థితి లేకుండా అణచివేతకు దిగారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టారు. దళితులపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాడు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా చేసి.. గంజాయి డ్రగ్స్‌కు బానిసల్ని చేశాడని మంత్రి రవీంద్ర ధ్వజమెత్తారు.

**ఆర్థిక ఇబ్బందులున్నా ఆగని సంక్షేమం, అభివృద్ధి**

జగన్ రెడ్డి అరాచక శక్తి నుండి రాష్ట్రాన్ని కాపాడుకునే లక్ష్యంతో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏర్పడిన కూటమిని ప్రజలు 94 శాతం సీట్లతో గెలిపించారు. 164 స్థానాల్లో గెలిపించి ప్రజాస్వామ్య పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఖజానా ఖాళీ. ఆదాయం లేదు. ఉన్న ఆస్తుల్ని కూడా జగన్ తాకట్టు పెట్టేశారు. లేదంటే అమ్మేశారు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో పాలన ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలు అమలు చేశాం. 63 లక్షల మందికి పెన్షన్ల రూపంలో రెండేళ్లలో రూ.65 వేల కోట్లు చెల్లించాం. తల్లికి వందనం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తామనే హామీ మేరకు 68 లక్షల మందికి రూ.10 వేల కోట్లు చెల్లించాం. త్వరలోనే మళ్లీ రూ.10 వేల కోట్లు ఇవ్వబోతున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా 47 లక్షల మందికి రూ.20 వేల చొప్పున అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. మత్స్యకారుల సేవలో కార్యక్రమం ద్వారా 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు జమచేశాం. నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు, చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తున్నాం. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాం. లైసెన్సు ఫీజులో 50 శాతం సబ్సిడీ కల్పించాం. వడ్డెరలకు బిల్డింగ్ మెటీరియల్ లీజుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించామని మంత్రి రవీంద్ర వివరించారు.

**డీఎస్సీపై తప్పుడు ప్రచారం..**

కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసి గ్రావిటీ ద్వారా అన్ని ప్రాంతాలకు నీళ్లివ్వబోతున్నాం. అమరావతి రాజధాని పనులు ప్రారంభించాం. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం నుండి రూ.11 వేల కోట్లు తీసుకొచ్చి పునర్జీవం కల్పించాం. ఉత్తరాంధ్రుల దశాబ్దాల కోరిక అయినటువంటి రైల్వే జోన్ తీసుకొచ్చాం. అనకాపల్లి జిల్లాలో రూ.1.50 లక్షల కోట్లతో ఆర్సెలార్ మిట్టల్, విశాఖలో గూగుల్ శంకుస్థాపన చేసుకున్నాం. అనకాపల్లిలోని మొత్తం ఏడు ఎమ్మెల్యే సీట్లు గెలిపించారంటే కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనం. అనకాపల్లి జిల్లాలో పని చేసే నాయకత్వం ఉంది. జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు సాకారం చేసి చూపించాం. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఎన్నికల హామీ మేరకు మెగా డీఎస్సీ ద్వారా 15,430 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తే.. సంవత్సరం తర్వాత వచ్చి డీఎస్సీపై జగన్ కుట్రలు చేస్తున్నాడు. పేకాటను కూడా స్పోర్ట్స్ కోటాలో చేర్చి ఉద్యోగాలిచ్చారని సిగ్గులేకుండా వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతున్నాడు. పేకాటకు, బ్రిడ్జి గేమ్ కు తేడా తెలియని వ్యక్తులు మన రాష్ట్రంలో ఉండడం, వారు పాలకుల స్థాయిలో ఉండడం సిగ్గుచేటు. నిన్నటి వరకు పేకాట అన్న వైసీపీ నేతలు.. ఇప్పుడు చంద్రబాబు నాయుడు సామాజిక వర్గానికి ఎక్కువ ఉద్యోగాలిచ్చేశారంటూ వాగుతున్నారు. గతంలో డీఎస్సీల ప్రమోషన్ల విషయంలో ఇదే రకమైన తప్పుడు ప్రచారం చేశారు. నాడు పట్టించుకోకపోవడంతో చాలా నష్టపోయామని మంత్రి రవీంద్ర అన్నారు.

**మహిళా మంత్రిపై దిగజారుడు వ్యాఖ్యలు**

జగన్ రెడ్డి ఐదేళ్ల అరాచక పాలనతో లా అండ్ ఆర్డర్ నాశనమైపోయింది. అలాంటి పరిస్థితుల నుండి లా అండ్ ఆర్డర్‌ను పునరుద్ధరించిన హోం మంత్రి గురించి వైసీపీ నేతలు నీచంగా మాట్లాడుతున్నారు. ఆడబిడ్డలు కట్టుకునే చీరల గురించి కూడా దిక్కుమాలిన మాటలు మాట్లాడుతున్నారు. ఇదే జిల్లా నుండి మంత్రిగా పదవి వెలగబెట్టిన వ్యక్తి.. దావోస్ గురించి అడిగితే అక్కడ చలి ఎక్కువ. అందుకే వెళ్లలేకపోతున్నా అన్నాడు. కంపెనీలు ఏం తెచ్చారు అంటే.. కోడి గుడ్డు పెట్టింది. పొదగాలి పిల్ల రావాలి అంటూ కథలు చెప్పాడు. అలాంటి వారు రాజకీయ నాయకులుగా ఉండడం మన దౌర్భాగ్యం. అలాంటి వ్యక్తుల్ని మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రానీయకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు తీసుకోవాలని మంత్రి రవీంద్ర హితవు చెప్పారు.

**ప్రభుత్వాన్ని కొనసాగిస్తే అభివృద్ధి**

మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి.. ఐదేళ్ల పాలనలో కల్తీ మద్యంతో దేశంలోనే అతి పెద్ద కుంభకోణానికి పాల్పడ్డాడు. వైసీపీ పాలనలో రూ.3500 కోట్ల విలువైన మద్యం కుంభకోణం జరిగిందని కోర్టులు, దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ప్రజల ఆరోగ్యాలతో ఆడుకున్నారు. వేలాది మంది మహిళల్ని వితంతువులుగా మార్చాడు. అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. నూతన పాలసీ తీసుకొచ్చాం. మద్యం అక్రమాలకు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నాం. కల్తీ బ్రాండ్లను తొలగించడంతో రాష్ట్ర ఆదాయం కూడా పెంచుకుంటున్నాం. గుజరాత్ రాష్ట్రం చూడండి. ఒడిశా చూడండి. ఒకటే ప్రభుత్వం కొనసాగడంతో అభివృద్ధి సాగుతోంది. రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉన్నపుడు అభివృద్ధి చేస్తున్నాం. తర్వాత వచ్చిన పాలకులు నాశనమే లక్ష్యంగా పాలన సాగించడంతో మళ్లీ వెనక్కి వెళ్తున్నాం. పాచికల ఆట వద్దు. అభివృద్ధి కొనసాగాలంటే.. ఒకటే ప్రభుత్వం కొనసాగాలి. వచ్చే 20 సంవత్సరాలు కలిసే ఉంటాం. కూటమి ప్రభుత్వం కొనసాగుతుందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. ప్రజలు కూడా సహకరిస్తే రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపి తీరుతామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# రెండేళ్ల కూటమి పాలనకు ప్రజలు బ్రహ్మరథం

- కులాల మధ్య కుంపట్లు, విద్వేషాల పెంపునకు గొడ్డలి పార్టీ కుట్రలు
- బెట్టింగ్, గంజాయి బ్యాచ్ కి విగ్రహాలు వైసీపీ ఘనత
- 2029లో జగన్ దుకాణం మూత ఖాయం
- రాజమహేంద్రవరంలో మంత్రి నిమ్మల రామానాయుడు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యమిచ్చి కూటమి ప్రభుత్వం దూసుకు పోతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు పలు సర్వేలు చెబుతున్నాయన్నారు. కాగా గొడ్డలి పార్టీ, ఆ పార్టీ అధినేత జగన్ కుట్రలు కుతంత్రాలతో అభివృద్ధికి అడ్డు తగులుతున్నాడని మండిపడ్డారు. ప్రతినిత్యం అబద్ధాలు, అసత్యాలతో విష ప్రచారం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. అబద్ధాలకు,అసత్యాలకు ప్యాంటు చొక్కా వేస్తే జగన్ రూపం వస్తుందని ఎద్దేవా చేశారు. అబద్ధాలు, అరాచకాలకు గొడ్డలి పార్టీ పేటెంట్ సాధించిందన్నారు. ఆ పార్టీ చేసే విష ప్రచారం పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని రామానాయుడు పిలుపునిచ్చారు.

ఒక్క ఛాన్స్ అంటే ప్రజలు నమ్మి ఐదేళ్లపాటు అధికారం ఇస్తే తాడేపల్లి ప్యాలెస్‌కే జగన్ పరిమితమైపోయాడన్నారు. బయటకు రావాలంటే బారికేడ్లు, పరదాలు, 30 పోలీస్ యాక్ట్, ప్రతిపక్ష నేతల హౌస్ అరెస్టులు అమలు చేసి ఆ తర్వాత బయటకు వచ్చేవాడన్నారు. కక్షలు, కార్పణ్యాలు, నియంతృత్వ పోకడలతో ఐదేళ్ల పాటు పాలన సాగించడం మనమందరం చూసామన్నారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనకు, రెండేళ్ల కూటమి పాలనకు ప్రజలు తేడా గమనించాలన్నారు. అధికారం పోయిన ఈ రెండేళ్లలోనూ జగన్ పార్టీ పరిస్థితి పిచ్చివాడి చేతిలో రాయిలా మారిందన్నారు. రోజు రోజుకి క్షీణిస్తున్న పార్టీని కాపాడటానికి, క్యాడర్‌ను నిలబెట్టుకోవడానికి జగన్ అడ్డదారులు తొక్కుతున్నాడని మంత్రి రామానాయుడు దుయ్యబట్టారు.

ఏం చేసినా 2029 ఎన్నికల్లో గొడ్డలి పార్టీ ముగింపు ఖాయమన్నారు. రౌడీ షీటర్లు, బ్లేడ్ బ్యాచులు, గంజాయి బ్యాచ్ లతో నిండి ఉన్న వైఎస్సార్‌సీపీ లాకప్ డెత్ ల గురించి మాట్లాడటం విడ్డూరం అని విమర్శించారు. అనేకమంది ఉసురు పోసుకున్న బెట్టింగ్ నిర్వాహకుడు ఆత్మహత్య చేసుకుంటే, అతని కుటుంబాన్ని పరామర్శించడం, అతనికి విగ్రహం పెట్టించడం దేశ చరిత్రలో ఒక్క జగన్ కే చెల్లిందన్నారు. ఫేక్ ప్రచారం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే కుసంస్కారానికి జగన్ దిగజారిపోయాడని మంత్రి రామానాయుడు విమర్శించారు.

అధికారంలోకి రాకముందు ప్రతి ఏటా డీఎస్సీ, మెగా డీఎస్సీ అంటూ ప్రగల్భాలు పలికి డీఎస్సీ మాట దేవుడెరుగు ఒక టీచర్ పోస్ట్ కూడా జగన్ భర్తీ చేయలేదన్నారు. అలాంటి జగన్ నేడు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించి 16,300 పోస్టులు భర్తీ చేస్తే.. ఈ ప్రక్రియపై విషం చిమ్ముతున్నాడని మంత్రి రామానాయుడు తప్పుబట్టారు. అలాగే ప్రతిఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ అంటూ ఆర్భాటం చేసిన జగన్.. ఒక ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ ప్రకటించిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. 2014 –19 మధ్య అప్పటి తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో 40 మందికి డీఎస్పీలుగా ప్రమోషన్ వస్తే వారిలో 38 మంది కమ్మ వర్గానికి చెందిన వారేనని ఫేక్ ప్రచారం చేసిన వైకాపా.. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ 40 మందిలో ఒక్కరు మాత్రమే కమ్మ వర్గానికి చెందిన వారు అనే నిజం నిగ్గు తేలిందన్నారు. ఇలా కులాల మధ్య, వర్గాల మధ్య విభేదాలు, విద్వేషాలు సృష్టించటం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. ఐదేళ్ల అరాచక పాలన చూసిన ప్రజలు విసుగెత్తి 2024లో 11 సీట్లకే పరిమితం చేసిన గొడ్డలి పార్టీని 2029 లో పూర్తిగా మూతపడేలా చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా రామానాయుడు వివరించి చెప్పారు. కార్యక్రమంలో రామానాయుడు తో పాటు మరో మంత్రి కందుల దుర్గేష్, జిల్లాలోని కూటమి పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీల అధ్యక్షులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చైతన్యరథం

# 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమి కబ్జా

- వైసీపీ నేతల అరాచకంపై ఫిర్యాదు
- రూ. 50 వేల బాకీ కోసం ఇల్లు కాజేయాలని చూస్తున్న ఆర్టీఓ
- న్యాయం చేయాలని విన్నపం
- నమ్మించి నగదు, నగలు కాజేశారు
- ఆదుకోవాలని షార్ ఉద్యోగిని భార్య ఆవేదన
- డీకేటీ భూమిపై రిటైర్డ్ ఉద్యోగి, ఎన్నారైల కన్ను.. చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన అర్జీదారులు
- వినతులు స్వీకరించిన మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు





అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన అర్జీదారులు టీడీపీ నేతలకు వినతి పత్రాలు సమర్పించి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించుకున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబులు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

అనంతపురం జిల్లా పామిడి మండలం అప్పాజీపేట గ్రామానికి చెందిన దాసరి శివశంకర్ నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తన పొలాన్ని కబ్జాదారుల నుంయి విడిపించాలని కోరారు. ఆయన ఇచ్చిన అర్జీ మేరకు.. అప్పాజీపేటలో సర్వే నెంబర్ 178 ఎ లోని 7.36 ఎకరాల భూమిలో గత 40 సంవత్సరాలుగా ఆయన కుటుంబం తాటి చెట్లను పెంచుకుంటూ, వాటిపైనే జీవనం సాగిస్తోంది. అయితే, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీకి చెందిన స్థానిక నేతలు సుధామయి, వై. సంజీవరెడ్డిలు అక్రమంగా ఆ తాటి చెట్లను తొలగించి, ఆ భూమిని లాక్కుని వరి సాగు చేయడం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ధైర్యం చేసి, మళ్లీ అదే భూమిలో సుమారు 300 చెట్లను శివశంకం నాటుకోగా ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన సదరు వైసీపీ నేతలు అరాచకానికి పాల్పడి, ఆ 300 చెట్లను పూర్తిగా ధ్వంసం చేశారు. అంతటితో ఆగక ట్రాక్టరుతో భూమి దున్నించి అక్కడ మళ్లీ వరి నాట్లు వేశారు. ఈ అన్యాయంపై అదే రోజు పామిడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అక్కడి సీఐ కేసు తీసుకోలేదు. "నీకు పట్టా ఉంటేనే కేసు తీసుకుంటాను, లేదంటే వెళ్ళిపో" అంటూ నిర్లక్ష్యంగా వెనక్కి పంపించేశారు. అనంతరం పామిడి తహశీల్దార్‌కి కూడా ఫిర్యాదు చేసినప్పటికీ, రెవెన్యూ అధికారులు ఇంతవరకు ఎలాంటి న్యాయం చేయలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతల అర్జీ ఇచ్చి శివశంకర్ అభ్యర్ధించారు.

### రుణం మొత్తం చెల్లించినా..

కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం సీతాయలంక గ్రామానికి చెందిన వరప్రసాద్ బాబు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. ఇంటిపై తనఖా రుణం తీసుకుని.. మొత్తం చెల్లించినా ఇల్లు తిరిగి స్వాధీనం చేయకుండా బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన ఇచ్చిన అర్జీ మేరకు.. గ్రామంలో 4 సెంట్ల స్థలంలో వరప్రసాద్ బాబుకు ఒక ఇల్లు ఉంది. గతంలో అత్యవసరాల నిమిత్తం ఏలూరులో ఆర్టీఓ గా పనిచేస్తున్న వ్యక్తి వద్ద మధ్యవర్తి 'శీను' సమక్షంలో ఇల్లును ఆయన పేరిట తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ చేసి రూ. 8 లక్షల అప్పు తీసుకున్నారు. డబ్బు తిరిగి కట్టేసిన తర్వాత ఇల్లును మళ్లీ వరప్రసాద్ బాబు పేరిట ఇచ్చేస్తానని సదరు ఆర్టీవో నాడు ఒప్పందం చేసుకున్నారు. కానీ ఆ తర్వాత మాట తప్పి ఇంటి గదులను పగలగొట్టడమే కాకుండా.. "ఈ ఇల్లు నీకు ఇవ్వను, ఎక్కువ రేటుకు అమ్ముకుంటాను" అని బెదిరింపులకు దిగారు. దీనిపై గ్రామంలోని పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించి.. ఆయనకు ఇవ్వాల్సిన మొత్తంలో రూ. 7.50 లక్షలు (ఏడున్నర లక్షలు) ఇప్పటికే తిరిగి చెల్లించేశాను.. కేవలం ఇంకా రూ. 50 వేలు మాత్రమే బాకీ ఉన్నాను.. రూ. 50 వేల బాకీ కోసం ఒక ఉన్నతాధికారి తన ఇల్లును కాజేయాలని చూస్తున్నారు కావున న్యాయం చేయాలని వరప్రసాద్ బాబు ఎంతగా కోరినా ఫలితం లేకపోయింది. తగిన చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని వరప్రసాద్ బాబు కోరారు.

### నమ్మించి నగదు దోచేశారు

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన శ్లీవమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. నమ్మించి రూ. 14 లక్షల నగదు, 45 సవర్ల బంగారం కాజేసిన దంపతులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. అమె ఇచ్చిన వినతి మేరకు.. నాయుడుపేట టౌన్, అగ్రహారపేటకు చెందిన జంబుగోళం ప్రసాద్, అతని భార్య రేవతిలు కలిసి 2014లో సూళ్లూరుపేట షార్ బైపాస్ (బస్టాండ్)లో ఒక తాత్కాలిక ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అక్కడకు వచ్చే వారితో నమ్మకంగా పరిచయాలు పెంచుకున్నారు. ఈ క్రమంలో షార్ ఉద్యోగి భార్య అయిన శ్లీవమ్మతో కూడా రేవతి పరిచయం పెంచుకుంది. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పెట్టుబడి కోసం అంటూ మొదట శ్లీవమ్మ వద్ద రూ. 1,00,000/- తీసుకుని వారం వారం కొంత డబ్బు తిరిగి ఇస్తూ నమ్మకం కుదిరేలా వ్యవహరించారు. నాయుడుపేటలో తమకు చాలా అప్పులు ఉన్నాయి, తమ ఇల్లు అమ్మేసి మీ డబ్బులు రూ. 2 వడ్డీతో తీర్చేస్తాం" అని నమ్మించి, ఇంటి నకిలీ దస్తావేజులు (జెరాక్స్) చూపించి శ్లీవమ్మను ఈ జంట దారుణంగా బురిడీ కొట్టించింది. వీరిని నమ్మి మూడు విడతలుగా తన సొంత డబ్బు, పొరుగువారి వద్ద అప్పు తెచ్చిన డబ్బు కలిపి రూ. 6 లక్షలు, అలాగే మూడు చీటీలకు సంబంధించిన రూ. 8 లక్షల పైకాన్ని (మొత్తం 14 లక్షల నగదు) వీరికి శ్లీవమ్మ అప్పగించింది. అంతేకాకుండా నాయుడుపేటలోని మా ఇల్లు రూ. 20 లక్షలు పలుకుతుంది, ఆ ఇల్లు మీ పేరిట రిజిస్ట్రేషన్ చేస్తాం అని రేవతి ప్రాధేయపడటంతో.. తన వద్ద, తన కుమార్తె వద్ద ఉన్న 45 సవర్ల బంగారు ఆభరణాలను కూడా శ్లీవమ్మ వారికి ఇచ్చింది. తీరా వారం రోజుల తర్వాత ఇల్లు రిజిస్ట్రేషన్ విషయమై వారి ఇంటికి వెళ్లగా, ప్రసాద్, రేవతిలు రాత్రికి రాత్రే ఇల్లు ఖాళీ చేసి పారిపోయారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో విచారించగా ఆ ఇల్లు ఎప్పుడో వేరేవాళ్లకు అమ్మేసినట్లు తేలింది. మోసపోయానని గ్రహించి వారిని శ్లీవమ్మ నిలదీయగా.. "నువ్వు ఎవరో మాకు తెలియదు, ఎక్కువ మాట్లాడితే రౌడీలతో చంపేయిస్తాం" అంటూ భౌతికంగా నెట్టివేసి, దౌర్జన్యానికి దిగారు. వీరికి ఇందిరానగర్‌కు చెందిన చీమలదిన్నె శ్రీనివాసులు అనే వ్యక్తి కూడా సహకరిస్తూ, ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారం కుదువ పెట్టించి, ఆ తర్వాత శ్లీవమ్మకు తెలియ కుండా ఆ బంగారాన్ని కూడా విడిపించుకుని మోసానికి పాల్పడ్డారు. ఇదే కాకుండా గోకులం చిట్స్ పేరుతో నెలకు రూ. 25,000/- చొప్పున శ్లీవమ్మ వద్ద వసూలు చేసి ఆఫీసులో కేవలం రూ. 100 మాత్రమే కట్టి రశీదుల విషయంలో కూడా మోసం చేసారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని శ్లీవమ్మ కోరారు.

### బెదిరించి భూమి కబ్జా

వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మనోహర్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..మదనపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 422/4 లోని 0.80 సెంట్ల భూమిని 1985వ సంవత్సరంలో ప్రభుత్వం తమ మామ ఇల్లూరు సుబ్బరాయుడుకి డి.కె.టి పట్టా నెంబర్ 1392 ద్వారా కేటాయించిందని తెలిపారు. కొన్ని సంవత్సరాల క్రితం సుబ్బరాయుడు మరణించడంతో, ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబ సభ్యులను బెదిరించి, సదరు భూమిని ముగ్గురు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు ఆక్రమణదారులు సర్వే నెంబర్ 422-2 కి సంబంధించిన నకిలీ డి.కె.టి పట్టా, పాస్‌బుక్‌లను సృష్టించి, ఎన్.ఆర్.ఐ సెల్ ద్వారా తమపైనే తప్పుడు ఫిర్యాదులు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం అక్కడ ఎలాంటి సబ్ డివిజన్ గానీ, లేఖలు గానీ లేవు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని మనోహర్ కోరారు.

### అక్రమ ఫిర్యాదులతో వేధింపులు

ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం పావులూరివారిగూడెం గ్రామానికి బంటుమిల్లి రామలక్ష్మి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గ్రామంలోని కొందరు వ్యక్తులు తమపై కక్షతో నిరాధార, తప్పుడు పత్రాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేయిస్తున్నారని.. తమకు న్యాయం చేయాలని కోరారు.

2015వ సంవత్సరంలో గ్రామంలో ఒక వ్యక్తి ప్రభుత్వ భూమిని అక్రమ పంపకాలు చేయగా తన భర్త బంటుమిల్లి సుబ్బారావు వ్యతిరేకించారన్నారు. అప్పటి నుండి అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు తీవ్రమైన వ్యక్తిగత కక్ష పెంచుకున్నారు. ఈ కక్షతో సదరు వ్యక్తులు గ్రామంలోని అమాయక, నిరక్షరాస్యులైన ప్రజల వద్ద తెల్లకాగితాలపై సంతకాలు, వేలిముద్రలు సేకరించారు. మరికొందరి సంతకాలను దొంగతనంగా ఫోర్జరీ చేసి.. గ్రామస్తులకు ప్రభుత్వం ఇచ్చిన 10 ఎకరాల భూమిని బంటుమిల్లి సుబ్బారావు కుటుంబం ఆక్రమించుకుందని, అక్రమ కేసులు పెట్టి వాటిని వెనక్కి తీసుకోవడానికి లక్ష రూపాయలు డిమాండ్ చేస్తోందని తప్పుడు పత్రాలతో జిల్లా కలెక్టర్‌కు నిరాధారమైన ఫిర్యాదులు చేశారు. తమ సామాజికవర్గం జనాభా గ్రామంలో ఎక్కువగా ఉందనే అహంకారంతో ఈ ముఠా ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతోంది. వీరి అన్యాయాలను ఎదిరించి ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. వారిని గ్రామం నుండి వెలివేస్తామని, ఉమ్మడి నిధులు గానీ, శుభకార్యాలకు వాడే సామాగ్రిని గానీ ఇవ్వబోమంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ దౌర్జన్యాలపై గత మే నెలలో ద్వారకా తిరుమల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, స్థానిక పోలీసులు ఎలాంటి విచారణ జరపకుండానే ఆ ఫిర్యాదును ముగించేశారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని రామలక్ష్మి కోరారు.

### భూమి ఆక్రమించారు..

బాపట్ల జిల్లా అమృతలూరు మండలం గూబపూడి గ్రామానికి చెందిన మహాలక్ష్మి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నవారిపై చర్యలు తీసుకుని తమకు న్నాయం చేయాలని కోరారు. ఆమె ఇచ్చిన అర్జీ మేరకు.. గూబపూడి గ్రామంలో సర్వే నెంబర్ 109/1 లోని 0.29 సెంట్ల భూమి, సర్వే నెంబర్ 109/2 లోని 0.35 సెంట్ల భూమి (మొత్తం 0.64 సెంట్లు) 1988వ సంవత్సరంలో ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా ద్వారా మహాలక్ష్మి అత్తకు లభించింది. నాటి నుండి ఈ భూమి వారి కుటుంబ ఆధీనంలోనే ఉంటూ వస్తోంది. సదరు భూమిని ఆమె అత్త ఎవరికీ విక్రయించలేదు. అయితే, ఇటీవల కొందరు వ్యక్తులు ఈ భూమిని అక్రమంగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ విషయమై నిలదీయగా ఆక్రమణదారుల నుండి సరైన సమాధానం రాకపోగా, ఇటు గామానికి చెందిన వీఆర్ఓ కూడా వీరికి కనీసం సహకరించడం లేదు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని మహాలక్ష్మి కోరింది.

### దారి మూసేశారు.. న్యాయం చేయండి

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన పేరయ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ ఇంటికి వెళ్లే దారి మార్గంలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పెద్ద పెద్ద రాళ్లు వేసి దారిని పూర్తిగా మూసివేశారని తెలిపారు. గతంలో ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేయగా, స్థానిక ఎం.ఆర్.ఓ, పోలీసులు సమక్షంలో ఆ రాళ్లను తొలగించారు. అయితే, అధికారులు వెళ్ళిపోగానే సదరు వ్యక్తులు మళ్లీ ఆ రాళ్లను దారికి అడ్డంగా వేసి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీనిపై ప్రశ్నించగా, "మీకు దిక్కున్న చోట చెప్పుకోండి, ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ సదరు వ్యక్తులు బెదిరింపులకు దిగుతున్నారు. తాము ఓసీ (కమ్మ) సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబమని, తమకు ఎలాంటి రాజకీయ బలం లేదు. ఎదుటి పక్షం వారు ఎస్సీ (మాల) కులానికి చెందిన వారుగా చెబుతూ, తమపై తప్పుడు కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని పేరయ్య కోరారు.

### భూమి సమస్య పరిష్కరించండి..

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురానికి చెందిన నలమాటి రామారావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమికి సంబంధించిన సమస్య పరిష్కరించాలని కోరారు. ఆయన ఇచ్చిన అర్జీ మేరకు.. ఆయన తండ్రి నలమాటి సింహాచలం మాజీ సైనికుడు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తించి ఆనాటి ప్రభుత్వం సాగు నిమిత్తం 4.99 ఎకరాల భూమిని కేటాయించింది. అయితే, ప్రభుత్వ రికార్డుల ప్రకారం కే. గంగవరం మండలం పరిధిలోని సర్వే నెంబర్ 214/3 లో మురుగు కాలువ పోగా, ప్రస్తుతం 0.93 సెంట్ల భూమి మిగిలి ఉంది. ఈ భూమిలోనే గత 30 సంవత్సరాలుగా కొబ్బరి మొక్కలు వేసుకుని ఆయన కుటుంబం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. సదరు భూమికి శాశ్వత 'పి.ఫారం' పట్టా మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా, స్థానిక కే. గంగవరం మండల తహశీల్దార్ క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నివేదిక ఇచ్చారు. అలాగే ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ (నీటి పారుదల శాఖ) అధికారులు కూడా ఆ భూమితో కాలువకు ఎలాంటి ఇబ్బంది లేదని క్లియరెన్స్ సర్టిఫికెట్ జారీ చేశారు. కానీ, రామచంద్రాపురం ఆర్డీఓ గారు మాత్రం ఆ మిగిలిన 0.93 సెంట్ల భూమి కూడా మురుగు కాలువలోనే ఉందంటూ పట్టా ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. కింద స్థాయి అధికారులు సాగులో ఉందని సర్టిఫికెట్లు ఇచ్చినా, ఆర్డీఓ కార్యాలయం స్పందించకపోవడంతో గత 3 ఏళ్లుగా ఆఫీసుల చుట్టూ తిరిగి విసిగిపోయాం. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని పలువురు కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

చైతన్యరథం

# మహిళలను అవమానిస్తే వదిలేది లేదు

- హోం మంత్రిపై వైసీపీ నేత అమర్నాథ్ వ్యాఖ్యలు సిగ్గుచేటు
- ఐదేళ్ల పాలనలో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన నీచుడు జగన్ రెడ్డి
- భార్య పేరుతో వ్యాపారం చేసి బియ్యాన్ని బొక్కేసిన పేర్ని నోట నీతులు విడ్డూరం
- వచ్చే ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం ఖాయం
- మంత్రి కొల్లు రవీంద్ర



అనకాపల్లి (చైతన్యరథం): మహిళల ఆత్మగౌరవంతో ఆటలాడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టేదే లేదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో బుధవారం మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ నేతలకు మతి భ్రమించి పిచ్చి పిచ్చిగా వాగుతున్నారన్నారు. జగన్ రెడ్డి మెప్పు కోసం నాయకులు మాట్లాడుతున్నారో... లేక జగన్ రెడ్డే ఇలా మాట్లాడిస్తున్నారో త్వరలోనే తేలుస్తామన్నారు. మాజీ మంత్రి పేర్ని నానికి బాడీ పెరిగింది కానీ బుర్ర పెరగలేదన్నారు. హోం మంత్రి అనిత గురించి వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని మంత్రి నారా లోకేష్ ప్రశ్నించారు... జగన్ సతీమణి భారతి గురించి గానీ, వారి కుమార్తెల గురించి గానీ మేము ఏ రోజైనా తప్పుగా మాట్లాడామా.. అని లోకేష్ ప్రశ్నిస్తే.. వారిని ఏదో అనేశారు అంటూ పేర్ని నాని లగెత్తుకొచ్చేశాడు. తప్పు చేసిన వాళ్లను ప్రశ్నించాల్సింది పోయి ప్రశంసించడానికి సిగ్గుండాలి. మహిళల విషయంలో వైసీపీ నేతలకు అంత చిత్తశుద్ధి ఉంటే హోం మంత్రి అనితపై గుడివాడ అమర్నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేసినపుడు ఎందుకు నోరెత్తలేదు. అధికారంలో ఉన్న ఐదేళ్లు రాష్ట్రంలోని మహిళల్ని ఎంతలా వేధించారో, ఎలా హింసించారో ప్రజలు మరిచిపోలేదు. స్వాతంత్ర్య సమరయోధులు గౌతు లచ్చన్న వారసురాలు గౌతు శిరీషను రకరకాలుగా వేధించారు. క్యాన్సర్‌తో పోరాడి నేడు ప్రజల కోసం పని చేస్తున్న పంచుమర్తి అనురాధను సోషల్ మీడియా వేదికగా అవమానించారు. తప్పుడు పోస్టులతో మానసిక క్షోభకు గురి చేశారు. అమరావతి కోసం భూములిచ్చి న్యాయం చేయండంటూ న్యాయస్థానం టు దేవస్థానం పాదయాత్రగా వెళ్తున్న మహిళల్ని ఎంతలా చిత్రహింసలు పెట్టారో మరిచిపోయారా? పోలీసు బూటు కాళ్లతో తన్నించారు. లాఠీలతో పొత్తి కడుపుల్లో కొట్టించారు. వారు స్నానం చేస్తుంటే డ్రోన్ కెమెరాలతో వీడియోలు తీయించారు. చివరికి వారు చీరలు కట్టుకోవడాన్ని కూడా అవహేళన చేశారని మంత్రి రవీంద్ర గుర్తు చేశారు.

### సొంత చెల్లినీ వదలని జగన్


రక్తం పంచుకుని పుట్టిన చెల్లెలు పసుపు చీర కట్టుకుందని సాక్షాత్తూ జగన్ రెడ్డి నీచంగా వ్యాఖ్యానించాడు. పెయిడ్ ఆర్టిస్టులతో బూతులు తిట్టించారు. ఆమె పుట్టుకను ప్రశ్నించారు. సొంత బాబాయి హత్య కేసులో న్యాయం కోరిన చెల్లి సునీతను వేధించారు. హత్య కేసును ఆమెపైకి నెట్టేసేందుకు ప్రయత్నించారు. నేరస్తుల్ని కాపాడి చెల్లికి ద్రోహం చేశారు. చివరికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని మా భువనమ్మ గురించి నిండు సభలో అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడారు. సభ్యులందరినీ సస్పెండ్ చేసి మా నాయకుడు చంద్రబాబు గురించి నీచాతి నీచంగా వ్యాఖ్యానించారు. మహిళల విషయంలో మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే.. భారతి రెడ్డి గురించి చిన్న పోస్టు పెట్టిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తతో క్షమాపణలు చెప్పించి అరెస్టు చేయించాం. మా పార్టీకి, మా నాయకుడికి విలువలు ఉన్నాయి కాబట్టే చిన్న తప్పు దొర్లినా తక్షణమే సరిదిద్దుకుంటాం.

గతంలో చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన జోగి రమేష్‌కు జగన్ మంత్రి పదవి ఇచ్చాడు. మాచర్లలో టీడీపీ నేతలపై దాడి చేసిన తురకా కిషోర్‌కు మున్సిపల్ ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. పార్టీ కార్యాలయాలపై దాడులకు ఉసిగొల్పారు. హుందాతనంతో కూడిన రాజకీయాలు మా పేటెంట్ రైట్స్. గూండా రాజకీయాలు వైసీపీ పేటెంట్ రైట్స్ అని మంత్రి రవీంద్ర అన్నారు.

### భూ స్థాపితం ఖాయం

భార్య పేరుతో వ్యాపారం చేసి.. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసి.. పారిపోయి బెయిల్ తెచ్చుకుని బతుకుతున్న పేర్ని నాని ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నాడు. మచిలీపట్నం నియోజకవర్గంలో పేర్ని నానిని కుక్కలు కూడా పట్టించుకోవడం లేదు. పోటీ చేస్తే డిపాజిట్లు కూడా దక్కవని భయపడి కొడుకుని నిలబెట్టి పారిపోయాడు. భార్యపేరుతో వ్యాపారం చేసి దాదాపు 8000 బస్తాల పేదల బియ్యాన్ని బొక్కేసి, డబ్బులు కట్టేశాం, నీతి మంతులమైపోయాం అన్నట్లు మాట్లాడుతున్నాడు. డబ్బులు కట్టేసినంత మాత్రాన దొంగలు దొరలు కాలేరనే విషయం గుర్తుంచుకోవాలి. మహిళలపై మాకు గౌరవం ఉంది కాబట్టే.. భార్య పేరుతో వ్యాపారం చేసి అక్రమాలకు పాల్పడినప్పటికీ.. పేర్ని పాపానికి మహిళలు బలి కాకూడదనే ఉద్దేశ్యంతో క్షమించి వదిలేశాం. పేర్ని నానీ.. నీవు మాట్లాడే ప్రతి మాటా నిన్ను రాజకీయంగా సమాధి చేస్తోంది. వైసీపీ ఐదేళ్ల అరాచకాల కారణంగా ప్రజలు 11 సీట్లకు తొక్కి పడేశారు. భవిష్యత్తులో పూర్తిగా భూస్థాపితం చేసేయడం తథ్యమని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# 20న పీఎం కిసాన్ నగదు జమ



అమరావతి(చైతన్యరథం): రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం ద్వారా నిధులు అందిస్తుంది. 23వ పీఎం కిసాన్ యోజన నిధుల విడుదలకు కేంద్రం ముహూర్తం ఖరారు చేసింది. జూన్ 20వ తేదీన రైతుల ఖాతాల్లో ఈ నగదు జమ కానుంది. పశ్చిమబెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దాంతో ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున నగదు జమ కానుంది. ప్రతి ఏటా మూడు దఫాలుగా ఈ నిధులను కేంద్రం విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా ఏడాదికి మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాలో నగదు జమ అవుతాయి. అవి మూడు దఫాలుగా.. నాలుగు నెలలకు ఒకసారి రూ. 2 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో ఈ నగదు కేంద్రం వేస్తోంది. 2019లో పీఎం కిసాన్ పథకాన్ని కేంద్రం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చి 13వ తేదీన 22వ విడత నగదును అసోంలోని గౌహతి వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేసిన విషయం విదితమే.

# శింగరకొండ ఆలయ రాజగోపురాల పునర్నిర్మాణానికి అనుమతి



అద్దంకి (చైతన్యరథం): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతు న్నాయి. ఇప్పటికే సుమారు రూ.7 కోట్ల రూపాయలతో రాతి ముఖ మండపం నిర్మాణం పూర్తి కాగా, కొత్తగా మరో రూ.20 కోట్లతో నాలుగు రాజగోపురాలు, ప్రాకారం నిర్మించనున్నారు. వీటి నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారు. వీటి నిర్మాణానికి సంబంధించి అంచనాలు సిద్ధం చేసేందుకు దేవదాయ కమిషనర్ బుధవారం అనుమతులు ఇచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈవో తిమ్మానాయుడు తెలిపారు. అంచనాలు రూపొందించిన అనంత రం రాజగోపురాలు, ప్రాకారం న మూనా సిద్ధం చేసి ఉన్నతాధికారుల అనుమతి పొందుతామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే వాటి నిర్మాణం పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే రూ.2 కోట్లతో కోనేరు నిర్మాణానికి ఇప్పటికే అనుమతులు తీసుకున్నామని, దాతలు ముందుకు వచ్చిన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. గోశాల నిర్మాణ పనులు కూడా చేపట్టామన్నారు. కొండపై పెద్దఎత్తున మొక్కలు పెంపకం చేపట్టేందుకు డ్వామా సహకారంతో వర్షాకాలం ప్రారంభమైన వెంటనే డ్రోన్ల సహాయంతో విత్తనాలు చల్లించే ఏర్పాట్లు జరుగుతు న్నాయని తెలిపారు.

# కులాల మధ్య చిచ్చుకు జగన్ కుట్ర

- హెూంమంత్రి అనితపై గుడివాడ దిగజారుడు వ్యాఖ్యలు
- బే షరతుగా క్షమాపణ చెప్పాలి
- రాజ్యసభ సభ్యుడు సానా సతీష్



అమరావతి (చైతన్యరథం): కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ నైజమని, అదే ఆయన డీఎన్ఏ అని టీడీపీ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ ధ్వజమెత్తారు. అమరావతిలో బుధవారం మీడియాతో సానా సతీష్ మాట్లాడుతూ తన రాజకీయ పబ్బం కోసం కాపులను బలిపశువుల్ని చేయాలని జగన్ చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. జగన్ కుట్రలను అన్నివర్గాల ప్రజలు తిరస్కరించి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసినా మళ్లీ కులాల మధ్య చిచ్చుకు తెరలేపుతున్నాడని మండిపడ్డారు. కుల చిచ్చు రేపాలనే జగన్ కుట్రలో భాగంగానే హోం మంత్రి అనితపై వైసీపీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ దిగజారుడు విమర్శలు చేశారు. మహిళలంటే జగన్ కు మొదటి నుంచీ ద్వేషం. కన్న తల్లి, సొంత చెల్లిని గెంటేయటమే ఇందుకు నిదర్శనం. ఆస్తిలో వాటా ఇవ్వకుండా చెల్లిని ఇంట్లోంచి బయటికి గెంటేసి తల్లి సహా ఇద్దరినీ జగన్ అవమానపరిచాడు. మహిళల పట్ల వైసీపీ నేతల చిన్నచూపుకు ఇది నిదర్శనం. జగన్ బాటలోనే ఆ పార్టీ నేతలు కూడా నడుస్తున్నారు. అహంకారంతో మహిళలను అవమానిస్తే సహించబోం. మహిళల పట్ల గొడ్డలి పార్టీ వైఖరి ఇలాగే ఉంటే 2029 లో ఇప్పుడున్న 11 సీట్లు కూడా రావు. కష్టపడి స్వశక్తితో ఉన్నత స్థానానికి చేరుకున్న మంత్రి అనితపై దిగజారుడు వ్యాఖ్యలు సిగ్గుచేటు. మహిళల పట్ల చులకనగా మాట్లాడే నేతలకు ఈ సమాజంలో స్థానం లేదు. గుడివాడ అమర్నాథ్ బే షరతుగా హోంమంత్రి అనితకు క్షమాపణ చెప్పాలని ఎంపీ సానా సతీష్ డిమాండ్ చేశారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి

- వైకుంఠపాళి లాంటి పాలనతో రాష్ట్రం దెబ్బతింటోంది
- జగన్ రెడ్డి లాంటి అరాచక శక్తి మళ్లీ అధికారంలోకి రాకూడదు
- అనకాపల్లిలో రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమం సభలో మంత్రి కొల్లు రవీంద్ర



అనకాపల్లి (చైతన్యరథం): రాష్ట్రంలో వైకుంఠపాళి పాలనకు చరమగీతం పాడుదాం.. అభివృద్ధి చేసే కూటమి ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లాలో నిర్వహించిన రెండేళ్ల కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి బహిరంగ సభలో పాల్గొన్నారు. భారీర్యాలీగా వెళ్లి అన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సాగిన విధ్వంసం నుండి వికాశం వైపు ప్రయాణం ప్రారంభించి రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్నాం. సంక్షోభం నుండి స్వర్ణాంధ్ర నిర్మాణానికి పునాదులు వేసుకుంటున్నాం. రెండేళ్ల పాలన పూర్తి చేసుకుని ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నందుకు ఆనందంగా ఉంది. 2014లో రాష్ట్ర విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని ఇటుక ఇటుక పేర్చుకుంటూ అభివృద్ధి బాటలో నడిపించాం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులు పూర్తి చేసుకోవాలనే లక్ష్యంతో అడుగులేశాం. అలాంటి సమయంలో కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి.. కుర్చీ ఎక్కిన తొలి రోజునే ప్రజావేదిక కూల్చివేశాడు. ఆ రోజు మొదలు పెట్టిన కూల్చివేతలు ఐదేళ్ల పాలనంతా కొనసాగించాడు. అన్ని రంగాలను, అన్ని వ్యవస్థల్ని కుప్పకూల్చాడు. అన్ని వర్గాలను మోసం చేశాడు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా దగా చేశాడు.

## ప్రజాస్వామ్య పునరుద్దరణకు శ్రీకారం

ప్రజలు సమస్యను బయటకొచ్చి చెప్పుకునే పరిస్థితి లేకుండా అణచివేతకు దిగారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టారు. దళితులపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాడు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా చేసి.. గంజాయి డ్రగ్స్‌కు బానిసల్ని చేశాడు. జగన్‌రెడ్డి అరాచక శక్తి నుండి రాష్ట్రాన్ని కాపాడుకునే లక్ష్యంతో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏర్పడిన కూటమిని ప్రజలు 94శాతం సీట్లతో గెలిపించారు. 164 స్థానాల్లో గెలిపించి ప్రజాస్వామ్య పునరుద్దరణకు శ్రీకారం చుట్టారు.



అధికారం చేపట్టినప్పటికీ.. ప్రభుత్వ ఖజానా ఖాళీ చేశారు. ఆదాయం లేదు. ఉన్న ఆస్తుల్ని తాకట్టు పెట్టేశారు. కానీ పట్టువదలని విక్రమార్కుల్లా, పరిపాలనా దక్షతతో పాలన మొదలు పెట్టాం.

## సూపర్ సిక్స్ హామీలు అమలు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలు అమలు చేశాం. 63 లక్షల మందికి పెన్షన్ల రూపంలో రెండేళ్లలో రూ.65 వేల కోట్లు చెల్లించాం. తల్లికి వందనం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తామని హామీ ఇచ్చాం. 68 లక్షల మందికి రూ.10వేల కోట్లు చెల్లించాం. త్వరలోనే మళ్లీ రూ.10వేల కోట్లు ఇవ్వబోతున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా 47 లక్షల మందికి రూ.20 వేల చొప్పున అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. మత్స్యకారుల సేవలో కార్యక్రమం ద్వారా 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు జమచేశాం. నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు, చేనేతల మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తున్నాం. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాం. లైసెన్సు ఫీజులో 50 శాతం సబ్సిడీ కల్పించాం. వడ్డెరలకు బిల్డింగ్ మెటీరియల్ లీజుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాం.

## ఉత్తరాంధ్రను పెద్దఎత్తున అభివృద్ధి చేస్తున్నాం

కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసి గ్రావిటీ ద్వారా అన్ని ప్రాంతాలకు నీళ్లివ్వబోతున్నాం. అమరావతి రాజధాని పనులు ప్రారంభించాం. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం నుండి రూ.11 వేల కోట్లు తీసుకొచ్చి పునర్జీవం కల్పించాం. ఉత్తరాంధ్రుల దశాబ్దాల కోరిక అయినటువంటి రైల్వే జోన్ తీసుకొచ్చాం. అనకాపల్లి జిల్లాలో రూ.1.50లక్షల కోట్లతో అర్సెలార్ మిట్టల్, విశాఖలో గూగుల్ శంకుస్థాపన చేసుకున్నాం. ఎన్నికల హామీ మేరకు మెగా డీఎస్సీ ద్వారా 15,430 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తే.. సంవత్సరం తర్వాత వచ్చి డీఎస్సీపై కుట్రలు చేస్తున్నాడు.

## వైసీపీ మద్యం కుంభకోణం రూ.3500 కోట్లు దోపిడి

మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తానని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి.. ఐదేళ్ల పాలనలో కల్తీ మద్యంతో దేశంలోనే అతిపెద్ద కుంభకోణానికి పాల్పడ్డాడు. వైసీపీ పాలనలో రూ.3500 కోట్ల విలువైన మద్యం కుంభకోణం జరిగిందని కోర్టులు, దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ప్రజల ఆరోగ్యాలతో ఆడుకున్నారు. వేలాది మంది మహిళల్ని వితంతువులుగా మార్చాడు. అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. నూతన పాలసీ తీసుకొచ్చాం. మద్యం అక్రమాలకు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నాం.

# స్థానిక సంస్థల ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేయండి: ఎమ్మెల్యే కోళ్ల లలిత




శృంగవరపుకోట (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారం మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా ఎల్.కోట క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో పాటు మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కార్పొరేషన్ల నామినేటెడ్ డైరెక్టర్లు, చైర్మన్లు మరియు రాష్ట్రస్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతపై సుదీర్ఘంగా చర్చించారు.

**స్థానిక ఎన్నికలకు సమరశంఖం:**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఇందుకోసం పార్టీ శ్రేణులన్నింటినీ సమరశంఖానికి సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పిలుపునిచ్చారు. క్లస్టర్, బూత్ స్థాయిల నుండి సమన్వయంతో పనిచేస్తూ, ప్రజల్లోకి బలంగా వెళ్లాలని స్పష్టం చేశారు. అదేవిధంగా సర్, ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు (అవేర్‌నెస్ డ్రైవ్స్) నిర్వహించాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ముఖ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ విప్ గణబాబు సన్మానం



విశాఖపశ్చిమ (చైతన్యరథం): విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించిన విద్యార్థులను విశాఖ పశ్చిమ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ గణబాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి, ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడం ఎంతో గర్వకారణమని కొనియాడారు. పేదరికాన్ని జయించి, ఇంతటి ఘన విజయాలు సాధించిన విద్యార్థుల భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను మరియు విద్యార్థుల తల్లిదండ్రుల కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎంఈవో, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహిళలను అవమానించే వ్యాఖ్యలు సహించం : ఎమ్మెల్యే ఎంజీఆర్

- హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుడివాడ అమర్నాథ్ వెంటనే క్షమాపణ చెప్పాలి



పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయవంతమైన పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవ కార్యక్రమాలలో భాగంగా, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మహిళలు, తెలుగు మహిళ నాయకులు, కూటమి శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొని మాట్లాడారు. ఒక మహిళా మంత్రిని కించపరిచే విధంగా మాట్లాడటం అత్యంత బాధాకరమని, మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. మహిళలకు సముచిత గౌరవం, భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి అనిత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తుండటాన్ని చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా మహిళలు గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. మహిళల మనోభావాలను దెబ్బతీసినందుకు గుడివాడ అమర్నాథ్ వెంటనే రాష్ట్ర మహిళలకు, హోంమంత్రి అనితకి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# యోగా ద్వారా మానసిక ప్రశాంతత : హెూం మంత్రి అనిత



పాయకరావుపేట (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హోం మంత్రి, ఎంపీ, అధికారులు యోగాసనాలను వేశారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో అవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై టీడీపీ ఎస్ఐఆర్ వర్క్‌షాప్



పాలకొండ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి ఆధ్వర్యంలో బుధవారం నక్కలపేటలోని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్) వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పడాల భూదేవి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలకు సంబంధించిన ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కొత్త పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాల అమలులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 12 ఏళ్ల మోదీ పాలన దేశానికి గర్వకారణం

●కూటమి బలంతో సీఎం చంద్రబాబు రాష్ట్ర పునర్నిర్మాణానికి శ్రీకారం

●జాతీయ భద్రతకు ఇచ్చిన ప్రాధాన్యత దేశ ప్రతిష్టను పెంచాయి

●రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశాన్ని అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా నిలిపిందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా "12 ఏళ్ల విశ్వాస్ కే, వికాస్ కే, జన్ కళ్యాణ్ కే" పేరిట బుధవారం ఉదయం స్థానిక ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరుల కూటమి నాయకులతో కలిసి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై అపూర్వమైన గుర్తింపు సాధించిందని అన్నారు. ప్రపంచ దేశాలు భారతదేశాన్ని గౌరవంతో చూసే స్థాయికి తీసుకెళ్లిన ఘనత మోదీదేనని పేర్కొన్నారు. జీ-20 సదస్సు విజయవంతమైన నిర్వహణ, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, జాతీయ భద్రతకు ఇచ్చిన ప్రాధాన్యత దేశ ప్రతిష్టను మరింత పెంచాయని తెలిపారు. గత 12 సంవత్సరాల్లో దేశంలో రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి అపూర్వంగా జరిగిందని చెప్పారు. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా యువతకు విస్తృత అవకాశాలు లభించాయని, యూపీఐ లావాదేవీల ద్వారా భారతదేశం ప్రపంచానికి డిజిటల్ విప్లవానికి మార్గదర్శకంగా నిలిచిందని వివరించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధాని ఆవాస్ యోజన, ముద్ర యోజన, పీఎం కిసాన్ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా కోట్లాది కుటుంబాలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరిందని తెలిపారు. సంక్షేమం మరియు అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

# ఆర్యవైశ్యుల్ని ఉన్నతంగా తీర్చిదిద్దటమే మా లక్ష్యం : దూండి రాకేష్



విజయవాడ (చైతన్యరథం): అన్ని రంగాలలో ఆర్యవైశ్యుల్ని ఉన్నతంగా తీర్చి దిద్దటమే మా లక్ష్యమని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ కార్పొరేషన్ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. బుధవారం విజయవాడ, పోరంకి, రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో దూండి రాకేష్ అధ్యక్షతన 4వ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు మరియు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన నిరుపేద కుటుంబాలను గుర్తించి, అధ్యక్షులు మరియు బోర్డు డైరెక్టర్ల ఆధ్వర్యంలో వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుటకు సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు వంటి యూనిట్లను ఏర్పాటు చేయుటకు అవసరమైన ప్రణాళికను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువతీ-యువకులను గుర్తించి, వారికి అనుగుణమైన రంగాలలో ఈ సంస్థ ద్వారా నైపుణ్య శిక్షణ అందించి, శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు అందిచేలా ప్రణాళికను రూపొందించాలని తీర్మానించడం జరిగిందన్నారు. సుమారు 10 కోట్ల రూపాయల గ్రాంట్‌తో ఆర్య వైశ్య క్రెడిట్ కోపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేయాలని తీర్మానించడం జరిగింది. MSME / ముద్ర తదితర లోన్స్ ద్వారా మెరుగైన వ్యాపార అవకాశాలను అందిచడానికి, ఆర్యవైశ్యులను చైతన్య పరిచేలా రాష్ట్రస్థాయిలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతీ దేవాలయాల ట్రస్ట్ బోర్డులలో ఆర్యవైశ్యలకు కచ్చితంగా, ఒక డైరెక్టర్ పోస్టు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దాతల నుండి సేకరించిన నిధులతో రాష్ట్రంలో మొన్న వచ్చిన 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు అనగా 570 నుంచి 600 వరకు మార్కులు వచ్చిన విద్యార్థులకు పురస్కారాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 570 నుండి 580 మార్కులు సాధించిన వారికి బ్రాంజ్ పతకం, 580 నుండి 590 మార్కులు సాధించిన వారికి సిల్వర్ పతకం మరియు 590 నుండి 600 మార్కులు సాధించిన వారికి గోల్డ్ పతకాలతో పాటు, ఉత్తీర్ణతా పత్రం ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పేద ఆర్యవైశ్య విద్యార్థులందరూ వినియోగించుకోవాలని ఇందుమూలంగా తెలిపారు.

# విధ్వంసం నుంచి వికాసం వైపు - సంక్షోభం నుంచి స్వర్ణాంధ్ర వైపు

● రెండేళ్ల కూటమి ప్రభుత్వ ప్రస్థానం అద్భుతం : కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కొవ్వూరు పట్టణంలోని లిటరరీ క్లబ్‌లో నియోజకవర్గ స్థాయి విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరియు ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వ విధ్వంసక పాలన వల్ల రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక, పరిపాలనా సంక్షోభాలను అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందని పేర్కొన్నారు. ఈ విజయోత్సవ సభకు ముఖ్య అతిథిగా జిల్లా టీడీపీ అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రానున్న రోజుల్లో మరింత బలంగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# గన్నవరం విమానాశ్రయానికి కొత్త శోభ!... అభివృద్ధికి కొత్త దిశ!"

●నూతన టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలించిన కేంద్రసహాయ మంత్రి శ్రీనివాస వర్మ, ఎంపీ కేశినేని శివనాథ్



గన్నవరం (చైతన్యరథం): విమానాశ్రయం త్వరలోనే అత్యాధునిక సదుపాయాలతో దేశంలోని ప్రముఖ విమానాశ్రయాల సరసన నిలవనున్న నేపథ్యంలో, కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ" విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కలిసి విమానాశ్రయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న నూతన టెర్మినల్ భవనం, ప్రయాణికుల సౌకర్యాల విస్తరణ, ఆధునిక మౌలిక వసతుల కల్పన, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల నాణ్యత, వేగంపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, ఎంపీ కేశినేని చిన్ని విజయదశమి నాటికి నూతన టెర్మినల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా "కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ" మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా విమానయాన రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గన్నవరం విమానాశ్రయం కీలక పాత్ర పోషించనున్నదని, దీనిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, గన్నవరం విమానాశ్రయం విస్తరణ విజయవాడతో పాటు మొత్తం మధ్య ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాల అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని అన్నారు. ప్రజలకు అత్యుత్తమ విమాన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడంలో తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

●ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రత్తిపాడు (చైతన్యరథం): మండలం, తిక్కిరెడ్డిపాలెం గ్రామం, శ్రీ కోదండ రామస్వామి కళ్యాణ మండపంలో "రెండేళ్ల నమ్మకం... అభివృద్ధి... సంక్షేమం" నియోజకవర్గ స్థాయి విజయోత్సవ సభలో రూ.27.74 లక్షల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 39 మందికి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు, ఆర్థికంగా వెనుకబడినవారు ఎదుర్కొనే తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు, అకస్మాత్తు ప్రమాదాలకు వంటి సందర్భాల్లో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసే ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గడిచిన 2 సంవత్సరాల కాలంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 1000 మంది లబ్ధిదారులకు 29 పర్యాయాలుగా 11.23 కోట్ల విలువ గల సీఎం సహాయనిది చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. నేడు రూ.27.74 లక్షల విలువ గల రియంబర్స్మెంట్ చెక్కులను 39 మందికి అందించడం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సహాయం వలన వారికి,వారి కుటుంబాలకు ఎంతో ఆనందాన్నీ మరియు చేయూతను అందిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, లబ్ధిదారులు, మండల మరియు గ్రామ పార్టీ అధ్యక్షులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ అమర్నాథ్‌పై రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర హోంమంత్రి అనితపై వైకాపా నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలకు చెందిన పలువురు మహిళా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ డా.రాయపాటి శైలజకు ఫిర్యాదు చేశారు. రాజకీయాల్లో విమర్శలు విధానాలు, నిర్ణయాలకే పరిమితం కావాలన్నారు. మహిళల వ్యక్తిత్వం, రూపురేఖలు, వ్యక్తిగత అంశాలను లక్ష్యంగా చేసుకుంటే సమాజానికి తప్పుడు సందేశం వెళు ుందన్నారు. అమర్నాథ్ వ్యాఖ్యల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పేలా చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్‌ను కోరారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

## విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): పట్టణంలోని చీఫ్ విప్‌వారి కార్యాలయంలో జూన్ నెల క్యాలెండర్ మీటింగ్ (విస్తృతస్థాయి సమావేశం)లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని రాబోయే నెల రోజుల కార్యాచరణ, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన విస్తృతంగా చర్చించారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, నిస్సంకర శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడలో రూ.22.50 కోట్లతో తాగునీటి సంరక్షణ : ఎమ్మెల్యే వెనిగండ్ల



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ వ్యాప్తంగా రూ. 22.50 కోట్లతో తాగునీటి వ్యవస్థల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే దిశగా ముందుకు సాగుతున్నామని ఆయన ఉద్ఘాటించారు. గుడివాడ పట్టణం 30వ వార్డు ధనియాల పేటలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. అమృత్ 2.0 నిధులు రూ. 2.38 కోట్లతో నిర్మించనున్న 1000 ఖూ ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం సాయంత్రం కూటమి నాయకులతో కలిసి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచినా రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిశీలించని పరిస్థితి ఉండేదని స్థానికులు గుర్తు చేశారు. తొలిసారిగా సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాము నివాసితులు ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ధనియాల పేట అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పష్టం చేశారు. కాలనీలో డ్రైనేజీల అభివృద్ధికి ఇప్పటికే 5 కోట్లతో ప్రపోజల్స్ ప్రభుత్వానికి పంపినట్లు స్థానికులకు తెలిపారు. ఆధునిక పద్ధతుల్లో తాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్తులో ఇబ్బంది లేకుండా అంతర్గత సందుల్లో సైతం ఇంటింటి సర్వీస్ కనెక్షన్లు అందిస్తామని చెప్పారు.

## గన్నవరంలో ఘనంగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సభ

**●అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది: వీరంకి గురుమూర్తి**



గన్నవరం (చైతన్యరథం): అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు సాగుతోందని గౌడ కార్పొరేషన్ చైర్మన్, కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, గన్నవరం నియోజకవర్గ పరిశీలకులు ఆకుల జయసత్య పేర్కొన్నారు. గన్నవరం రోటరీ క్లబ్‌లో బుధవారం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సందర్భంగా విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన కూటమి నాయకులు ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీరంకి గురుమూర్తి, ఆకుల జయసత్య హాజరుకాగా, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నాయకత్వంలో రెండేళ్లలో రూ. 1,308 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన నియోజకవర్గ ప్రజల బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, గత ప్రభుత్వ హయాంలో వెయ్యి కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు మాత్రమే నిర్మించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రెండేళ్లలోనే ఏడు వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు నిర్మించినట్లు వివరించారు. అలాగే 2014-19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో పది వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టినట్లు తెలిపారు. గతంలో చంద్రబాబునాయుడు 12 డీఎస్సీల ద్వారా 96 వేల మందికి ఉద్యోగాలు కల్పించారని, ప్రస్తుతం వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. అలాగే రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చి సుమారు 23 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలను దెబ్బతీసి అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు.

## వైసీపీ నుంచి ప్రజల్ని, రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత పసుపు సైన్యానిదే : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): పార్టీ తమకు ఏమిచ్చిందనే భావన వీడి.. తెలుగుదేశం సైనికులుగా తాము ప్రజలకోసం, రాష్ట్రం కోసం పనిచేస్తున్నామనే వాస్తవాన్ని శ్రేణులు గ్రహించాలని, భారత సైనికులు దేశ రక్షణ కోసం పనేస్తుంటే, విషనాగు వైసీపీ బారిన పడకుండా ప్రజల్ని, రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత పసుపు సైన్యంపైనే ఉందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. టీడీపీ శ్రేణులు సమర్థవంతమైన పనితీరు, నిస్వార్థ సేవా కార్యక్రమాలతో అధినాయకత్వం దృష్టిలో పడితే, పదవులు, గుర్తింపు వాటంతట అవే లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ విజయోత్సవ సభ, నియోజకవర్గస్థాయి టీడీపీ విస్తృత సమావేశంలో పాల్గొన్న ప్రత్తిపాటి, పార్టీ శ్రేణుల్ని ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబు, నియోజకవర్గాల్లో టీడీపీ నాయకత్వం బలంగా ఉంటేనే పార్టీ విజయం, శాశ్వత అధికారం సాధ్యమవుతుందని ప్రత్తిపాటి సూచించారు. పార్టీ గుట్టుమట్లు రట్టు చేయడం ఎవరికీ మంచిదికాదని, ముఖ్యంగా కొందరు నాయకులు చేసే బహిరంగ వ్యాఖ్యలతో పార్టీకి నష్టం జరుగుతోందని స్పష్టం చేశారు. బడ్డీకొట్లు, టీ కొట్ల వద్ద చేసే అసందర్భ, అనాలోచిత వ్యాఖ్యలు, పోసుకోలు కబుర్లతో అందరూ నష్టపోవాల్సి వస్తుందన్నారు. 175 నియోజకవర్గాల్లో చిలకలూరిపేట ఉత్తమ పనితీరుతో రాష్ట్రంలోనే 2వ స్థానంలో నిలిచిందని, ముఖ్యమంత్రి అందించిన సీల్డ్ కవర్ నివేదికే అందుకు రుజువని, పార్టీ శ్రేణులు పట్టుదలతో కనబరిచిన పనితీరుతోనే ఈ ఘనత సాధించినట్టు ఎమ్మెల్యే చెప్పారు.

## కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్న గొడ్డలి పార్టీ

**● మైలవరంలో ఎన్డీఏ ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ... ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సత్యకుమార్**



మైలవరం (చైతన్యరథం) : కులాలు, మతాల మధ్య గొడ్డలి పార్టీ అధ్యక్షుడు లెవెన్ రెడ్డి చిచ్చు పెడుతున్నాడని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయోత్సవ సభ బుధవారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని సీఏ కన్వెన్షన్ హాల్లో ఘనంగా ప్రారంభమైంది. మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆతిథ్యంలో నిర్వహించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూటమి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... రెండేళ్ల క్రితం రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనకు ముగింపు పలికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సమాజంలో కులాలు, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. 2019లో ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని చూసి ఓర్చుకోలేక జగన్మోహన్ రెడ్డి పిల్లి శాపాలు పెడుతున్నాడన్నారు. అతని శాపాలకు ఇక్కడ భయపడేవాడు ఎవరూ లేరన్నారు.

## మంత్రి అనితకు అమర్నాథ్ క్షమాపణ చెప్పాలి



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి వైసీపీ నాయకుడు, మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను వినుకొండ తెలుగు మహిళ నాయకులు బుధవారం తీవ్రంగా ఖండించారు. మహిళల పట్ల గౌరవం లేకుండా విమర్శించడం సరికాదన్నారు. మహిళలపై వ్యక్తిగత విమర్శలకు దిగటం వైసీపీ నాయకుల సంస్కృతికి నిదర్శనం అన్నారు. మహిళలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తుంటే వైసీపీ మాజీ మంత్రి అమర్నాథ్ మహిళలను కించపరిచే ఇలాంటి వ్యాఖ్యలు చేయటం దారుణమన్నారు. హోం మంత్రి అనితపై అనిచిత వ్యాఖ్యలు చేసిన అమర్నాథ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షకీలా, ఆదిలక్ష్మి, షబీనా, తుమ్మ వెంకట కోటమ్మ పాల్గొన్నారు.

## అమర్నాథ్ తక్షణమే క్షమాపణ చెప్పాలి : పరుచూరి రమ్య

తెనాలి (చైతన్యరథం): గుడివాడ అమర్నాథ్ తక్షణమే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని తెనాలి తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నేత అమర్నాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మహిళా నేతలు విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి పరుచూరి రమ్య మాట్లాడుతూ అస్సలు వైసీపీలో మహిళలకు ఏ మాత్రం విలువ ఇవ్వరు అనేది గుడివాడ అమర్నాథ్ విషయంలో తెలిసిపోయింది అని తక్షణమే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో రాష్ట్ర మహిళలు అమర్నాద్‌ను బయట తిరగనివ్వరని హెచ్చరించారు. జగన్ అండ చూసుకునే వైసీపీ నాయకులు రెచ్చిపోతున్నారని వారిపై త్వరలోనే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. త

## మహిళా లోకానికి గుడివాడ అమర్నాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి



మైలవరం (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండల కేంద్రంలో హోంమంత్రి వంగలపూడి అనిత పట్ల మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ తెలుగు మహిళలు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పిలుపుమేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకెం ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలతో కలిసి గుడివాడ అమర్నాథ్ చిత్రపటంపై కోడిగుడ్లు విసిరి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంకెం ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ, హోంమంత్రి అనిత పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన గుడివాడ అమర్నాథ్ వెంటనే ఆమెకు, అలాగే రాష్ట్ర మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


# ఘనంగా కూటమి విజయోత్సవ సభ




గూడూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా "2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" పేరిట రాష్ట్రవ్యాప్తంగా ప్రగతి నివేదన సదస్సులు విజయోత్సవాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయి. అందులో భాగంగా బుధవారం గూడూరు నియోజకవర్గంలో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు డా. పనబాక లక్ష్మి గారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలను వివరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ యశ్వంత్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు సెక్రెటరీ ముని రామయ్య , రేవతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# విజయవంతంగా నారాయణ మెగా వైద్య శిబిరం



నెల్లూరు (చైతన్యరథం): ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నెల్లూరు 47వ డివిజన్ గుప్తా పార్క్ సెంటర్‌లో నారాయణ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నారాయణ నేత్రజ్యోతి, నారాయణ దంత సురక్ష' ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గతంలో మహాలక్ష్మి గుడి సెంటర్‌లో విజయవంతంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని ప్రజల విజ్ఞప్తి మేరకు రెండోసారి ఏర్పాటు చేశారు. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, 47 ఌ 48 డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి ధర్మవరపు సుబ్బారావు, గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కంటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుధా ఆధ్వర్యంలో అత్యాధునిక పరికరాలతో కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఇప్పటివరకు 8,700 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, 5,600 మందికి పైగా ఉచితంగా అద్దాలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవసరమైన వారికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు నారాయణ హాస్పిటల్‌లో సరికొత్త ఆపరేటింగ్ మైక్రోస్కోప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. నెల్లూరు ప్రజల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, మరోవైపు అమరావతి రాజధాని అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పొంగూరు నారాయణ సేవలను స్థానిక నాయకులు, ప్రజలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో చెంగయ్య ఆచారి, ముని శేఖర్, ఫిరోజ్ అహ్మద్, విరమల్లు చంద్ర , కంచి కృష్ణ , మునిక్రిష్ణ, అద్దంకి చంద్రశేఖర్, అలేఖ్య, బెల్లంకొండ తులసి, పద్మాబాయి, మౌనిక, సుహాసిని అబ్దుల్ రెహ్మాన్ ఖాన్, కోటపాటి రాజా, నాగార్జున, మహబూబ్ బాషా, భవాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం.. అభివృద్ధి లక్ష్యం

## చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య

చీరాల (చైతన్యరథం): కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణమండపంలో చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రెండెళ్ళ పాలన పూర్తిచేసుకున్న శుభ సందర్భంగా 2 ఏళ్ళ నమ్మకం, అభివృద్ధి సంక్షేమం విజయోత్సవ సభ నిర్వహించారు. ఇప్పటివరకు చీరాల నియోజకవర్గంలో సంక్షేమం కింద 750 కోట్లు ఖర్చు చేశామని చీరాల నియోజకవర్గ నందు అభివృద్ధి పనుల నిమిత్తం 450 కోట్లు మంజూరు చేపించామని ఎమ్మెల్యే తెలిపారు. చీరాల వేటపాలెం మండలాల 135 స్వయం సహాయక సంఘాల కు బ్యాంకు నుండి 20 కోట్ల రుణాలు చెక్కును అందజేశారు. రెండు ట్రాక్టర్లు ఒక ఆటో ఒక కారు సబ్సిడీ కింద లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ అబ్జర్వర్ చిలకలూరిపేట ఏఎంసీ చైర్మన్ షేక్ కరీముల్లా, చీరాల ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, ఆర్డీవో, చీరాల నియోజకవర్గ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.




# చారిత్రక చంద్రగిరి కోటలో ఘనంగా యోగాంధ్ర

## పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు తదితరులు



చంద్రగిరి (చైతన్యరథం): ఆరోగ్యవంతమైన జీవితానికి యోగ ఉత్తమ మార్గమని ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో యోగా ను భాగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు తెలిపారు.

బుధవారం తిరుపతి జిల్లా పరిధి లోని చంద్రగిరి కోటలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర -2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటకశాఖ ఆధర్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 వ తేదీన జరుగుతుందని అందులో భాగంగా జూన్ 7 వ తేదీ నుంచి జూన్ 21 వ తేదీ వరకు గ్రామ, సచివాలయ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో వివిధ రకాల పోటీలనునిర్వహిస్తున్నామని తెలిపారు. జూన్ 7వ తేదీన జూ పార్కులో పెద్ద ఎత్తున యోగాంధ్రధ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. బుధవారం చారిత్రాత్మక చంద్రగిరి కోటలో యోగాంధ్ర కార్యక్రమాన్ని జరుపుకోవడం విశేషమన్నారు. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం యోగా ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి యోగా కార్యక్రమం పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. జూన్ 21వ తేదీన జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్, ఎస్పీ ,ప్రజా ప్రతినిధులతో కలిసి పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 21న యోగా దినోత్సవం జిల్లాలో భారీ స్థాయిలో యోగా డే కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో నిర్వహిస్తుందని అన్నారు. గత సంవత్సరం విశాఖపట్నంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యోగా డే నిర్వహించి దేశానికి ఆంధ్రప్రదేశ్ ఒక దిక్సూచి అయిందన్నారు.

అదేవిధంగా ఈసారి రాష్ట్రంలో ఎక్కడికక్కడ యోగా డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై యోగాసనాలు నిర్వహించారు.

# ఫలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత కృషి

## నసనకోట ఎంజేపీ బాలికల పాఠశాలలో ఇక నుంచి ఇంటర్మీడియేట్, జీవో విడుదల, అడ్మిషన్లు ప్రారంభం




రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కృషి ఫలించింది. వెనుకబడిన ప్రాంతమైన రామగిరి మండలంలో విద్యార్థినులకు ఇక నుంచి ఇంటర్మీడియట్ స్థానికంగానే చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. నసనకోట ఎంజేపీ బాలికల పాఠశాలను ఇంటర్మీడియట్‌కు అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. రామగిరి ప్రాంతంలో చాలా ఏళ్లుగా పదవ తరగతి వరకు మాత్రమే విద్యార్థినులు చదువుకునే అవకాశం ఉండేది. రెసిడెన్షియల్ విద్య లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థినులు పదవ తరగతి తర్వాత చదువు మానించే పరిస్థితి కనిపించేది. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే పరిటాల సునీత పరిటాల రవీంద్ర ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు అవకాశం కల్పించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు పదేపదే విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం జీఓ నెం.6ను విడుదల చేసింది. జీ.ఓ ప్రకారం ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. ఎంపీసీ 40, బైపిసి 40 సీట్లతో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచే ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరణ మొదలైంది. 10వ తరగతిలో 5వందలు ఆపై మార్కులు వచ్చిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నసనకోట ఎంజేపీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ అన్నది ఈ ప్రాంత ప్రజల కల అని అన్నారు. ఇందుకోసం తాము చేసిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. గతంలో విద్యార్థినులు 10వ తరగతి తర్వాత చదువు మానేసే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు స్థానికంగానే ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం వచ్చిందన్నారు. ఇప్పటికే ఇక్కడ చదువుతున్న విద్యార్థినులు చదువుల్లో రాణిస్తున్నారని.. పదవ తరగతిలో కూడ మంత్రి మార్కులు సాధించారన్నారు. ఇంటర్మీడియట్ లో కూడా ఈ పాఠశాల రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండేలా చూడాలని అధ్యాపకులకు ఎమ్మెల్యే సునీత సూచించారు.



# 20న సీఎం చంద్రబాబు మదనపల్లె పర్యటన

## ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే బాషా, టీడీపీ అధ్యక్షుడు సుగవాసి

రాజంపేట (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మదనపల్లి పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే షాజహాన్ బాషా, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు పరిశీలించారు. శనివారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మదనపల్లి నియోజకవర్గ పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను మదనపల్లి ఎమ్మెల్యే, ఎం. షాజహాన్ బాషా, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ సీఎం కార్యాలయ అధికారులతో కలిసి పరిశీలించారు. చీకలబైలు చెరువు జలధార పథకం కింద చేపట్టనున్న చెరువుల సుందరీకరణ పనులకు భూమిపూజ జరిగే ప్రాంతం, మదనపల్లి పట్టణంలోని గాంధీపురం అంగన్వాడి కేంద్రం, నక్కలదిన్నెలో సోలార్ విద్యుత్తుతో ఏసీని నడుపుతున్న ఆదర్శ గృహంహెలిపాడ్ ప్రదేశం సభా వేదిక, భోజన వసతి, పార్కింగ్ ప్రజలకు కల్పించనున్న సౌకర్యాలుఅన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా అధికారులతో సమన్వయం చేస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించారు .అభివృద్ధి, సంక్షేమం, సాంకేతికత సమన్వయంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అందరూ సహకరించాలని కోరారు.

# గాయపడిన కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల "నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం" పాలనపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి పుట్టపర్తి కి బయలుదేరి వెళుతున్న తనకల్లు మండలం చీకటిమాని పల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ప్రయాణిస్తున్న ఇన్నోవా వాహనం అదుపుతప్పి కదిరి న్యూ బైపాస్ రోడ్డులో ప్రమాదానికి గురయ్యింది. గాయపడిన పూజారి కిష్టప్పను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న చికిత్స పొందుతున్న పూజారి కిష్టప్పను కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ పరామర్శించారు.



# కూటమి చేసిన మంచిని వివరిద్దాం

## ధర్మవరం తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్

ధర్మవరం (చైతన్యరథం): రాష్ట్రంలో రెండేళ్ల ఎన్డీఏ పాలనలో పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి-సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో గల ప్రతి గడప వద్దకు వెళ్లి వివరించాలని ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ధర్మవరం పట్టణం ఎర్రగుంట సర్కిల్లోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని పరిటాల శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విధ్వంసకరమైన పరిపాలన కొనసాగిందని అభివృద్ధి సంక్షేమం పూర్తిస్థాయిలో వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని, పరిటాల శ్రీరామ్ అన్నారు. నారా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని ఆయన అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం పై విశ్వాసంతో రాష్ట్రానికి పెట్టుబడుల వరద కొనసాగుతోందని గడిచిన రెండేళ్లలో రాష్ట్రానికి 23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని,నారా లోకేష్ లక్ష్య సాధనమే యువతకు దాదాపు 20 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని పరిటాల శ్రీరామ్ అన్నారు.జూన్ 25 నుండి ఆగస్టు 10 వరకు దాదాపు 45 రోజులు పాటు గత రెండేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ- అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడప వద్దకు వెళ్లి వివరిద్దామని పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సర్ పై ఏమరపాటు వద్దని నియోజకవర్గంలో గల ప్రతి ఒక్క కార్యకర్త సర్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ బూత్ లెవెల్ అధికారితో సమన్వయం చేసుకొని అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా చూడాలని పరిటాల శ్రీరామ్ బూత్ లెవెల్ ఏజెంట్లకు సూచించారు. అనంతరం ఇటీవల మరణించిన తెలుగుదేశంపార్టీ నాయకుడు గుద్దిటి అనిల్ చిత్రపటానికి పరిటాల శ్రీరామ్ పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు.




# ఆశలు గల్లంతై అయోమయంలో వైసీపీ మూకలు : ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

కందుకూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా... కందుకూరులోని ఎస్వీఎస్ కళ్యాణమండపంలో, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నేతృత్వంలో విజయోత్సవ సభ బుధవారం జరిగింది. నియోజకవర్గ నలుమూలల నుంచి వేల సంఖ్యలో మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు.



పామూరు రోడ్డు జంక్షన్ నుంచి కళ్యాణ మండపం వరకు జనం కిక్కిరిశారు. కళ్యాణ మండపంలో రెండు హోళ్లు నిండిపోగా, మండపం బయట ఎండ వేడిమిని తట్టుకుని ప్రభుత్వ విజయోత్సవ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి, ఈసారైనా గెలుస్తామన్న నమ్మకాన్ని వైసిపి నేతలు కోల్పోయారని అన్నారు.

# ఘనంగా టీడీపీ విజయోత్సవం

కోవూరు (చైతన్యరథం): గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, ఒక్క పని కూడా చేయని పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెట్టిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసి చూపించారని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీలోపు ఇంటి వద్దకే వెళ్లి వృద్ధులకు రూ.4,000 పెన్షన్, దివ్యాంగులకు రూ.6,000, వీల్‌చైర్ లేదా మంచానికే పరిమితమైన వారికి రూ.15,000 పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు.'తల్లికి వందనం' పథకం కింద కుటుంబంలోని పిల్లలందరికీ ప్రయోజనం కల్పిస్తున్నామని, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, నాణ్యమైన బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల జారీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం ద్వారా రీ-సర్వేలు, 22-ఏ భూముల



సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. దీపం-2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు, మత్స్యకారులు, ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులకు వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వం మూసివేసిన అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా 268 క్యాంటీన్లలో రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లలో డీఎస్సీ నిర్వహించకపోగా, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు, 6 వేల పోలీసు కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసిందన్నారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకువచ్చి, ఇప్పటికే 6 లక్షల ఉద్యోగాలు కల్పించామని, చెప్పారు.

# చికాగోలో 'నాట్స్' సేవా స్ఫూర్తి

## 'అడాప్ట్-ఎ-హైవే' కార్యక్రమం విజయవంతం

## పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించిన చికాగో చాప్టర్ సభ్యులు

## సామాజిక బాధ్యత చాటిన తెలుగు విద్యార్థులు




**చికాగో:** భాషే రమ్యం.. సేవే గమ్యం అనే నినాదానికి తగ్గట్టుగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) మరోసారి తమ సేవా నిరతిని చాటుకుంది. చికాగో చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన "అడాప్ట్-ఎ-హైవే" స్వచ్ఛంద సేవా కార్యక్రమం సమాజంలో ఒక సరికొత్త సేవా స్ఫూర్తిని రగిలించింది. స్థానిక తెలుగు ప్రజానీకం ఉత్సాహంగా ముందుకొచ్చిన చేసిన ఈ సేవా కార్యక్రమం చికాగోలో తెలుగువారికి సామాజిక బాధ్యత ఎంత ఉందనేది నిరూపించింది. హైవేలో కొంత భాగాన్ని దత్తత తీసుకుని దాని పరిశుభ్రత, పచ్చదనం కాపాడే బాధ్యతను 'నాట్స్' దిగ్విజయంగా నిర్వహించింది.

దాదాపు ఇరవై మందికి పైగా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ఈ సేవా పథంలో అడుగులు వేయడం విశేషం. రేపటి పౌరులైన యువ వాలంటీర్లలో పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత పట్ల ఒక దృఢమైన బాధ్యతాభావాన్ని ఈ కార్యక్రమం పెంపొందించింది. సమాజాన్ని పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో నాట్స్ (North America Telugu Society- NATS) ద్వారా విద్యార్థులు చేస్తున్న ఈ సేవలు వారి భవిష్యత్ విద్యా, వృత్తిపరమైన ప్రయాణాలకు ఎంతగానో దోహదపడే విలువైన వాలంటీర్ సేవా గంటలుగా అధికారికంగా గుర్తించబడతాయి.

తెలుగు విద్యార్థులు హైవే దత్తత (Adopt-A-Highway) కార్యక్రమంలో చూపిన అంకితభావాన్ని, నిబద్ధతను 'నాట్స్' అధ్యక్షుడు రాజ్ అల్లాడ హృదయపూర్వకంగా అభినందించారు. సామాజిక బాధ్యతను రేపటి తరంలో పెంపొందించడానికి వారికి సేవా భావాన్ని పెంచడానికి 'నాట్స్' చికాగో బృందం చేసిన కృషిని 'నాట్స్' చైర్మన్ కిషోర్ కంచర్ల కొనియాడారు. ఈ సేవా కార్యక్రమం ఇంతటి ఘన విజయం సాధించడం వెనుక చికాగో చాప్టర్ సమన్వయకర్తలు నరేంద్ర కడియాల, అంజయ్య వేలూరు, చెన్నయ్య కంబాల కీలక పాత్ర పోషించారు. చికాగో చాప్టర్ సభ్యులు పండు చెంగళశెట్టి, మనోహర్ పాములపాటి, గోపీ, వరుణ్ గడ్డం, నాగరాజ్ మేడా, నామదేవ్ గాంధీ, చైతన్య, గణేష్ మాగుంటలకు 'నాట్స్' జాతీయ నాయకత్వం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. వీరితో పాటు నెక్స్ట్ జెన్ కార్యక్రమాలను ముమ్మరం చేసేందుకే తోడ్పాటు అందిస్తున్న 'నాట్స్' మాజీ అధ్యక్షుడు మదన్ పాములపాటి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యులు శేషు మారంరెడ్డి, శ్రీనివాస్ బొప్పన, మూర్తి కొప్పాక, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు వీర తక్కెళ్లపాటి, బోర్డ్ మాజీ సభ్యుడు శ్రీనివాస్ పిడికిటి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మాజీ సభ్యులు ఆర్కే బాలినేని, హరీష్ జమ్ముల



తదితరులకు 'నాట్స్' జాతీయ నాయకత్వం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

సామాజిక బాధ్యతని గుర్తుచేస్తూ నాట్స్ చికాగో చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అడాప్ట్-ఎ-హైవే కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లందరికీ మధ్యాహ్న భోజనాన్ని స్పాన్సర్ చేసి మైగో కన్సల్టింగ్ సంస్థ కూడా తన సామాజిక బాధ్యతను చాటుకుంది.








# 'మాటా' మహాసభల వేదికపై 20న కవి సమ్మేళనం

**ఫిలడెల్ఫియా:** మన అమెరికా తెలుగు సంఘం (MATA) నిర్వహిస్తున్న రెండో మహాసభల (MATA 2nd Convention 2026) వేదికపై తెలుగు జానపద సాహిత్యం, సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేకంగా 'కవి సమ్మేళనం' ఏర్పాటు చేశారు. దీనిని ఈ నెల 20వ తేదీ సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ఫిలడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్లోని 'మీటింగ్ రూమ్ 5'లో నిర్వహించనున్నారు. ప్రముఖ జానపద పరిశోధకుడు, ఆల్ ఇండియా రేడియో గాయకుడు డాక్టర్ లింగా శ్రీనివాస్ ఉపన్యాసకులుగా వ్యవహరించనున్నారు, ప్రఖ్యాత జానపద సాహిత్య పరిశోధకుడు శేషగిరిరావు కంభంమెట్టు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలుగు భాషాభిమానులు, సాహితీ ప్రియులు ఈ కార్యక్రమానికి హాజరై తెలుగు జానపద వైభవాన్ని ఆస్వాదించాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలతో పాటు రిజిస్ట్రేషన్ కోసం convention.mata-us.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.





# షాంఘై మహా నగరంలో 10వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు

## వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, షాంఘై తెలుగు సంఘం సంయుక్తంగా అక్టోబరు 24, 25 తేదీల్లో నిర్వహణకు నిర్ణయం

### ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తనికెళ్ల భరణి

**టెక్సస్ (అమెరికా):** వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, షాంఘై తెలుగు సంఘం సంయుక్త నిర్వహణలో అక్టోబరు 24, 25 (శుక్రవారం, శనివారం) తేదీల్లో 10వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు షాంఘై మహా నగరంలో జరగనుంది. భారత పూర్వ ఉప రాష్ట్రపతి, 'పద్మవిభూషణ్' ముప్పవరపు వెంకయ్యనాయుడు, ప్రముఖ సినీ నటుడు, కవి తనికెళ్ళ భరణి తదితరులు ఆహ్వానిత అతిథులుగా విచ్చేయనున్నారు. చైనాలోని పలు నగరాల్లో నివసిస్తున్న తెలుగు సాహితీవేత్తలు, భాషాభిమానులు ప్రత్యక్షంగా కలుసుకునే చారిత్రక ప్రాధాన్యత కలిగిన సదస్సులో పాల్గొనడానికి ప్రాథమిక ఆసక్తి ఉన్నవారు కింది Google Form లో పేరు నమోదు చేసుకుని వివరాలు అందించాలని నిర్వాహకులు కోరారు. https://forms.gle/v6K3RpT3wei8KVyU8




భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఏ దేశం నుంచి అయినా తమ సొంత ఖర్చులతో షాంఘై నగరానికి విచ్చేసి ఈ 10వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో ప్రత్యక్షంగా పాల్గొనదల్చుకున్న ప్రతినిధులకు, వక్తలకు మూడు రోజులు ఉచితంగా స్థానిక వసతి, ఆత్మీయ ఆతిథ్యం కల్పిస్తారు. ఏ దేశం వారైనా చైనాకి వీసా, విమాన ప్రయాణ ఏర్పాట్లను వారే ఏర్పాటు చేసుకోవాలి. సదస్సు కార్యనిర్వాహకవర్గం ఎటువంటి బాధ్యత స్వీకరించదు.

10వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు కార్యనిర్వాహక వర్గం
వంగూరి చిట్టెన్ రాజు (వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్, టెక్సస్, అమెరికా)
కోలన్ మాధవరెడ్డి (షాంఘై తెలుగు సంఘం, షాంఘై, చైనా)
శాయి రాచకొండ (హ్యూస్టన్, టెక్సస్, అమెరికా),
రాధిక మంగిపూడి (ముంబై)
నాగ మల్లికార్జునరావు తోట (షాంఘై)
భవాని వాసిరెడ్డి (షాంఘై)
జయ పీసపాటి (హాంగ్‌కాంగ్)
రత్నకుమార్ కవుటూరు (సింగపూర్)

# ఆగస్టు 7, 8 తేదీల్లో హ్యూస్టన్‌లో టీసీఏ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

**హ్యూస్టన్:** హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి (TCA) తన 50 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానాన్ని పురస్కరించుకుని గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. వారసత్వం, సంస్కృతి, కమ్యూనిటీ స్ఫూర్తితో కూడిన ఈ చారిత్రాత్మక వేడుకలు ఆగస్టు 7, 8 తేదీల్లో హ్యూస్టన్, టెక్సాస్‌లో జరగనున్నాయి. ఇందులో భాగంగా అద్భుతమైన ప్రదర్శనలు, స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేలాది మంది తెలుగు కుటుంబాలు ఈ కార్యక్రమంలో పాల్గొని చరిత్రలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. వేడుకలకు సంబంధించిన మరిన్ని వివరాలతో పాటు రిజిస్ట్రేషన్ కోసం అధికారిక వెబ్‌సైట్ www.tca50.org లేదా www.houstontca.orgను సందర్శించవచ్చు. coreteam@tca50.org ద్వారా నిర్వాహకులను సంప్రదించవచ్చు.



# భాజపాలోకి సమాజ్‌వాదీ పార్టీ!

## బాంబు పేల్చిన భారతీయ సమాజ్ పార్టీ చీఫ్ ఓం ప్రకాష్ రాజ్‌భర్





పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలో రాజకీయ పునరేకీకరణలు, ఫిరాయింపుల పర్యంపై చర్చ జరుగుతున్న తరుణంలో ఉత్తరప్రదేశ్ మంత్రి, సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ చీఫ్ ఓం ప్రకాష్ రాజ్‌భర్ బాంబు పేల్చారు. యూపీలోని సమాజ్‌వాదీ పార్టీ త్వరలో చీలిపోనుందని చెప్పారు. 'మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌ను మరిచిపోండి. సమాజ్‌వాదీ పార్టీ మొత్తం బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉంది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన తెలిపారు.'సమాజ్‌వాదీ పార్టీ చీలిపోనుంది. రామ్ గోపాల్ యాదవ్ ఒక లేఖను కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు అందజేశారు. గనుల కుంభకోణం, గోమతి రివర్ ఫ్రంట్ కుంభకోణం వెనుకనున్న సూత్రధారులు ఎవరో యూపీలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. ఉచ్చు బిగుస్తున్న కొద్దీ సమాజ్‌వాదీ పార్టీ ఆందోళనకు గురవుతోంది' అని రాజ్‌భర్ తెలిపారు. ఇక మహారాష్ట్ర, బెంగాల్‌ను మరిచిపోవచ్చని, సమాజ్‌వాదీ పార్టీ మొత్తం బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. 2027లో జరుగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం అధికార కూటమి, విపక్ష కూటమి తమ వ్యూహాలకు పదునుపెడుతున్న తరుణంలో రాజ్‌భర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### సమాజ్‌వాదీ పార్టీ స్పందన

కాగా, తమ పార్టీ త్వరలో చీలిపోనుందంటూ రాజ్‌భర్ చేసిన వ్యాఖ్యలపై సమాజ్‌వాదీ పార్టీ మండిపడింది. తమ పార్టీని చూసి బీజేపీ, భాగస్వామ్య పార్టీలు బెంబేలెత్తుతున్నాయని, రాజకీయ ఉనికి కాపాడుకునేందుకు రాజ్‌భర్ ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని పేర్కొంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బలాన్ని సమాజ్‌వాద్ పార్టీ సగానికి సగం తగ్గించేసిందని, 2027 అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ తుడిచిపెట్టుకుపోతుందని ఆ పార్టీ ప్రతినిధి సునీల్ సాజన్ అన్నారు. ఎస్‌బీసీపీ నుంచి ఈసారి ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవరని అన్నారు. కేవలం ప్రచారం కోసమే రాజ్‌భర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌ను లక్ష్యంగా చేసుకుని గతంలోనూ రాజ్‌భర్ విమర్శలు చేశారు. అఖిలేష్ యాదవ్ విదేశీ పర్యటనలపై సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాజ్‌భర్ ఇటీవల విమర్శలు చేశారు. లండన్, పారిస్ పర్యటనలకు బదులు కాశీ, అయోధ్య, మధుర, నైమిశారణ్యం, వింధ్యావాసిని ఆలయం వంటి ప్రదేశాల్లో ఆయన పర్యటించి ఉంటే ఉత్తరప్రదేశ్ పర్యాటకానికి, స్థానిక వ్యాపారులు, దుకాణాలు, రవాణారంగంతో ముడిపడిన ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు.



# సైబర్ నేరగాళ్ళు పరాన్న జీవులు

## అణచివేతకు మరింత కఠిన చర్యలు అవసరమన్న సుప్రీంకోర్టు

సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, సదరు పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# సైబర్ నేరగాళ్లకు ఓ కంపెనీ, ఉద్యోగి బలి!



ఓ వాట్సాప్ సందేశాన్ని నమ్మిన సంస్థ ఉద్యోగి చేసిన పొరపాటు ఆ కంపెనీకి రూ.10.4 కోట్లకుపైగా నష్టాన్ని మిగిల్చింది. ఐనాక్స్ గ్రూప్‌నకు చెందిన ఓ ఉన్నతాధికారి పేరుతో గుర్తుతెలియని వ్యక్తి పంపిన సందేశాల ఆధారంగా కంపెనీ ఖాతా నుంచి మొత్తం 63 విడతల్లో భారీ మొత్తాన్ని బదిలీ చేయడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో నలుగురు కేటుగాళ్లను అరెస్ట్ చేశారు పోలీసులు. ముంబైకి చెందిన ఐనాక్స్ గ్రూప్స్ అకౌంట్స్ విభాగంలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న గిరీశ్ అమీన్‌కు జూన్ 3న ఓ గుర్తుతెలియని నంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తాను ఐనాక్స్ గ్రూప్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) సిద్ధార్థ్ జైన్‌నని పరిచయం చేసుకున్నాడు. ఆ నంబర్‌ను తన పర్సనల్ నంబర్‌గా సేవ్ చేసుకోమని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దన్నాడు. వాట్సాప్ డీపీలోనూ సిద్ధార్థ్ జైన్ ఫొటో ఉండటంతో అమీన్‌కూ ఎలాంటి అనుమానం రాలేదు. ఆ తర్వాత తానో ఎమర్జెన్సీ మీటింగ్‌లో ఉన్నానని చెబుతూ.. వివరాలేమీ అడక్కుండా కొన్ని బ్యాంక్ అకౌంట్స్ నంబర్స్ పంపించి కంపెనీ ఖాతా నుంచి నగదు పంపమని ఆదేశించాడు.తొలుత రూ.46.5 లక్షల బదిలీతో ప్రారంభమైన ఈ వ్యవహారం జూన్ 3 నుంచి 15 వరకు కొనసాగింది. ఇలా మొత్తం 63 ట్రాన్సాక్షన్స్ ద్వారా మొత్తం రూ.10,40,71,924 నగదు పలు ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ తర్వాత సదరు చెల్లింపులకు సంబంధించిన ఇన్‌వాయిస్‌లు కావాలని అధికారికంగా సిద్ధార్థ్ జైన్‌ను సంప్రదించాడు అమీన్. తానెలాంటి ఆదేశాలివ్వలేదని సిద్ధార్థ్ చెప్పడంతో అసలు విషయం బయటపడింది. దీంతో అమీన్ పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తు చేపట్టిన ముంబై పోలీసులు.. ఢిల్లీలోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ జసోలా బ్రాంచ్ నుంచి కీలక సమాచారం అందుకున్నారు. అనుమానాస్పదంగా రూ.8 లక్షలు నగదు విత్‌డ్రా చేసుకునేందుకు వచ్చిన వికాస్, వంశ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ఇరువురి బ్యాంకు అకౌంట్లను మోసపూరిత లావాదేవీలు జరిపేందుకు కమీషన్ కోసం ఇచ్చినట్లు విచారణలో తేలింది. దీంతో ఫయ్యాజ్ ఆలమ్, అమిత్ అనే మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు పోలీసులు. అయితే.. ఈ మోసం వెనుకున్న అసలు సూత్రధారులు ఎవరనేది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ చేపట్టినట్టు అధికారులు వెల్లడించారు.

# కిసాన్ యోజన నిధుల విడుదలకు ముహూర్తం ఖరారు




రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం ద్వారా నిధులు అందిస్తుంది. 23వ పీఎం కిసాన్ యోజన నిధుల విడుదలకు కేంద్రం ముహూర్తం ఖరారు చేసింది. జూన్ 20వ తేదీన రైతుల ఖాతాల్లో ఈ నగదు జమ కానుంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దాంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. ప్రతి ఏటా మూడు దఫాలుగా ఈ నిధులను కేంద్రం విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా ఏడాదికి మొత్తం రూ. 6 వేలు రైతుల ఖాతాలో నగదు జమ అవుతాయి. అవి మూడు దఫాలుగా.. నాలుగు నెలలకు ఒకసారి రూ. 2 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో ఈ నగదు కేంద్రం వేస్తోంది. 2019లో పీఎం కిసాన్ పథకాన్ని కేంద్రం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చి 13వ తేదీన 22వ విడత నగదును అసోంలోని గౌహతి వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేసిన విషయం విదితమే.



# ఉగ్రముఠా గుట్టురట్టు

## ఛేదించిన ఢిల్లీ పోలీసులు, ఏడుగురు అంతర్జాతీయ తీవ్రవాదుల అరెస్టు

పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ మద్దతుతో భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్జాతీయ ఉగ్రముఠాను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేయగా. వారిలో ఆరుగురు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. గాజియాబాద్‌లో అరెస్టైన ఆరుగురిలో నలుగురు గతంలో పుల్వామా ప్రాంతాన్ని సందర్శించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు పంపినట్లు అనుమానిస్తున్నారు. పుల్వామా తరహాలో మరో పెద్ద దాడికి పాక్ ప్లాన్ చేస్తోందనే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ ముఠా ఢిల్లీ నుంచి జమ్మూ వరకు గల ప్రముఖ రైల్వే స్టేషన్ల వద్ద సోలార్ సంబంధిత సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసి భారత సైనికుల కదలికలను గుర్తించేందుకు యత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే వీరు ఢిల్లీలోని కాంట్, హరియాణాలోని సోనిపట్ రైల్వే స్టేషన్ల వద్ద అలాంటి కెమెరాలను అమర్చినట్లు గుర్తించారు.

ఈ దర్యాప్తులో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. భారతీయ ఫోన్ నంబర్లకు వచ్చే ఓటీపీలను విదేశీయులకు పంపిస్తూ వాట్సాప్, సోషల్ మీడియా అకౌంట్లను నిర్వహించుకునేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. సిమ్ కార్డుల చోరీ, గతంలోనే యాక్టివేట్ చేసిన సిమ్‌లను కొనుగోలు చేయడం వంటివి వినియోగించినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలనూ తమ సొంత అకౌంట్ల ద్వారా కాకుండా జనసేవా కేంద్రాలు, స్థానిక దుకాణాల ద్వారా నగదు రూపంలో స్వీకరించి పోలీసుల కళ్లుగప్పేందుకు యత్నించినట్టు అధికారులు తేల్చారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపైనా విచారణ కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పుగా మారే ఇలాంటి నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# నావికుల భద్రత మన బాధ్యత

## జీ సదస్సు సాక్షిగా ముగ్గురు భారతీయుల మృతిని ప్రస్తావించిన ప్రధాని మోదీ



ఒమన్ తీరంలో భారతీయులు ఉన్న నౌకపై అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. అమెరికా దాడుల కారణంగా ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్ నీటిలో మునిగి చనిపోయారు.

ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ముగ్గురు భారతీయ నావికుల మృతి గురించి ప్రస్తావించారు. అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై జరిగిన క్షిపణి దాడులలో భారతీయులు ప్రాణాలు కోల్పోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలోనే ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పటంలో సాధించిన పురోగతిని మేము స్వాగతిస్తున్నాము. ఇరాన్, అమెరికా దేశాల మధ్య ఘర్షణ ఆ ప్రాంతంలోని మా మిత్రదేశాలలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించింది. ఒమన్ తీర ప్రాంతంలో నౌకపై జరిగిన దాడిలో పలువురు భారతీయ పౌరులు తమ ప్రాణాలను కోల్పోయారు. ప్రపంచ సముద్ర వాణిజ్యం ద్వారా దేశాలకు వారధులుగా నిలిచే నావికుల భద్రత మన బాధ్యత. సముద్ర మార్గాలు సురక్షితంగా ఉండేలా.. ఎలాంటి భయాందోళనలు లేకుండా నావికులు విధులు నిర్వహించుకునేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని అన్నారు.

**16 నెలల తర్వాత కలిసిన మోదీ, ట్రంప్**

ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ దాదాపు 16 నెలల తర్వాత జీ7 సదస్సులో ప్రత్యక్షంగా కలుసుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకుని, కొద్దిసేపు మాట్లాడుకున్నారు. సదస్సులో వీరిద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. బుధవారం ఈ ఇరువురు నేతలు సమావేశం కాబోతున్నారు. భారత్-అమెరికా సంబంధాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, భద్రతా అంశాలు, ప్రాంతీయ పరిణామాలపై ఇద్దరు నేతలు చర్చించబోతున్నట్టు తెలుస్తోంది.



# యూఎస్ ఎయిర్ బేస్‌లోనే కుప్పకూలిన యుద్ధవిమానం

అమెరికా సైన్యానికి చెందిన బీ-52 బాంబర్ ప్రమాదానికి గురైంది. కాలిఫోర్నియాలోని మిలటరీ ఎయిర్‌బేస్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో భోజన విరామం సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంపై ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్ ఓ ప్రకటన విడుదల చేసింది. 'రొటీన్ టెస్ట్ మిషన్‌లో భాగంగా బీ-52 బాంబర్ ఉదయం 11.20 గంటల సమయంలో గాల్లోకి లేచింది'.. 'గాల్లోకి లేచిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలింది. ప్రమాదం జరిగిన సమయంలో లోపల 8 మంది ఉన్నారు. వారందరూ ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. నాన్ కమర్షియల్ విజిటర్ పాస్‌లను తాత్కాలికంగా నిలిపి వేశాము' అని చెప్పుకొచ్చింది. ఇక, ఈ ప్రమాదంపై ఎయిర్ బేస్ అధికార ప్రతినిధిని మీడియా ప్రశ్నించగా.. ఆయన మరింత సమాచారం ఇవ్వడానికి తిరస్కరించారు.

**అత్యంత శక్తివంతమైన యుద్ధ విమానం..**

బీ-52 స్ట్రాటోఫోర్ట్రెస్ అమెరికా వైమానిక దళానికి చెందిన అత్యంత శక్తివంతమైన లాంగ్ రేంజ్, సబ్‌సోనిక్ యుద్ధ విమానం. బీ-52 యుద్ధ విమానాలను బోయింగ్ సంస్థ తయారుచేస్తోంది. 1950 నుంచి ఈ యుద్ధ విమానాలు అందుబాటులో ఉన్నాయి. ఇవి 70 వేల పౌండ్ల యుద్ధ సామాగ్రిని రవాణా చేయగలవు. అణు ఆయుధాలతో పాటు అత్యాధునిక క్షిపణులు, బాంబులను మోసుకెళ్లగలవు. బీ-52 బాంబర్లు దాదాపు 50,000 అడుగుల ఎత్తులో ప్రయాణించగలవు. శత్రుదేశాల రక్షణ వలయాలను ఛేదించి, సుదూర ప్రాంతాలపై దాడి చేయడం వీటి ప్రత్యేకత.

# అది అలా జరక్కూడని ఘటన!

## రష్యా యుద్ధ నౌక హెచ్చరిక కాల్పులపై బ్రిటన్ ప్రధాని స్పందన



ఇంగ్లిష్ ఛానెల్‌లో రష్యా యుద్ధ నౌక వ్యవహరించిన తీరుపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటన్ ప్రాదేశిక జలాల సమీపంలో బ్రిటన్ జెండా కలిగిన ఓ పౌర పడవను దారి మళ్లించేందుకు రష్యా యుద్ధ నౌక హెచ్చరిక కాల్పులు జరిపింది. ఈ చర్యను బ్రిటన్ ప్రధాని పూర్తిగా నిర్లక్ష్యపూరితమైనదని, ఆందోళనకరమైనదని అభివర్ణించారు. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. తమ యుద్ధనౌక అడ్మిరల్ గ్రిగోరోవిచ్‌కు బ్రిటిష్ పడవ చాలా దగ్గరగా వచ్చింది. పలుమార్లు రేడియో ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదు. దీంతో ముందుగా హెచ్చరిక సంకేతాలు ఇచ్చి, అనంతరం చిన్న ఆయుధాలతో హెచ్చరిక కాల్పులు జరిపారు. దీంతో యాచ్ తన దిశను మార్చుకుని దూరంగా వెళ్లింది. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటనను యాచ్‌లో ప్రయాణిస్తున్న బ్రిటిష్ దంపతులు ఖండించారు. తాము ఢీకొనేంత దగ్గరకు వెళ్లలేదన్నారు. యుద్ధనౌక హారన్ మోగించడంతో దిశ మార్చుకున్నామని, అయినప్పటికీ కాల్పులు జరిపారని తెలిపారు. జీ7 సదస్సు కోసం ఫ్రాన్స్‌లో ఉన్న బ్రిటన్ ప్రధాని ఈ ఘటనపై స్పందించారు. 'ఇది అసలు జరగకూడని ఘటన. యాచ్‌లో ఉన్న దంపతులు తీవ్ర

## ఇరాన్‌కు అమెరికా ఆర్థిక సాయంలో వాస్తవం లేదు: జేడీ వాన్స్

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్ పునర్నిర్మాణం కోసం అమెరికా 300 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేయబోతోందని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందించారు. ఇరాన్ పునర్నిర్మాణం కోసం అమెరికా 300 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేస్తోందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని తేల్చి చెప్పారు. ఆర్థికసాయానికి బదులుగా.. అమెరికా, ఇరాన్ డీల్ షరతులకు కట్టుబడి ఉండే దేశాలు ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టే విధంగా ప్లాన్ చేస్తున్నామన్నారు. ఆయన 'ది మెగిన్ కెల్లీ షో'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌కు ఆర్థికసాయంపై మెగిన్ కెల్లీ.. జేడీ వాన్స్‌ను ప్రశ్నించింది. ఆయన సమాధానం ఇస్తూ.. 'ఇరాన్‌కు సమీపంలో మనకున్న అత్యుత్తమ మిత్రదేశాలలో ఒకటైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గురించే మాట్లాడుకుందాం. ఆ దేశం ఇరాన్‌లో ఒక అణు విద్యుత్ ప్లాంట్‌లో పెట్టుబడి పెట్టాలని అనుకుంటోందని అనుకుందాం. అది సాధ్యం కావడానికి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఉన్న కొన్ని ఆంక్షలను మనం ఎత్తివేయాల్సి ఉంటుంది. అలా చేయకపోతే యూఏఈ.. ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టడం కష్టం' అని అన్నారు.

# ట్రంపే టార్గెట్‌గా వైట్‌హౌస్‌పై దాడికి కుట్ర



అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడి చేసేందుకు పన్నిన కుట్రను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) భగ్నం చేసింది. డొనాల్డ్ ట్రంప్ 80వ పుట్టిన రోజు సందర్భంగా వైట్‌హౌస్‌లో నిర్వహించిన యూఎఫ్‌సీ ఈవెంట్‌ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, స్నైపర్లతో దాడి చేయాలని కొందరు వ్యక్తులు పన్నిన కుట్రను అధికారులు ముందుగానే గుర్తించి అడ్డుకున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌బీఐ వెల్లడించింది. నిందితుల ఐదుగురిలో ఒకరైన 19 ఏళ్ల బ్రైసెన్ ప్రాఫర్ తల్లి ఇచ్చిన సమాచారంతోనే ఎఫ్‌బీఐ ఈ కుట్రను భగ్నం చేసింది. గూఢచర్యం, భారీగా ఆయుధాలు కొనుగోలు చేయడం, హిట్ అండ్ రన్ మిషన్ల గురించి కొందరితో అతడు మాట్లాడుతుండడాన్ని ఆమె గమనించి అనుమానించింది. వెంటనే ఆమె స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఎఫ్‌బీఐ అప్రమత్తమై నిందితులను అదుపులోకి తీసుకుంది. ఎఫ్‌బీఐ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. నిందితులు పేలుడు పదార్థాలు అమర్చిన డ్రోన్లతో వైట్‌హౌస్ సమీపంలోని భవనాలపై దాడి చేసి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలనుకున్నారు. అనంతరం బయటకు పరుగులు తీసే ప్రజలపై స్నైపర్లతో కాల్పులు జరపాలనుకున్నారు. కొందరు నిందితులు ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా ప్రణాళికలు రూపొందించినట్లు దర్యాప్తులో తేలింది. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ దీనిని ఒక పెద్ద ఉగ్రదాడి కుట్రగా అభివర్ణించారు (ఘోరమైన నేరపూరిత అవమానం). సరైన సమయంలో చర్యలు తీసుకోకపోయి ఉంటే భారీ ప్రాణనష్టం సంభవించేదని పేర్కొన్నారు. ఈ బృందంలోని వ్యక్తులకు ఒకరితో ఒకరికి సంబంధం లేదని ఎఫ్‌బీఐ అధికారులు తెలిపారు. వీరంతా ప్రభుత్వ వ్యతిరేకులని, లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైళ్లపై ట్రంప్



యంత్రాంగం తీరుతో నిరాశ చెందిన వారని, యూదు వ్యతిరేకులని పేర్కొన్నారు. ప్రస్తుతం అరెస్టు చేసిన వారిపై అధికారులు పలు కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# ట్రై-సిరీస్ ఫైనల్లో ఇండియా 'ఎ'

**అఫ్గానిస్తాన్‌పై 101 పరుగుల భారీ విజయం**

డంబుల్లా: శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు 'ఎ' సిరీస్‌లో భారత్ 'ఎ' జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం అఫ్గానిస్తాన్ 'ఎ' జట్టుతో జరిగిన కీలక పోరులో తిలక్ వర్మ సేన 101 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మెరుగైన నెట్ రన్‌రేట్ (౦0.797) సాయంతో పట్టికలో అగ్రస్థానానికి చేరి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 'ఎ' జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 319 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య 42 బంతుల్లోనే 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 58 పరుగులు చేసి జట్టుకు మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. అనంతరం కెప్టెన్ తిలక్ వర్మ (59 పరుగులు, 75 బంతుల్లో) బాధ్యతాయుతంగా ఆడి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దగా... ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుశాగ్ర (58 పరుగులు, 67 బంతుల్లో) అతనికి అద్భుతమైన సహకారం అందించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 104 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వైస్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 30 పరుగులు చేశాడు.

**కుప్పకూలిన అఫ్గానిస్తాన్.. నిశాంత్ సింధు 'నాలుగు' వికెట్లు**

320 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ 'ఎ' జట్టును భారత బౌలర్లు మొదటి నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. అఫ్గాన్ జట్టు 36.5 ఓవర్లలో 218 పరుగులకే ఆలౌట్ అయింది. అఫ్గాన్ బ్యాటర్లలో బాహిర్ షా (57), ఫైసల్ షినోజాదా (46) నాలుగో వికెట్‌కు 87 పరుగులు జోడించి కాసేపు ప్రతిఘటించినా ఆ భాగస్వామ్యం విడిపోయాక అఫ్గాన్ ఇన్నింగ్స్ వేగంగా ముగిసింది.



భారత బౌలర్లలో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నిశాంత్ సింధు 4 వికెట్లతో అఫ్గాన్ లోయర్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు.

పేసర్ యశ్ ఠాకూర్ రెండు వికెట్లు పడగొట్టగా.. అన్షుల్ కాంబోజ్, అనుకుల్ రాయ్, విప్రాజ్ నిగమ్, సూర్యాంశ్ శెడ్గే తలో వికెట్ పంచుకున్నారు. ఈ అద్భుత విజయంతో భారత్ 'ఎ' టోర్నీలో తమ సత్తా చాటుతూ ఫైనల్‌కు అర్హత సాధించింది.

# ఎంబాపె విశ్వరూపం

*- ఫిఫా వరల్డ్ కప్‌లో ఫ్రాన్స్ శుభారంభం*

*- 3-1 తేడాతో సెనెగల్‌పై ఘన విజయం*



ఫిఫా ప్రపంచ కప్‌లో టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఫ్రాన్స్ జట్టు తమ ప్రస్థానాన్ని ఘనంగా ఆరంభించింది. గ్రూప్-బిలో భాగంగా సెనెగల్‌తో జరిగిన హోరాహోరీ పోరులో ఫ్రాన్స్ 3-1 తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. తనపై ఉన్న భారీ అంచనాలను నిజం చేస్తూ ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబాపె రెండు సూపర్ గోల్స్ కొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతే కాకుండా ఫ్రాన్స్ తరపున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా ఎంబాపె సరికొత్త రికార్డు నెలకొల్పాడు.

**తొలి అర్ధ భాగంలో 'నువ్వా నేనా'..**

మ్యాచ్ ప్రారంభమైన తొలి అర్ధ భాగంలో గోల్ కోసం రెండు జట్లు 'నువ్వా నేనా' అన్నట్టు తలపడ్డాయి. ఫ్రాన్స్ ఆటగాళ్లు గోల్ కొట్టకుండా సెనెగల్ డిఫెండర్లు శతవిధాలా అడ్డుకున్నారు. అదే సమయంలో ఫ్రాన్స్ గోల్‌పోస్ట్ లక్ష్యంగా సెనెగల్ ఆటగాళ్లు కూడా వేగంగా దూసుకెళ్లారు. ముఖ్యంగా ఎంబాపెను అడ్డుకోవడానికి సెనెగల్ జట్టు గట్టి వ్యూహాలనే అమలు చేసింది. దీంతో ఎలాంటి గోల్ నమోదు కాకుండానే తొలి అర్ధభాగం (ఫస్ట్ హాఫ్) ముగిసింది.

**రెండో అర్ధభాగంలో ఎంబాపె మ్యాజిక్!**


ద్వితీయార్థంలో ఫ్రాన్స్ ఆటగాళ్లు మరింత దూకుడు పెంచారు. 66వ నిమిషంలో ఎంబాపె మ్యాజిక్ ప్రదర్శిస్తూ మ్యాచ్‌లో తొలి గోల్ కొట్టి ఫ్రాన్స్ ఖాతా తెరిచాడు. 82వ నిమిషంలో బ్రాడ్లీ బార్కోలా మరో అద్భుతమైన గోల్ కొట్టడంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2-0కి పెరిగింది.

**ఉత్కంఠభరిత ముగింపు**

మ్యాచ్ ముగిసే అదనపు సమయంలో (ఇంజురీ టైమ్) సెనెగల్ ఆటగాడు ఇబ్రహీం ఎంబాపె గోల్ కొట్టడంతో మ్యాచ్ స్కోరు 2-1కి తగ్గింది. దీంతో సెనెగల్ క్యాంప్‌లో ఆనందం వ్యక్తమైంది. అయితే ఆ సంతోషం నిమిషం కూడా నిలవలేదు. మరుసటి నిమిషంలోనే ఫ్రాన్స్ స్టార్ ఎంబాపె దాదాపు 30 మీటర్ల దూరం నుంచి ఊహించని రీతిలో ఒక క్లాసిక్ గోల్ కొట్టి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాడు. దీంతో ఫ్రాన్స్ 3-1 తేడాతో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ ఆటగాళ్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్ లక్ష్యంగా 8 షాట్లు కొట్టగా.. సెనెగల్ ఆటగాళ్లు కేవలం రెండుసార్లు మాత్రమే షాట్లు కొట్టగలిగారు.

# కోహ్లీ అత్యుత్తమ ఫీల్డర్ కాదు

*జాంటీ రోడ్స్ ఆసక్తికర వ్యాఖ్య*





భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీపై వరల్డ్ బెస్ట్ ఫీల్డర్‌గా గుర్తింపు పొందిన సౌతాఫ్రికా స్టార్ క్రికెటర్, కోచ్ జాంటీ రోడ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గ్రౌండ్‌లో దూకుడుగా ఉండే విరాట్ భారత అత్యుత్తమ ఫీల్డర్ కాదంటూ సంచలన కామెంట్స్ చేశాడు. కోహ్లీ అపరిమితమైన వేగం, ఉత్సాహం మాత్రమే ఫీల్డింగ్‌లో అతడిని అత్యుత్తమంగా నిలపలేవని అభిప్రాయపడ్డాడు. ఓ పాడ్‌కాస్ట్‌లో అతిథిగా పాల్గొన్న జాంటీ రోడ్స్ కోహ్లీ దూకుడు స్వభావంపై పలు విషయాలను వెల్లడించారు. 'జట్టు విజయపథంలో ఉన్నప్పుడు విరాట్ కోహ్లీ ఉత్సాహం సహచరుల్లో స్ఫూర్తి నింపుతుంది. ఆ దూకుడు స్వభావం నాకు బాగా నచ్చింది. కానీ పరిస్థితులు అనుకూలించనప్పుడు కోహ్లీ చూపే ఆగ్రహం లేదా నిరాశ డ్రెస్సింగ్ రూమ్‌లోని యువ ప్లేయర్‌పై ఒత్తిడి పెంచే ప్రమాదం ఉంది. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రశాంతంగా ఉంటూ జట్టును నడిపించడం సీనియర్ ఆటగాడిగా కోహ్లీ ఎంతో ముఖ్యం' అని జాంటీ రోడ్స్ చెప్పుకొచ్చాడు. క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్, కోహ్లీ మధ్య పోలిక అనవసరమని... ఈ అంశంపై స్పందించడం తనకు ఇష్టం లేదన్నాడు. 'కోహ్లీకి తన అద్భుతమైన ఫిట్‌నెస్‌తో సచిన్ రికార్డులను అధిగమించగల సామర్థ్యం ఉంది. అయినప్పటికీ వేర్వేరు కాలాల్లో రాణించిన ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లను పోల్చడం సరికాదు. వారిద్దరూ తమదైన శైలిలో భారత క్రికెట్‌కు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. వారి విజయాలను ఆస్వాదించాలి. కానీ వారి మధ్య పోలికలు పెట్టకూడదు' అని జాంటీ రోడ్స్ వెల్లడించాడు.

# ఫిఫా వరల్డ్ కప్ క్యాంపులో పాము కలకలం

*జర్మనీ ఆటగాళ్ల గుండెల్లో వణుకు*



ఫిఫా ప్రపంచ కప్ సమరంలో ప్రత్యర్థి జట్ల వ్యూహాల కంటే ఓ విషపూరిత పాము జర్మనీ ఫుట్‌బాల్ జట్టును వణికించింది. మెగా టోర్నీ కోసం అమెరికాలోని నార్త్ కరోలినాలో గల 'విన్‌స్టన్-సేలమ్' లో జర్మనీ జట్టు తమ బేస్ క్యాంప్ ఏర్పాటు చేసుకుంది. అయితే ఆటగాళ్లు బస చేస్తున్న శిబిరంలో గడ్డి కింద ఒక ప్రమాదకరమైన విషపూరిత పాము ఉన్నట్టు సిబ్బంది గుర్తించారు. ఒక్క జర్మనీ జట్టుకే కాకుండా నార్త్ కరోలినా పరిసరాల్లో క్యాంపులు ఏర్పాటు చేసుకున్న స్విట్జర్లాండ్, నార్వే దేశాల ఆటగాళ్లకు కూడా పాములు కనిపించాయని... దీంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని నివేదికలు వస్తున్నాయి.

ఈ అనూహ్య ఘటనపై జర్మనీ జట్టు కెప్టెన్ జాషువా కిమ్మిచ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "సాధారణంగా జర్మనీలో అయితే మేము మ్యాచ్ వ్యూహాలు, గాయాలు, తదుపరి ప్రత్యర్థి గురించి మాత్రమే ఆలోచిస్తాం. కానీ ఇక్కడ మాత్రం గడ్డిలో ఏముందో (పాములు ఉన్నాయేమో) అని ప్రతి అడుగు వేసేటప్పుడు నేల వైపు చూస్తూ ఆలోచించాల్సి వస్తోంది. నిన్న మేము ఆ పామును చూశాం... అది చాలా విషపూరితమైనదని మాకు చెప్పారు. అది కరిస్తే వెంటనే హాస్పిటల్‌కు వెళ్లాల్సిందే. ఇది ప్రాణాంతకం కాకపోవచ్చు కానీ చాలా ప్రమాదకరం. జర్మనీలో ఇంత ప్రమాదకరమైన జంతువులు ఉంటాయని నేను ఎప్పుడూ అనుకోలేదు." అని కిమ్మిచ్ పేర్కొన్నాడు.

**కాపర్ హెడ్ పాముగా గుర్తింపు:**

కిమ్మిచ్, అతని సహచర ఆటగాళ్లు చూసింది 'కాపర్ హెడ్' అనే విషసర్పమని ఒక అంతర్జాతీయ వెబ్‌సైట్ పేర్కొంది. ఇది నార్త్ కరోలినా ప్రాంతంలో సర్వసాధారణంగా కనిపించే అత్యంత విషపూరితమైన పాముగా తెలుస్తోంది. అయితే ఈ ఘటనలో ఆటగాళ్లకు ఎలాంటి హాని జరగలేదని, అందరూ సురక్షితంగానే ఉన్నారని ఫిఫా వర్గాలు వెల్లడించాయి.

# టీజీ-20 లీగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ

**టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు సొంతం చేసుకున్న శ్రీనిధి యూనివర్శిటీ**

హైదరాబాద్: ఐపీఎల్ తరహాలో తెలంగాణలో తొలిసారి నిర్వహిస్తున్న టీజీ-20 లీగ్ టైటిల్ స్పాన్సర్ హక్కులను శ్రీనిధి యూనివర్సిటీ దక్కించుకుంది. ఎనిమిది ఫ్రాంచైజీ జట్లతో జరిగే మెగా లీగ్‌కు ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తాడని హెచ్‌సీఏ సెక్రటరీ జీవన్ రెడ్డి, లీగ్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ఆగం రావు తెలిపారు. టైటిల్ స్పాన్సర్‌గా తొలి సీజన్‌కు శ్రీనిధి రూ.3కోట్లు, రెండో సీజన్‌కు రూ.5కోట్లు, మూడో ఏడాది రూ.7కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నామని జీవన్‌రెడ్డి వెల్లడించారు.

తొలి సీజన్ విన్నర్‌కు రూ.కోటి, రన్నరప్‌కు రూ.50లక్షలు, 3, 4 స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి అందిస్తామని పేర్కొన్నారు. టోర్నీ షెడ్యూల్‌ను కూడా ప్రకటించారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ మినహా ఐపీఎల్ రూల్స్ అన్నీ టీజీ20లో ఉంటాయని ఆగం రావు తెలిపారు. ఈ నెల 21న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఆరంభ మ్యాచ్‌లో పాలమూరు స్ట్రయికర్స్, ఖమ్మం ఏసెస్ జట్లు పోటీపడనున్నాయి.

బీసీసీఐ అనుమతి లేకుంటే తిలక్, సిరాజ్ వస్తారా!

ఈ టోర్నీకి బీసీసీఐ అనుమతి లేదని జరుగుతున్న ప్రచారాన్ని జీవన్ రెడ్డి, ఆగం రావు ఖండించారు. బోర్డు అనుమతి లేకపోతే తిలక్‌వర్మ, సిరాజ్ లాంటి టీమిండియా క్రికెటర్లు టోర్నీలో పాల్గొనేందుకు ఎందుకు ముందుకొస్తారని ప్రశ్నించారు. లీగ్ ఆరంభానికి ముందే అన్ని ఫ్రాంచైజీల ప్లేయర్లు, కోచింగ్ స్టాఫ్ బీసీసీఐ అవినీతి నిరోధక యూనిట్ (ఏసీయూ) కంట్రోల్లోకి వెళ్తారని చెప్పారు. బోర్డు త్వరలోనే ఏసీయూ అధికారులను హైదరాబాద్‌కు పంపిస్తుందని తెలిపారు.



చైతన్య రథం
సినిమా
గురువారం 18 జూన్ 2026 X

# కార్తీక్ ఆర్యన్ సరసన శార్వరీ వాఘ్

ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో వచ్చిన 'మై వాపస్ ఆవుంగా' సినిమాతో థియేటర్లలో సందడి చేస్తోంది బాలీవుడ్ కథానాయిక శార్వరీ వాఘ్. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపుతూ దూసుకుపోతున్న ఈ ముద్దుగుమ్మ, తాజాగా మరో బంపర్ ఆఫర్‌ను తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. హిందీ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు లవ్ రంజన్ ఒక సరి కొత్త సినిమాను తెరకెక్కిస్తున్నట్టు బాలీవుడ్ వర్గాల్లో గట్టిగా గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రంలో కార్తీక్ సరసన కథానాయికగా నటించేందుకు శార్వరీ వాఘ్‌ను చిత్ర బృందం ఎంపిక చేసినట్లు సమాచారం.యువతను విపరీతంగా ఆకట్టుకునే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రాలను తెరకెక్కించడంలో లవ్ రంజన్‌కు మంచి పేరుంది. అలాంటి క్రేజీ డైరెక్టర్‌తో కలిసి పనిచేయడానికి శార్వరీ కూడా ఎంతో ఉత్సాహంగా ఉందని టాక్. ఈ ప్రాజెక్ట్‌కు



సంబంధించిన స్క్రిప్ట్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఏడాది ఆఖర్లోనే (డిసెంబరు నాటికి) ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలని చిత్ర బృందం నిర్ణయించుకున్నట్టు బాలీవుడ్ వర్గాల్లో గట్టి చర్చ నడుస్తోంది. కార్తీక్ ఆర్యన్-శార్వరీ సరికొత్త కాంబినేషన్ వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి!

# థియేటర్ కంటే బెటర్‌గా ఓటీటీ వెర్షన్

## 'సింగ్ గీతం'పై నాగ్ అశ్విన్ కామెంట్స్






ప్రముఖ దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నాగ్ అశ్విన్ నిర్మించిన తాజా చిత్రం 'సింగ్ గీతం'. ఈ నెల 12న థియేటర్లలో విడుదలై మంచి టాక్‌తో నడుస్తోంది. అయితే ఈ సినిమా ఓటీటీపై తాజాగా స్పందించాడు చిత్ర నిర్మాత నాగ్ అశ్విన్. ఈ సినిమా ఓటీటీ వెర్షన్ థియేటర్ వెర్షన్ కంటే భిన్నంగా ఉండబోతుందని తెలిపారు. క్లైమాక్స్‌లోని కంప్యూటర్ గ్రాఫిక్స్ ఇంకా మెరుగ్గా ఉండాల్సిందని అనిపించిందని, డిజిటల్ విడుదలకు ముందు సీజీని మరింత మెరుగుపరచాలని తమ బృందం యోచిస్తోందని వెల్లడించారు. ఈ చిత్రాన్ని కొన్ని దశాబ్దాల పాటు ప్రేక్షకులు డిజిటల్ వేదికగా ఆదరిస్తారని... అందుకే భవిష్యత్తు రోజులకు అనుగుణంగా సాంకేతిక మార్పులు చేయాలని నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా కథా నాయకుడు విజయ్ దేవరకొండ అతిథి పాత్రలో మెరిశారు. ఈ చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌కు విక్రయించినట్టు సమాచారం వున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం థియేటర్లలో ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభిస్తుండడంతో ఓటీటీలోకి రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.



# 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' మూవీని క్వాలిటీతో తీశాం

## ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో, నిర్మాత వడ్డే నవీన్

వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. ఈ మూవీతో కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్‌కి జోడీగా రాశీ సింగ్ నటించారు. ఈ చిత్రం (శుక్రవారం) రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా ప్రముఖ నిర్మాత కేఎస్ రామారావు, దామోదర్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

వడ్డే నవీన్ మాట్లాడుతూ... "'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' సినిమాకి టీం అంతా కలిసి ఎంతో ప్యాషన్‌తో పని చేశారు. డబ్బుల కోసం పని చేసినట్టుగా నాకు ఎక్కడా అనిపించలేదు. అందరూ ఇష్టపడి, కష్టపడి పని చేశారు. రాశీ సింగ్‌కి మంచి టాలెంట్ ఉంది. ఆమె ఎప్పుడూ పర్‌ఫెక్షన్ కోసం ట్రై చేస్తుంటారు. ఈ పన్నెండేళ్లలో నేను సినిమాలు చేయకపోయినా అభిమానులు నా మీద ప్రేమను కురిపిస్తూనే ఉన్నారు. ఈ జర్నీలో మీడియా కూడా సపోర్ట్ చేస్తూనే వచ్చింది. సినిమా ఆరంభం నుంచే వేగంగా దూసుకుపోతోంది. క్లైమాక్స్ థ్రిల్లింగ్‌గా ఉంటుంది. మంచి క్వాలిటీతో మూవీని తీశాం. థియేటర్‌కు వచ్చి మాసినిమాని చూడండి. కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.

కేఎస్ రామారావు మాట్లాడుతూ .. 'వడ్డే రమేష్‌తో నాకు ఎంతో మంచి అనుబంధం ఉంది. ఆయన దమ్మున్న నిర్మాత. నవీన్ చేసిన సినిమాల్లో దాదాపు అన్నీ హిట్ అయ్యాయి. ఇన్నేళ్ల గ్యాప్ ఎందుకు తీసుకున్నారో నాకు తెలీదు. కానీ అప్పుడు చూసినట్టుగానే ఇప్పుడు కూడా కనిపిస్తున్నారు. టీజర్, ట్రైలర్ చాలా రిఫ్రెషింగ్‌గా కనిపించాయి. అందరూ నిజాయితీతో ఎంతో కష్టపడి, ఇష్టపడి తీశారనిపిస్తోంది. కమల్ చాలా గొప్పగా మాట్లాడారు. ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు.

# ప్రత్యేక సెట్లో... 'లవ్ అండ్ వార్'



బాలీవుడ్ కథానాయకుడు రణబీర్ కపూర్, అలియా జంటగా తెరకెక్కుతోన్న చిత్రం 'లవ్ అండ్ వార్. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా సెట్లో మళ్లీ సందడి మొదలైంది. కొద్దిరోజుల విరామం తర్వాత చిత్రీకరణ గురువారం నుంచి తిరిగి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఓ పాట చిత్రీకరణకు ముంబయి శివార్లలో భారీ సెట్ తీర్చిదిద్దుతున్నట్లు తెలిసింది. ఈ సన్నివేశాలను రణ్‌బీర్, అలియా, విక్కీ కౌశల్‌తో పాటు 200 మంది నృత్యకారులపై తెరకెక్కించనున్నట్టు సమాచారం. రణ్‌బీర్ కపూర్ నటించిన రామాయణ చిత్రం ఈ ఏడాది చివర్లో విడుదలకు సిద్ధంగా ఉండటంతో 'లవ్ అండ్ వార్' చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరిలో విడుదల చేయనున్నట్లు సినీ వర్గాల సమాచారం.

# 'ది ప్యారడైజ్' ప్రమోషన్స్ కోసం స్పెషల్ బడ్జెట్!

నేచరల్ స్టార్ నాని గత కొన్ని సంవత్సరాలుగా తెలుగు మార్కెట్‌కే పరిమితం కాకుండా పాన్‌ఇండియా స్థాయిలో తన గుర్తింపును విస్తరించుకునేందుకు ప్రత్యేకంగా కృషిచేస్తున్నారు. ప్రతి సినిమా రిలీజ్‌కు ముందు దాదాపు నెల రోజుల పాటు వివిధ భాషల్లో ఇంటర్వ్యూలు, ప్రమోషనల్ ఈవెంట్లు నిర్వహిస్తూ ఇతర భాషల ఆడియన్స్‌ను చేరుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా దసరా సినిమాతో పాన్ ఇండియా మార్కెట్‌లో బలమైన ముద్ర వేయాలని నాని భావించినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఆ తర్వాత వచ్చిన హాయ్ నాన్న, హిట్ 3 సినిమాలకు కూడా తెలుగు రాష్ట్రాలు కాకుండా ఇతర భాషల్లో కూడా విస్తృత ప్రమోషన్స్ చేసినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన రెస్పాన్స్ కనిపించలేదు.

అయితే ఇప్పుడు తనకెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌గా భావిస్తున్నది ప్యారడైజ్ విషయంలో నాని మరింత దూకుడుగా వ్యవహరించేందుకు సిద్ధమవుతున్నారు. డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సౌత్ ఆడియన్స్‌తో పాటు నార్త్ మార్కెట్‌ను కూడా ఆకట్టుకునే కంటెంట్ ఈ సినిమాలో ఉందనే నమ్మకంతో నాని ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే ఈ సినిమా కోసం ప్రత్యేక పాన్ ఇండియా ప్రమోషనల్ ప్లాన్ రూపొందించగా... రిలీజ్‌కు ముందే అన్ని ప్రధాన నగరాల్లో భారీ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

ఇక నిర్మాత సుధాకర్ చెరుకూరి కూడా ప్రమోషన్స్ కోసం భారీ బడ్జెట్ కేటాయించినట్టు సమాచారం. ముఖ్యంగా హిందీ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ రికార్డు స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో మంచి బజ్ సొంతం చేసుకున్న ఈ సినిమా ఇతర భాషల్లోనూ అదే స్థాయి క్రేజ్ సంపాదించాల్సిన అవసరం ఉంది. అందుకోసం ట్రైలర్, పాటలు దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.




# స్విమ్మింగ్ కోసమే దుబాయ్ వెళ్లా: వేదాంత్

నటుడు మాధవన్ కుమారుడు వేదాంత్ తాజాగా చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 20 ఏళ్ల ఫ్రీస్టైల్ స్విమ్మర్ అయిన వేదాంత్ తన కెరీర్ కోసం భారత్‌లోని జీవితాన్ని వదులుకుని దుబాయ్ వెళ్లినట్టు చెప్పాడు. కొవిడ్-19 సమయంలో భారత్‌లో స్విమ్మింగ్ పూల్స్ మూతపడటంతో 2020లో వేదాంత్ కుటుంబంతో సహా దుబాయ్ వెళ్లాడు. ఆ మార్పు గురించి వేదాంత్ తాజాగా మాట్లాడుతూ.. 'షిఫ్ట్ అయితే మంచిగానే జరిగింది. మా ఆస్తులన్నీ ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాం. కానీ నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావడం మాత్రం నాకు షాక్‌లాగే అనిపించింది. పుట్టినప్పటి నుంచీ భారత్‌లోనే ఉన్నాను. కొత్త దేశానికి, కొత్త స్కూల్ లైఫ్‌కు అలవాటు పడటం, అదే సమయంలో స్విమ్మింగ్, సోషల్ లైఫ్ మేనేజ్ చేయడం కాస్త కష్టమైంది. కొవిడ్ పరిస్థితుల్లో దుబాయ్‌కు రావడం నా కెరీర్‌కు మంచి నిర్ణయమే. దానివల్లే నేను డెన్మార్క్‌లో రేస్ చేయగలిగాను.' అన్నాడు.